thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 77 | కరీంనగర్ మంగళవారం, 27 మే 2025 | ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం | వెల - 1.00

## కొచ్చి తీరంలో హై అలెర్ట్

కొచ్చి : కొచ్చికి సమీపంలో కంటెయినర్ల నౌక మునిగిపోవడంతో కోస్ట్‌గార్డ్, కేరళ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. మునిగిన కొన్ని కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు ఉండడంతో కొచ్చి తీరంలో హైఅలెర్ట్ ప్రకటించాయి. ఒడ్డుకు కొట్టుకువచ్చే కంటెయినర్లనుగానీ, చమురుతెట్టునుగానీ తాకకూడదని ప్రజలను హెచ్చరించాయి. ఆఫ్రికా ఖండంలోని లైబేరియా దేశానికి చెందిన ఆ సరకు రవాణా నౌక అరేబియా సముద్రంలో మునిగిపోయింది. నౌకలోని మొత్తం 24 మంది సిబ్బందిని ఇండియన్ కోస్టు గార్డు కాపాడింది. 180మీటర్ల పొడవున్న ఆ నౌకలో మొత్తం 640 కం టెయినర్లు ఉన్నాయి. అవన్నీ సముద్రంలో మునిగిపోయినట్టు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 13 కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు, 12 కంటెయినర్లలో కాల్షియం కార్బైడ్ ఉన్నట్టు పేర్కొంది.




హైదరాబాద్: నైరుతి రుతు పవనాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. రాబోయే మూడు రోజుల్లో మిగిలిన ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నట్లు ఐఎండీ తెలిపింది. ఉత్తర తెలంగాణపై ద్రోణి కొనసాగుతున్న నేపథ్యంలో తెలంగాణలో సోమవారం నుంచి గురువారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని, ఇతర జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.

# బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న "లేఖ" కాక



గులాబీ పార్టీలో కవిత లేఖ రచ్చ రేపుతోంది. తెలంగాణ రాజకీయాల్లో కూడా ఎమ్మెల్సీ కవిత లేఖ కలకలం రేపుతోంది. కవిత సొంత పార్టీ పెడుతున్న వార్తలు... కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తారన్న ప్రచారంతో గులాబీ పార్టీలో తీవ్ర ఉత్కంఠ పరిస్థితులు నెల కొన్నాయి. ఈ పరిస్థితుల్లో ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్... అధ్యక్షుడు కేసీఆర్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారు. పార్టీలో ఆధిపత్య ధోరణి కనిపిస్తుందా, లేక ఎమ్మెల్సీ కవితకు ప్రాధాన్యం తగ్గిందా అని చర్చ జరుగుతుండగా కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ అయ్యారు. దీంతో బీఆర్ఎస్ పార్టీలో ఏం జరుగుతోందని చర్చ మొదలైంది. " మా మీద విమర్శలు తరువాత చేయండి, ముందు మీ కుటుంబంలో తలెత్తిన సంక్షోభమా.. లేక పార్టీలో తలెత్తిన సంక్షోభమా తేల్చుకోండి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ నేతలు, మంత్రులు కౌంటర్లు వేస్తున్నారు.

**డాడీ ఏం చేద్దాం..** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సిద్దిపేట జిల్లాలోని ఎర్రవల్లి ఫామ్ హౌస్ కు వెళ్లిన కేటీఆర్ తన తండ్రి కేసీఆర్ తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కవిత లేఖ, ఆమె అసంతృప్తి, బీఆర్ఎస్ రజతోత్సవ సభలో బీజేపీపై విమర్శలు చేయకపోవడం, తనను నొప్పించిన, జైల్లో పెట్టి వేధించిన కమలం పార్టీకి ఎందుకు దగ్గరవుతున్నారనేలా కవిత లేఖలోని అంశాలపై చర్చించేందుకు కేసీఆర్, కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ అంశాలతో పాటు తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు, బీఆర్ఎస్ పోరాట ఫలితంగా రాష్ట్ర అవతరణ అని నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సైతం వీరు చర్చించనున్నారని సమాచారం. లిలికవిత లేఖతో పాటు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. కాళేశ్వరం నోటీసుల అంశంపైనా డిస్కస్ చేసినట్లు తెలుస్తోంది. కవిత లేఖ ఎపిసోడ్ తర్వాత తొలిసారి కేసీఆర్ ను కలిశారు కేటీఆర్. తదనంతర పరిణామాల నేపథ్యంలో కేసీఆర్ ను కేటీఆర్ కలవడం ప్రాధాన్యంత సంతరించుకుంది. లిలికవితకు పార్టీలో ప్రాధాన్యం తగ్గిందన్న అంశంపైనా చర్చ జరగుతోంది.

# కేసీఆర్‌పై రేవంత్ బ్రహ్మాస్త్రం

## - టైం చూసి మరీ..!!



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. బీఆర్ఎస్ లో కవిత లేఖ తరువాత అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అటు ఢిల్లీ కేంద్రంగా రేవంత్ పార్టీ పరంగా కీలక నిర్ణయాల పైన చర్చిస్తున్నారు. ఈ వారంలోనే మంత్రివర్గ విస్తరణ పూర్తయ్యే అవకాశం ఉంది.

బీఆర్ఎస్ అంతర్గత సమస్యలు ఎదుర్కొంటున్న వేళ రేవంత్ ఇదే సరైన సమయంగా భావిస్తున్న రేవంత్ బీఆర్ఎస్ పైన మరో అస్త్రం ప్రయోగించేందుకు సిద్దమయ్యారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న కీలక ప్రకటనకు సమాయత్తం అవుతున్నారు.

**రేవంత్ కొత్త వ్యూహం...** ముఖ్యమంత్రి రేవంత్ వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు వాయిదా పడు తూ వస్తున్న మంత్రివర్గ విస్తరణకు అనుమతి దక్కింది. ఈ నెలాఖరులోగా మంత్రివర్గ విస్తరణ పూర్తి కానుంది. ఆ వెంటనే పెండింగ్ లో ఉన్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు వీలుగా సీఎం రేవంత్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేళ ఎన్నికల పైన ప్రకటన చేసే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్ స్థానిక సంస్థల ఎన్నికల పైన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ (పీఆర్) కమిషనర్ సృజన, ఇతర ఉన్నతాధి కారులతో సమీక్ష నిర్వహించారు. ఆ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసి ఉంచామని అధికారులు చెప్పినట్టు తెలుస్తోంది.

**సమరానికి సై...** సీఎంతో భేటీ అనంతరం తొలిసారిగా కమిషనర్ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఇతర ముఖ్య అధికారులతో సమీక్ష చేసినట్లు సమాచారం. ఏ సమయంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ వచ్చని, సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రాజకీయంగానూ స్థానిక సంస్థల ఎన్నిక ల నిర్వహణకు ఇదే సరైన సమయంగా సీఎం రేవంత్ భావిస్తున్నారు.

తాము అమలు చేస్తున్న పథకాలతో గ్రామాల్లో తమకు అనుకూల వాతావరణం ఉందని అంచనా వేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకత్వంలో నెలకున్న అంతర్గత సమస్యల కారణంగా కేడర్ కు దిశా నిర్దేశం కష్టంగా మారు తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. దీంతో, జూన్ లోనే ఎన్నికలను పూర్తి చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ముగిసి ఏడాది దాటిపోయింది.

**ఎన్నికలకు సిద్ధం...** కేంద్రం, 15వ ఫైనాన్స్ నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన నిలిచింది. ఇక, ఇప్పుడు ఎన్నికలకు వెళ్తే సన్నబియ్యం, రేషన్‌కార్డుల పంపిణీ, యువవికాసం వంటి పథకాల అమలు అంశం కలిసి వస్తుందని కూడా హస్తం నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఆ పథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం, డిప్యూటీ సీఎం పలు సూచనలు ఇచ్చారు. దీంతో.. జూన్ 2న ప్రకటన.. ఆ తరువాత ఎన్నికల కార్యాచరణ మొదలు పెట్టే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. అటు బీఆర్ఎస్ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము సిద్దంగా ఉన్నామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారుతున్నాయి.




# కనీవినీ ఎరుగని రీతిలో

# టీడీపీ మహానాడు

## విస్తృత ఏర్పాట్లు చేసిన పార్టీ వర్గాలు!!

## ఉభయ రాష్ట్రాల నుండి లక్షలాదిగా తరలివచ్చే అవకాశం

కడప : కడప వేదికగా తెదేపా మహానాడు సంబరం (నేడు) మంగళవారం ప్రారంభమవుతోంది. తెదేపా చరిత్రలో తొలిసారిగా వైఎస్సార్ కడప జిల్లాలో జరుగుతున్న కార్యక్రమానికి ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తి అయ్యాయి. ఇప్పటికే మంత్రులంతా తరలివచ్చారు. పార్టీ తోరణాలు, కటౌట్లు, ఫ్లెక్సీలతో మహానాడు ప్రాంగణం, కడప, కమలాపురం నియోజకవర్గాలు పసుపుమయమయ్యాయి. నగర శివార్లలో ఉన్న కమలాపురం నియోజకవర్గం పబ్బాపురం సమీపంలోని 150 ఎకరాల విస్తీర్ణంలో మహానాడు నిర్వహించనున్నారు. మంత్రులు, కీలక నేతలు కడపలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాయలసీమ వాసుల ఆకాంక్షలు నెరవేర్చేలా కడపలో మహానాడు నిర్వహిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మహానాడు ఏర్పాట్లపై సహచర మంత్రులు, కీలక నేతలతో సమావేశమైన మంత్రి మాట్లాడుతూ.. రాయలసీమ డిక్లరేషన్‌పై ప్రధానంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఈ నెల 29న జరిగే బహిరంగ సభకు 5 లక్షల మందిపైగా తరలివస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుండే కాక తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి టిడిపి శ్రేణులు భారీగా వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఏపిలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో తెలంగాణలో సైతం టిడిపి పుంజుకునే అవకాశాలు ఉండటం, రానున్న రోజుల్లో పార్టీకి పూర్వ వైభవం వస్తుందనే విశ్వాసం పెగడంతో పార్టీ శ్రేణులు మహానాడుకు వచ్చేందుకు ఉత్సాహం చూపుతున్నారు. గతంలో జరిగిన మహానాడుకు భిన్నంగా కడప మహానాడు ఉంటుందని పేర్కొన్నారు. వేడుక ప్రాంగణంలో ఏర్పాట్లను వివిధ కమిటీల సభ్యులైన మంత్రి అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవి, నారాయణ, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పార్థసారథి, బీసీ జనార్దన్‌రెడ్డి, వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి దేవినేని ఉమ, ఎమ్మెల్సీలు ఆలపాటి రాజా, రాంగోపాల్‌రెడ్డి తదితరులు సమీక్షించారు.

**ప్రతినిధుల నమోదుతో ప్రారంభం...** మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రతినిధుల నమోదుతో మహానాడు ప్రారంభం కానుంది. అనంతరం పార్టీ చరిత్రను వివరిస్తూ రూపొందించిన ఫొటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరాల్ని ప్రారంభిస్తారు. ఉదయం 10.45కు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళితో మహానాడు లాంఛనంగా ప్రారంభం కానుంది. అనంతరం ఇటీవల మరణించిన నాయకులు, కార్యకర్తలకు సంతాపం ప్రకటిస్తారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నివేదిక, ఉదయం 11.30కి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్వాగత ప్రసంగం, పార్టీ జమా ఖర్చులపై కోశాధికారి నివేదిక ఉంటాయి. 11.50కి పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేస్తారు.

**తొలి రోజు సంస్థాగత నిర్మాణంపై చర్చ,,,** తొలిరోజు పార్టీ ప్రతినిధుల సభ జరగనుంది. సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తు కార్యాచరణ, పార్టీ మౌలిక సిద్ధాంతాలపై శ్రేణులకు నేతలు దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ రూపొందించిన ఆరు సూత్రాల ఆవిష్కరణ, నియమావళిలో సవరణలపై ప్రధానంగా చర్చ జరగనుంది. రెండో రోజు ప్రతినిధుల సభతో పాటు పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నివాళి, 6 సూత్రాల్లోని వివిధ అంశాలు, ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన ముసాయిదా తీర్మానాలపై విస్తృతంగా చర్చించి.. ఆమోదించనున్నారు. తొలి రెండు రోజులు 25 వేల మంది హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు చేశారు. 450 మంది కూర్చునేలా సభావేదిక నిర్మించారు.

**లోకేశ్ రూపొందించిన 6 సూత్రాలకు చోటు...** చంద్రబాబు ప్రసంగం తర్వాత పార్టీ మౌలిక సిద్ధాంతాలపై చర్చిస్తారు. 'కార్యకర్తే అధినేత, యువగళం, తెలుగుజాతి- విశ్వఖ్యాతి, స్త్రీ శక్తి, పేదల సేవలో- సోషల్ రీఇంజినీరింగ్, అన్నదాతకు అండ' అనే ఆరు అంశాల్ని సభ ముందుంచుతారు. నియమావళిలో సవరణలపై చర్చ జరగనుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు తెదేపా జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్ ఇస్తారు. భోజన విరామం అనంతరం 'కార్యకర్తే అధినేత', 'యువగళం' అంశాలపైనా చర్చిస్తారు. అభివృద్ధి వికేంద్రీకరణ- వెనుకబడిన ప్రాంతాలపై శ్రద్ధ, సాంకేతిక పరిజ్ఞానంతో పాలనను మరింత సులభతరం చేయడం, వాట్సప్ గవర్నెన్స్‌పై చర్చ నిర్వహిస్తారు.

**తెదేపాలో లోకేశ్‌కు మరిన్ని కీలక బాధ్యతలు?...** తెదేపా ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశాన్ని కడపలో మంగళవారం నుంచి జరగనున్న మహానాడులో పార్టీ నాయకులు ప్రస్తావించే అవకాశం ఉంది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న పార్టీ అధినేతగా.. దిల్లీలో జరిగే సమావేశాలకు హాజరవడం, ఇటు రాష్ట్ర ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు సమావేశాలు, సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనలతో సీఎం చంద్రబాబు తీరిక లేకుండా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పార్టీపై లోకేశ్ పూర్తిస్థాయిలో దృష్టి సారించేందుకు వీలుగా మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించనున్నారని భావిస్తున్నారు.




## సరస్వతి పుష్కరాలు.. చివరి రోజు కొనసాగుతున్న రద్దీ

జయశంకర్ భూపాలపల్లి: కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ఘనంగా సాగుతున్నాయి. నేటితో పుష్కరాలు ముగియనున్నాయి. దీంతో చివరి రోజైన సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. పవిత్ర త్రివేణి సంగమంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారు. నేడు ముగింపు వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణలో సరస్వతి నది పుష్కరాలు మే 15న ప్రారంభమైన సంగతి తెలిసిందే.

## పదేళ్లలో గిరిజనుల గురించి కేసీఆర్ ఆలోచించారా?: భట్టి విక్రమార్క



నాగర్‌కర్నూల్: భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రూ.12 వేల కోట్లతో ఇటీవల నల్లమల డిక్లరేషన్ ప్రకటించామన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా పోల్కంపల్లి, బొమ్మంపల్లి, పదర సబ్ స్టేషన్లను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు.


అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న పదేళ్లలో గిరిజనుల గురించి కేసీఆర్ ఆలోచించారా? అని ప్రశ్నించారు. ఉద్యోగులకు గత భారాస ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బకాయిలను క్రమంగా చెల్లిస్తున్నామన్నారు. "ఉద్యోగులకు రూ.10 వేల కోట్ల బకాయిలు ఉంటే రూ.8వేల కోట్లు చెల్లించాం. రాష్ట్రంలో ఇళ్లులేని కుటుంబం ఉండకూడదని ప్రభుత్వం ఆలోచిస్తోంది. రూ.5 లక్షలకు తగ్గకుండా ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు ఇవ్వాలని ఆలోచిస్తున్నాం. విద్యావ్యవస్థను గాడిలో పెడుతున్నాం." అని భట్టి విక్రమార్క అన్నారు.




## కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో సీఎం ఫొటో పెట్టేందుకు యత్నం.. ఉద్రిక్తత

సిరిసిల్ల: సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆఫీసులో సీఎం ఫొటో పెట్టేందుకు కాంగ్రెస్ నేతలు యత్నించారు. ప్రొటోకాల్ పాటించాలని డిమాండ్ చేశారు. వారిని భారాస నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఇరుపార్టీల నేతల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పగిలిపోవడంతో కాంగ్రెస్ నాయకులు కోపోద్రిక్తులయ్యారు. పోలీసులు లాఠీఛార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇరువర్గాల తోపులాటతో సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ వేలికి గాయమైంది.

## తెలంగాణలో వాతావరణ పరిస్థితిపై ఐఎండీ ప్రకటన



హైదరాబాద్: రుతుపవనాల రాకతో తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై భారత వాతావరణ శాఖ ప్రకటన విడుదల చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజిగిరి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కుమరం భీమ్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో సోమవారం రాత్రి 7 గంటల వరకు వర్షం కురిసే అవకాశమున్నట్లు ఐఎండీ పేర్కొంది.

**హైదరాబాద్‌లో వర్షం..** ఉపరితల ద్రోణి కారణంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎస్ఆర్ నగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది.

## 'నిందలు..దండాలు..చందాలు..' ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టో శతాబ్దపు అతిపెద్ద మోసమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. పార్టీ నుంచి వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలకు కర్రు కాల్చి వాతపెట్టాలన్నారు. 'నిందలు, దండాలు, చందాలు' సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విధానమని ఎద్దేవా చేశారు.

గద్వాల నియోజకవర్గానికి చెందిన పలువురు భాజపా, కాంగ్రెస్ కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో భారాసలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం భయపడుతోందని అన్నారు. జూన్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామని, బూత్ స్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.




## యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు పాక్‌లో ఏకే 47లతో భద్రత!

దిల్లీ: పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఓ స్కాటిష్ యూట్యూబర్ తీసిన వీడియోలో జ్యోతి మల్హోత్రాకు సంబంధిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆమె పాకిస్థాన్‌లో పర్యటించిన సమయంలో స్కాటిష్ యూట్యూబర్ క్యాలమ్ మిల్ సైతం తన పర్యటనలో భాగంగా పలు వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. వాటిలోని ఓ వీడియోలో లాహోర్‌లోని అనార్కలి బజార్‌లో జ్యోతి వీడియోలు తీస్తూ క్యాలమ్ మిల్‌కు ఎదురు పడ్డారు. అతడు జ్యోతిని పలకరిస్తూ..తాను స్కాటిష్ యూట్యూబర్‌గా పరిచయం చేసుకున్నాడు. తాను భారత్ నుంచి వచ్చానని జ్యోతి సమాధానం చెప్తూ.. 'మొదటి సారి పాక్‌కు వచ్చారా' అని అతడిని ప్రశ్నించింది. ఇప్పటి వరకు ఐదుసార్లు వచ్చినట్లు అతడు చెప్పాడు.

పాకిస్థాన్ ఆతిథ్యం గురించి మిల్ ఆమె అభిప్రాయాన్ని అడగగా.. చాలా బాగుందని సమాధానం ఇచ్చింది. అనంతరం అమె వెళ్తుండగా.. ఆరుగురు వ్యక్తులు సాధారణ దుస్తుల్లో ఏకే 47 తుపాకీలతో జ్యోతికి భద్రత కల్పిస్తున్నట్లు గుర్తించిన మిల్ వారి ఆయుధాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వారు ధరించిన జాకెట్లపై "నో ఫియర్" అని రాసి ఉన్నట్లు వీడియోలో కనిపించింది. ఆమెకు అన్ని తుపాకులతో భద్రత కల్పించాల్సిన అవసరం ఏముంది అంటూ అతడు తన అభిమానులను ఉద్దేశించి ప్రశ్నించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలో ఆమె చుట్టూ మరికొంతమంది పర్యాటకులు ఉండడంతో సాయుధులు ఆమెకు మాత్రమే భద్రత కల్పించారా? లేదా? ఆమెతో ఉన్న బృందం మొత్తానికీ భద్రత కల్పించారా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. గూఢచర్యం కేసుకు సంబంధించి జరుగుతున్న దర్యాప్తులో.. పాక్ ఇంటెలిజెన్స్ అధికారులతో తనకు సంబంధాలున్నట్లు జ్యోతి మల్హోత్రా అంగీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు.

పాక్ హైకమిషన్‌లో పనిచేసే డానిష్‌తో తాను నిత్యం టచ్‌లో ఉండేదాన్నని పేర్కొంది. 2023లో వీసా కోసం పాక్ హైకమిషన్‌కు వెళ్లిన సమయంలో తొలిసారి డానిష్ పరిచయం అయ్యాడని ఆమె వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా జ్యోతి పాక్‌కు సమాచారం చేరవేసినట్లు అనుమానిస్తున్నారు. పాక్ హైకమిషన్ కార్యాలయానికి వీసా కోసం వచ్చే వారిని ట్రాప్ చేసి వారిని డానిష్ గూఢచర్యానికి వాడుకొనేవాడని.. యూట్యూబర్ జ్యోతి కూడా వీసా కోసం వెళ్లగా ఆమెను ట్రాప్ చేశాడని అధికారులు పేర్కొన్నారు.

## పాక్‌కు గూఢచర్యం ఆరోపణలు.. సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి అరెస్ట్



భారత్‌కు సంబంధించిన సున్నిత సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్న వారిని గుర్తించి అరెస్టులు చేస్తున్నారు.

ఈ జాబితాలో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన సిబ్బంది ఒకరు ఉండటం కలకలం సృష్టిస్తోంది. తాజాగా సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి మోతీరామ్ జాట్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ అదుపులోకి తీసుకుంది. 2023 నుంచి పాక్ ఇంటెలిజెన్స్ అధికారులతో అతడు టచ్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. "నిందితుడు మోతీరామ్ జాట్ గూఢచర్యానికి పాల్పడ్డాడు. దేశ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులతో పంచుకున్నాడు. వేర్వేరు మార్గాల్లో పీఐఓల నుంచి డబ్బులు అందినట్లు గుర్తించాం" అని ఎన్ఐఏ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ అభియోగాలపై అతడిని దిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక న్యాయస్థానం అతడిని జూన్ 6వరకు ఎన్ఐఏ కస్టడీకి అప్పగించింది. పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. కొన్ని వారాల వ్యవధిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా 10 మందికిపైగా అరెస్టయిన సంగతి తెలిసిందే.

పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితులు పాక్ నిఘావర్గాలకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు ఇప్పటివరకు చేపట్టిన దర్యాప్తులో వెల్లడైందన్నారు. వారి ఆర్థిక లావాదేవీలను సునిశితంగా పరిశీలిస్తున్నామని, ఎలక్ట్రానిక్ పరికరాల ఫోరెన్సిక్ విశ్లేషణ కూడా చేస్తున్నట్లు చెప్పారు.



# భారీ వర్షం.. జనం విలవిల

## హైదరాబాద్‌లో భారీ వర్షం. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ జామ్..

హైదరాబాద్ :ఈ సంవత్సరం ముందుగానే వర్షాకాలం వచ్చింది. గత కొద్దిరోజుల నుంచి దేశ వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇక, తెలుగు రాష్ట్రాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మహా నగరం హైదరాబాద్‌లో సోమవారం భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, మాదాపూర్, మణికొండ, మెహిదీపట్నం, టోలిచౌకీ, మాసబ్‌ట్యాంక్, నాంపల్లిలో వర్షం పడింది. వర్షం కారణంగా ఐటీ కారిడార్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక, ఉత్తర తెలంగాణపై ద్రోణి కొనసాగుతున్న నేపథ్యంలో తెలంగాణలో సోమవారం నుంచి గురువారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజమాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

## దిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతల సభ



దిల్లీ : తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతల సభ దిల్లీలో జరిగింది. కులగణనపై రాహుల్ గాంధీకి అభినందనలు తెలుపుతూ ఈ సభను నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేసిన కులగణనను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు హాజరయ్యారు.

## బీజేపీని టార్గెట్ చేసిన కేటీఆర్.. వీడియోలతో సెటైర్లు

బీజేపీని ఎందుకు విమర్శించటం లేదని పార్టీ మహిళా నేత.. మరో పక్క సొంత చెల్లెలైన కల్వకుంట్ల కవిత లేఖాస్త్రం ఎఫెక్టో.. మరొకటో కాని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇవాళ బీజేపీని టార్గెట్ చేశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్, ఢిల్లీ విమానాశ్రయం వీడియోలు పెట్టి సోషల్ మీడియాలో సెటైర్లు వేశారు. హైదరాబాద్‌లో రూ.430 కోట్లు ఖర్చు పెట్టి కట్టిన చర్లపల్లి రైల్వే స్టేషన్ అయినా, లేదా ఢిల్లీ విమానాశ్రయం పైకప్పులైనా, బిజెపి మార్క్ 'అభివృద్ధి'ని చాటిచెప్పటానికి ఒక సాధారణ వర్షం సరిపోతుంది. అంటూ ఎద్దేవా చేశారు.

గతేడాది ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌లో ఊడిపోయిన పైకప్పు ఇదే కాదా? అంటూ అప్పటి వీడియో పోస్ట్ చేసిన కేటీఆర్.. చర్లపల్లి రైల్వే స్టేషన్లో పై కప్పు రేకులు ఊడిపడుతున్న వీడియో కూడా జతచేసి కామెంట్ చేశారు. వీటన్నింటినీ కూల్చివేసేందుకు ఒకే ఒక వర్షం పట్టిందన్నారు. వాళ్లు సరిగ్గా పైకప్పును కూడా నిర్మించలేకపోవడం విచారకరం. కానీ.. కాళేశ్వరం గురించి కామెంట్లు చేయాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బిజెపి ప్రవేశపెట్టిన షేప్‌షిఫ్టర్ పైకప్పుల అద్భుతమైన కొత్త మోడల్‌ను ఏ ఏజెన్సీ నిర్వహిస్తోందనని నేను ఆశ్చర్యపోతున్నాను?! అంటూ కామెంట్ చేశారు కేటీఆర్. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



# మావోయిస్టుల గమ్యం, గమనం! -ఎస్.కె. జకీర్


भारत की कम्युनिस्ट पार्टी (माओवादी)
दंडकारण्य स्पेशल जोनल कमेटी
प्रेस वक्तव्य
25 मई, 2025
भाकपा (माओवाद) के महा सचिव कामरेड नंबाला केशवराव उर्फ बसवाराज अमर रहे!
गुंडेकोट अमर शहीदों को क्रांतिकारी जोहार!
21 मई, माड के गुंडेकोट हत्याकांड का निंदा करें!!

'అవును. వాళ్ళు మరణిస్తారు. వీళ్ళంటున్న ఈ ఆఖరి యుద్ధంలో చిట్టచివరి వీరుడూ నేలకొరిగాక ఎప్పుడో చేసుకున్న ఒప్పందాల దస్త్రాలు దుమ్ము దులిపి బయటకు తీస్తారు. ఆదివాసుల్ని వాళ్ళ నేలనుండే బహిష్కరిస్తారు. వెళ్ళని వాళ్ళని ఎప్పటిలానే, చరిత్ర పొడుగూతా జరిగినట్లుగానే గూడేలకు గూడేలు తగలబెడతారు. ఈ మారణకాండను చూసిన చెట్టు ఎక్కడ సాక్ష్యం చెబుతాయోనని వేర్లతోసహా పెకలించివేస్తారు. ముక్కలై మాంసంలో కలిసి ఎగుమతైన స్పార్టకస్ అంతతో ఎవడో పుడతాడు. భగత్ సింగ్ పక్కింట్లో పుడతాడు. నల్లా ఆదిరెడ్డి, నంబాల కేశవరావ్ ఎవడో ఒకడు. స్వర్గక్కో, రేణుకో, పద్మో ఎవరో ఒకరు. మళ్ళీ వచ్చారా%%% వీళ్ళది పోరాటమంటే.. అని నలుగురం కూడి బీర్స్ చెప్పుకుంటూ వాళ్ళ పోరాటాన్ని మాట్లాడుకుందాం. తల ఉండంటే తెగి పడుతుంది. వెన్నెముక నిటారుగా ఉంటే విరిగిపోతుంది' అని మావోయిస్టు పార్టీ అభిమాని ఒకరు మే 22 న సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. కాగా 'ఒక అధ్యాయం ఇక ముగిసినట్లే. నూతన అధ్యాయం ఎలా ఉంటుందో కాలమే సమాధానం చెబుతుంది' అని ఒక మాజీ మావోయిస్టు పార్టీ నాయకుడు ఒకరు అన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్ కౌంటర్ వార్త గుప్పుమనగానే ఆయన తక్షణ స్పందన ఇది! 'భారత సైనిక బలగాలు అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో మావోయిస్టులపై పైచేయి సాధించవచ్చు కానీ, వాళ్ళు ప్రజల్ని జయించినట్టు కాదు' అని కూడా ఆయన వ్యాఖ్యానించారు. కాగా కేవలం అడవులకు మాత్రమే మనం ఎందుకు పరిమితమయ్యామో ఆలోచించుకోవాలి అని మావోయిస్టు పార్టీ సిద్ధాంత కర్తల్లో ఒకరైన కోబాడ్ గాంధీ ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. నిజమే! ఆయన మాటలను మావోయిస్టు పార్టీ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవలసిందే. 'పోరాటంతో ఆటలాడొద్దు. మీ ఆటల పర్యవసానాలను ఎదుర్కొనే సంసిద్ధత లేకపోతే అసలు విప్లవంతో ఆటలాడొద్దు. విప్లవం అంటే ప్రతిరోజూ మారిపోయే అనంతమైన పరిణామాలను గణించే విధానం. మిమ్మల్ని వ్యతిరేకించే రాజ్యానికి అధికారం, సైనిక బలం పుష్కలంగా ఉన్నాయి. మీరు అంతకన్నా బలంగా లేకపోతే ఓడిపోతారు. నశించిపోతారు' అని మార్క్స్ 'న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్' లో ఒక వ్యాసంలో వివరించారు. 'రాజకీయ వ్యూహం, దానికి అనుగుణంగా ఉండే మిలిటరీ ఎత్తుగడలు రెండింటిలోనూ తప్పులు జరిగాయి. 1920–1940 మధ్య చైనాలో విజయవంతమైన వ్యూహాన్ని మావోయిస్టులు అనుసరిస్తున్నారు. ఆ వ్యూహం మొత్తం దేశానికి అపాదించారు. భారతదేశంలో వ్యవసాయ సమాజం, ఆర్థిక రంగం రెండూ బహుముఖాలుగా చీలిపోయి ఉన్నాయి. మావో రూపొందించిన వ్యూహం మన దేశంలో కూడా విజయవంతమవుతుందన్న ఊహల్లోనే మావోయిస్టు పార్టీ నాయకత్వం ఉండిపోయింది. చైనాలో కామ్రేడ్లు జరిపిన పోరాటం కంటే, భిన్నమైన పరిస్థితుల్లో, భిన్నమైన పోరాటం తాము జరుపుతున్న వాస్తవాన్ని విప్లవకారులు తెలుసుకోవాలి' అని నక్సలైట్ ఉద్యమ విశ్లేషకుడు, చరిత్రకారుడు సమంత బెనర్జీ ఒక వ్యాసంలో అన్నారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును మే 21న ఎన్కౌంటర్ చేయడంతో నక్సలైట్ నాయకత్వం పతనం అంచున ఉన్నట్లు కనబడుతోంది. కొద్దిమంది పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు మాత్రమే చురుకుగా ఉన్నట్టు తాజాగా ఐ.బి వర్గాల అంచనా. రామన్న, హరిభూషణ్, రామకృష్ణ, కటకం సుదర్శన్ వంటి ప్రధాన నాయకులు అనారోగ్యం కారణంగా మరణించారు. లేదా ఎన్కౌంటర్లకు బలయ్యారు. సీనియర్ నాయకుడు చలపతి ఇటీవల గరియాబంద్లో జరిగిన ఎన్కౌంటర్లో హతమయ్యారు. జార్ఖండ్కు చెందిన అగ్రశ్రేణి నాయకుడు ప్రశాంత్ బోస్ను అరెస్టు చేశారు. ఈ ఎదురు దెబ్బలతో నక్సలైట్ నెట్వర్క్ చావుదెబ్బ తిన్నది. కీలకమైన నక్సలైట్ నాయకుల కదలికలపై ట్రాక్ చేయడానికి భద్రతా దళాలు డ్రోన్లు, ఉపగ్రహ ఇమేజింగ్, ఇన్ఫార్మర్ల నెట్వర్క్లను కేంద్ర ప్రభుత్వం ఉపయోగిస్తున్నది. మావోయిస్టు నాయకుల చుట్టూ ఉచ్చు బిగించడానికి సిఆర్పిఎఫ్ బెటాలియన్లు, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ఫోర్స్ యూనిట్లను బలోపేతం చేశారు. మావోయిస్టుల ఆర్థిక, లాజిస్టికల్ మద్దతు వ్యవస్థ దాదాపు స్తంభించిపోయింది. నిధుల కొరత, కీలక నాయకుల ఎన్కౌంటర్లతో మావోయిస్టు (%ఖీశీఆర్%)ఉద్యమ ప్రభావాన్ని బలహీనపరిచాయి. 'శత్రువు బలం ఎక్కువగా ఉండి, నీ బలం తక్కువగా ఉన్నప్పుడు, నీ బలమైన ప్రాంతాల్లో నీకున్న శక్తులన్నీ కూడగట్టుకొని శత్రువుకు చెందిన చిన్న చిన్న విభాగాలపై బలమైన మెరుపుదాడులు చేసి విజయాలు సాధించాలి' అనేది మావో చెప్పిన గెరిల్లా యుద్ధవ్యూహాల్లో ఒకటి. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో జరుపుతున్న దాడులతో మావోయిస్టుల 'బలమైన' ప్రాంతాల్లోనూ కదిలే పరిస్థితి లేకుండా కట్టడి కనిపిస్తోంది. మావోయిస్టులపై కేంద్ర బలగాలు తుది పోరాటం అత్యంత కీలకమైన దశలో ఉంది.

బిజెపి అనుబంధ సంస్థ సొంత పత్రిక 'ఆర్గనైజర్' కథనాన్ని బట్టి, గ్రామీణ, మారుమూల, అడవులు, కొండ, కోనల్లో మావోయిస్టుల సాయుధ గెరిల్లా దళాలను తుదముట్టించే 'ఆపరేషన్ కగార్'కు సమాంతరంగా, మావోయిస్టుల రాజకీయ అభిప్రాయాలను సమర్థించే వాళ్ళను ఏరివేసే చర్యలు కూడా ముమ్మరం కావచ్చు. పట్టణాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, మేధావులు, పౌరహక్కుల కార్యకర్తలు, కవులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు, ఇతర ప్రజాసంఘాల కదలికలపై నిఘా తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. రాడికల్ విద్యార్థి, యువజన సంఘాలు, సికాస వంటి సంఘాలలో ఇదివరకు పనిచేసి ప్రస్తుతం వివిధ నగరాల్లో, రాష్ట్రాల్లో, విదేశాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడిన వ్యక్తుల కార్యకలాపాలపైనా నిఘా పెంచనున్నారని తెలియవచ్చింది. 'కేంద్ర ప్రభుత్వ భద్రతాసంస్థల అధ్యయనాలలో అర్బన్ నక్సలిజం నాల్గవ తరం యుద్ధం (4 వ జనరేషన్ ) పరిధిలోకి వస్తుంది. నక్సలిజం కేవలం గ్రామీణ ప్రాంతాలకే పరిమితంకాదని అర్థం చేసుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో పని అనేది మావోయిస్టు వ్యూహంలో ఒక భాగం, దీనిని భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ 2004లో జారీ చేసిన 'అర్బన్ పెర్స్పెక్టివ్', 'భారత విప్లవ వ్యూహాలపై' పత్రాలలో విస్తృతంగా వివరించింది. పట్టణ ప్రాంతాల్లో నక్సల్ కార్యకలాపాలపై దృష్టి సారించే పత్రంలోని విభాగాలు భారతదేశంలో అర్బన్ నక్సలిజం సైద్ధాంతిక చట్రాన్ని అందిస్తాయి. ప్రజాయుద్ధానికి, విముక్తి పొందిన ప్రాంతాల స్థాపనకు అవసరమైన వివిధ రకాల సామర్థ్యాలను కలిగి ఉన్న కార్యకర్తలు, నాయకత్వాన్ని అందించే ప్రధాన వనరులలో పట్టణ ఉద్యమం ఒకటి అని వారి పత్రాలు స్పష్టంగా చెబుతున్నాయి%%% అంతేకాకుండా, ప్రజా యుద్ధానికి సరఫరాలు, సాంకేతికత– నైపుణ్యం, సమాచారం, ఇతర వస్తువులను అందించే బాధ్యత కూడా పట్టణ విప్లవ ఉద్యమం భుజాలపైనే ఉంది. 2015– 16లో ఎఫ్టిఐ, హెచ్సియు, ఐఐటి చెన్నై, జెఎన్యు, ఉస్మానియా, జాదవ్పూర్, ఢిల్లీ విశ్వవిద్యాలయం వంటి ప్రఖ్యాత విద్యా సంస్థల క్యాంపస్లలో భారత జాతి విచ్ఛిన్నతను సమర్థించే నినాదాలు తరచూ ప్రతిధ్వనిస్తున్నట్టు ఒక నివేదికను ఇంటెలిజెన్స్ బ్యూరో కేంద్రానికి అందజేసినట్టు సమాచారం అందుతోంది. అర్బన్ నక్సల్స్ గ్రామీణ ప్రాంతాల్లోని మావోయిస్టులకు ఆయుధాలు, ఔషధాలు, కమ్యూనికేషన్ పరికరాలు వంటి ముఖ్యమైన వస్తువులను సరఫరా చేయడం ద్వారా మద్దతు ఇస్తున్నట్టు ఆ నివేదికలో తెలిపారు. అదే సమయంలో కొన్ని 'కవర్ ఆర్గనైజేషన్స్'ను ఏర్పాటు చేసి, దళ సభ్యులుగా తయారు చేస్తున్నట్టు కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలంటున్నవి.

తమ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి ఇంటర్నెట్, సోషల్ నెట్వర్క్లను అర్బన్ నక్సలైట్లు వాడుతున్నట్టు ఆ వర్గాలు చెబుతున్నవి. 'సైనిక, పారామిలిటరీ దళాలు, పోలీసులు, రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలోని ఉన్నత స్థాయిలలోకి చొచ్చుకుపోవాలి. శత్రువు గురించి సమాచారాన్ని సేకరించాలి. ఆయా వ్యవస్థలలో విప్లవానికి మద్దతును కూడగట్టాలి. సమయం వచ్చినప్పుడు తిరుగుబాటును ప్రేరేపించాలి' అని పట్టణ ప్రాంతాల్లోని మేధావులు, రచయితలకు నిర్దేశిస్తున్నట్టుగా మావోయిస్టు పార్టీకి చెందిన ఒక 'వ్యూహ పత్రం'లో బయటపడినట్టు కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థలు చెబుతున్నాయి.

# తెలుగు సాహిత్య చరిత్రలో వెలుగు దీపం... దీపాల పిచ్చయ్య శాస్త్రి.

## - మే 27...దీపాల పిచ్చయ్య శాస్త్రి జయంతి



తెలుగు సాహిత్య ప్రపంచంలో దీపాల పిచ్చయ్య శాస్త్రి (1894%–%1983) ఒక అద్భుతమైన పాండిత్యమూర్తి, సాహిత్య విమర్శకులు, కవి, అనువాదకులు. ఆయన సాహిత్య సేవ, విమర్శనాశక్తి, భాషా పరిశీలన, భక్తిరస కవిత్వం, శాస్త్రీయమైన రచనలతో తెలుగు సాహిత్యాన్ని ఒక కొత్త దిశలో నడిపించారు. 1894 మే 27న గుంటూరు జిల్లా బొమ్మరాజు పల్లె (కొన్ని ఆధారాల ప్రకారం కూచిరాజు పల్లె) గ్రామంలో వెంకట నరసయ్య, సరస్వతమ్మ దంపతులకు జన్మించిన శాస్త్రి బాల్యంలోనే అసాధారణ జ్ఞాపకశక్తి కలిగి, తండ్రి వద్దే సంస్కృతాంధ్రాలు, వ్యాకరణం నేర్చుకున్నారు. చిన్నతనం లోనే సంగీతం లోని ప్రవేశం, వీణ వాద్యంలో నైపుణ్యం, పద్యగానం విద్యార్థిగా తిరుపతి వేంకట కవుల ప్రభావం ఆయనను ఆశువుగా పద్యాలు చెప్పగలిగే స్థాయికి తీసుకు వెళ్ళింది. వినుకొండలో ప్రాథమిక విద్యతో పాటు గుర్రం జాషువాతో స్నేహం ఏర్పడింది. తిరుపతి వేంకట కవులు 1912లో వినుకొండలో అవధానానికి వచ్చినప్పుడు పిచ్చయ్య శాస్త్రి పద్యాల ప్రతిభతో ఆకట్టుకొని ప్రశంసలు పొందారు. విద్యాభ్యాసంలో మద్రాసు విశ్వవిద్యాలయం పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి, నెల్లూరు జిల్లా వెంకటగిరి మహారాజా కళాశాలలో 19 సంవత్సరాలు తెలుగు పండితులుగా పని చేశారు. సాహిత్య ప్రస్థానం కవిత్వంతో మొదలై, శాస్త్రీయ వ్యాఖ్యానాలు, విమర్శలు, సాహిత్య పరిశీలన వైపు మళ్లింది. విమర్శా రంగంలో ఆయనకు "విమర్శకాగ్రేసర" బిరుదు ఆంధ్ర సారస్వత పరిషత్తు ద్వారా లభించింది. భాషలోని లోపాలను నిర్భయంగా ఎత్తిచూపి, ఆంధ్రభాషా పరిశుద్ధత కోసం కృషి చేశారు. 1927లో వేదం వేంకటరాయ శాస్త్రి "మేఘసందేశ" వ్యాఖ్యానం లోని లోపాలను ఆంధ్రపత్రికలో విశ్లేషణ చేసి సంచలనం రేపారు. గిడుగు రామ్మూర్తి శాస్త్రి కూడా పిచ్చయ్య శాస్త్రి పాండిత్యాన్ని లేఖలో పొగిడారు. సూర్యరాయాంధ్ర నిఘంటువులో తప్పులను సవరించడం ద్వారా భాషా పరిశీలనలో ఆయనకున్న మక్కువను చాటారు. ఆయన రచనలు విస్తృతమైనవి. చిన్నతనంలోనే చాటు పద్యాలపై మక్కువతో "చాటు పద్య రత్నాకరము" (1917) సంకలనాన్ని వెలువరించారు. భక్తి ప్రధానమైన "భక్త కల్పద్రుమ శతకము" (1917) రచించారు. "కాలము", "భారతి", "సువర్ణ మేఖల", "గాలివాన", "ప్రణయ కుసుమము" వంటి కవితా సంపుటాలతో పాటు, "కుమార కథామంజరి", "దశకుమార చరిత్రము", "రఘు వంశము", "మేఘ దూతము" వంటి వచన అనువాదాలు చేశారు. భాస నాటకాలను తెలుగులోకి అనువదించడం ఆయన ప్రతిభకు ఉదాహరణ. "సాహిత్య సమీక్ష" వ్యాసాల సంపుటి, "సారంగధర–జితకాశి" వ్యాఖ్యానాలు, "కానన ప్రహసనము", "అరుణకిరణ" వంటి రచనలు ఆయన సాహిత్య విభిన్నతకు ప్రతీకలు. గుర్రం జాషువాతో చిన్ననాటి స్నేహం పిచ్చయ్య శాస్త్రి జీవితానికి ప్రత్యేక సంఘటన. జాషువా కవిత్వ రుచిని పిచ్చయ్య శాస్త్రి పరిచయం చేసినదని కూడా ప్రస్తావన ఉంది. జాషువా–పిచ్చయ్య శాస్త్రి జంటగా రచనలు చేయాలని ప్రయత్నించినప్పటికీ, అది కార్యరూపం దాల్చలేదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1969లో శాస్త్రిని విశిష్ట సభ్యుడిగా గౌరవించింది. భాషాసంస్కృతులను కడదాకా ఊపిరిగా భావించి1983 అక్టోబర్ 17న కాలం చేసిన దీపాల పిచ్చయ్య శాస్త్రి... విశ్వనాథ, తుమ్మల, జాషువా, జంధ్యాల, పుట్టపర్తి, గడియారం వంటి కవి పండిత మూర్ధన్యుల సరసన నిలువదగిన ప్రజ్ఞులు. ఆయన సాహిత్య జీవితం తెలుగు పాండిత్యపు వైభవానికి ఒక ప్రకాశవంతమైన సాక్ష్యం. భక్తిరసంతో కూడిన రచనలు, భాషా పరిశీలనలోని సాహసం, విమర్శనాశక్తి, శాస్త్రీయత, సులభభాషా శైలి ద్వారా పిచ్చయ్య శాస్త్రి తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయ వ్యక్తిగా నిలిచారు. ఆయన రచనలు నేటికీ పాఠకులను, పరిశోధకులను ఆకట్టు కుంటున్నాయి. తెలుగు భాషా చరిత్రలో దీపాల పిచ్చయ్య శాస్త్రి ఒక వెలుగు చూపే దీపస్తంభంగా నిలిచిపోయారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**




## ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు 'ఉపగ్రహ' దోషం.. డ్రాగన్ సాయం కోసం ఆరాటం!


ఆపరేషన్ సిందూర్ వేళ భారత్ చేతిలో ఘోరంగా దెబ్బతిన్న పాకిస్థాన్ ఇప్పుడు తమ పెద్దన్న చైనాను ఆశ్రయించింది. డ్రాగన్‌కు చెందిన బైడూ ఉపగ్రహ వ్యవస్థను మరింత వాడుకొనేలా ఒప్పందం చేసుకొన్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఇరుదేశాల మధ్య మే 16వ తేదీన వ్యూహాత్మక సమావేశం జరిగింది. భారత్ దెబ్బకు పాక్ వాడుతున్న చైనా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కుదేలైన వేళ ఈ సమావేశం జరగడం గమనార్హం. భారత కార్యకలాపాలు గమనించడం, ఆ సమాచారాన్ని ఇరుదేశాలు పంచుకోవడం వంటి అంశాలపై ఇరుదేశాల మిలిటరీలు చర్చలు జరిపాయి. దీంతోపాటు పాక్ 5జీ కమ్యూనికేషన్ వ్యవస్థలను మరింత బలోపేతం చేసుకొని.. రియల్‌టైమ్ సమన్వయం, నిఘా సామర్థ్యాలను పెంచుకొనే అంశం కూడా చర్చకు వచ్చింది. వాస్తవానికి ఆపరేషన్ సిందూర్ వేళ కూడా చైనా సమగ్రంగా శాటిలైట్ కవరేజీని పాకిస్థాన్‌కు అందజేసింది. డ్రాగన్ మిలిటరీ, పరికరాల రూపంలో సాయం అందించినా.. భారత్ చేతిలో మాత్రం పాక్ సైన్యం చావు దెబ్బతింది. దానికి చెందిన ఎనిమిదికి పైగా మిలిటరీ బేస్‌లు భారత్ దాడులకు కుదేలయ్యాయి. ఇక భారత దళాలు చాలావరకు స్వదేశీ ఆయుధ వ్యవస్థలతోనే చైనా తయారీ పరికరాలను నిర్వీర్యం చేశాయి. రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎస్–400 వ్యవస్థను న్యూదిల్లీ వినియోగించింది.

**ఇస్రోతోనే పాక్‌ను చావుదెబ్బతీసి..** భారత్ భారీస్థాయిలో ఉపగ్రహాలను కూడా ఆపరేషన్ సిందూర్ కోసం మోహరించింది. వీటిల్లో ఇస్రో వాడుతున్న ఉపగ్రహాలతోపాటు.. అంతర్జాతీయ మద్దతు కూడా తీసుకొంది. భారత్ వద్ద 9–11 మిలిటరీ ఉపగ్రహాలు ఉన్నాయి. ఇస్రో వీటి నుంచి నిరంతర డేటాను దళాలకు చేరవేసింది. దీంతోపాటు ఓ కమర్షియల్ గ్లోబల్ ఆపరేటర్ నుంచి చిత్రాలను సేకరించింది. ఇస్రో సొంతంగా వాడే కార్టోశాట్ సిరీస్‌లోని వాటిని కూడా రంగంలోకి దించింది. వీటి ఆధారంగా మన దళాలు పక్కా ప్లానింగ్ చేసి.. పాక్ సైనిక స్థావరాలను దెబ్బతీశాయి. అమెరికాకు చెందిన మ్యాక్సర్, ఐరోపాకు చెందిన సెంటినెల్ సేవలు కూడా భారత్ వాడుకొంది. ఇవి అయితే.. రోజుకు ఒకసారి అయినా డౌన్‌లోడ్స్ చేసుకోవచ్చు. ఇక మన దేశానికి చెందిన ఉపగ్రహాలు పీరియాడిక్ డేటాను 14 రోజులకు ఒకసారి తీసుకొనే అవకాశం ఉంది. భారత్ కార్టోశాట్ శ్రేణి ఉపగ్రహాలను తొలిసారి 2005లో ప్రయోగించింది. వీటిద్వారా హైరిజల్యూషన్ ఫొటోలు, వీడియోలు తీసుకోవచ్చు. మన ఇంటెలిజెన్స్‌లో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆ తర్వాత కార్టోశాట్ 2సీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చాము. ఇవి ఆపరేషన్లకు సంబంధించిన కీలక సమాచారం ఇస్తున్నాయి. ఇవి 0.65 మీటర్ల రిజల్యూషన్ ఇవ్వగలవు. వీటిల్లో ఏరియాస్ ఆఫ్ ఇంట్రెస్ (ఏఓఐ)లను మాత్రం అత్యధిక రిజల్యూషన్‌తో పొందవచ్చు.

2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్స్‌లో వీటిని వాడారు. భారత మిలిటరీ కోసం నిరంతరం 10 ఉపగ్రహాలు పనిచేస్తున్నాయని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. భారత్ వచ్చే ఐదేళ్లలో 100 నుంచి 150 ఉపగ్రహాలు ప్రయోగించాలని భావిస్తోంది.

# స్త్రీల జీవితాన్ని ప్రతిబింబించిన సాహితీ దీపస్తంభం..పవని నిర్మల ప్రభావతి - మే 27...పవని నిర్మల ప్రభావతి వర్ధంతి





తెలుగు సాహిత్యంలో స్త్రీల జీవన యధార్థాలను, వారి భావ ప్రపంచాన్ని, ఆత్మ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తూ అనేక అద్భుతమైన కథలు, నవలలను రచించిన సాహితీ మణి పవని నిర్మల ప్రభావతి. సాంప్రదాయానికి అతీతంగా స్త్రీల అంతరంగాన్ని, సామాజిక సమస్యలను స్పృశించిన రచయిత్రిగా సుపరిచితులు. సమకాలీన సాహిత్యంలో ఆమెకు ప్రత్యేక స్థానం ఉంది. పవని నిర్మల ప్రభావతి 1933, మార్చి 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు పట్టణంలో విప్పగుంట వెంకట నరసింహారావు, సరస్వతమ్మ దంపతులకు జన్మించారు. బాల్యం నాటి నుంచే చదువులో, సాహిత్యంలో ఆసక్తి ప్రదర్శించారు. ఎస్ఎస్ఎల్సీ వరకు చదివిన ఆమెకు వివాహం తర్వాత కూడా సాహిత్యపరమైన ఆసక్తి తగ్గలేదు. పవని శ్రీధరరావు గారితో వివాహం తర్వాత కుటుంబ బాధ్యతల మధ్య సాహిత్యానికి తనదైన సమయం కేటాయిస్తూ రచనలు కొనసాగించారు. 2015, మే 27న ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో తుదిశ్వాస విడిచారు. నిర్మల ప్రభావతి రచనలు స్త్రీల వ్యక్తిత్వాన్ని, వారి అంతరంగపు మనస్తత్వాలను విపులంగా ఆవిష్కరించేవి. సామాజిక అసమానతలు, కుటుంబ వ్యవస్థలో స్త్రీల కష్టాలు, త్యాగాలు, ఆత్మగౌరవం వంటి అంశాలను ఆమె సాహిత్యంలో చక్కగా మేళవించారు. ఆమె కథలు, నవలలు కేవలం కథానాయకుల జీవిత విశేషాలే కాకుండా, సమాజంలోని ప్రతి మనిషికి ఆత్మ విశ్లేషణకు దారితీసేవిగా ఉంటాయి. సాధారణ స్త్రీల జీవితంలోని సంరంభాలు, సంక్షోభాలు, ఆశలు, నిస్పృహలు, తిరుగుబాట్లు ఆమె శైలిలో ప్రతిబింబిస్తాయి. ఆమె సాహిత్య ప్రస్థానంలో అనేక ముఖ్య రచనలు వెలువడ్డాయి. కథా సంపుటాలలో "అనాథ", "ఎదలో ముల్లు", "నాగరికత నవ్వుతోంది", "పాలఘాటు పిల్ల", "భగవాన్ నేనేమీ కోరను", "స్త్రీ", "హనీమూన్" వంటి కథలు స్త్రీల జీవితాన్ని వివిధ కోణాలలో ఆవిష్కరించాయి. "అద్దంలో ప్రతిబింబాలు" వంటి కథలలో సామాజిక స్థితిగతులను ప్రతిబింబిస్తూ పాఠకుల ఆలోచనలను ఉద్రేక పరిచాయి. నవలలుగా "ఉదయ కిరణాలు", "శలభాలు", "ఆద్యంతాల మధ్య", "దారులు – గమ్యాలు", "చైతన్య రాహిత్యంలో స్త్రీ" వంటి రచనలు స్త్రీ జీవితంలోని కాంతులు, చీకట్లు, ఆశావాదాన్ని ప్రతిబింబించాయి. ఆమె ఆధ్యాత్మిక రచనలు కూడా విశేషమై ఉన్నాయి. "భవాని సౌందర్య లహరి", "శివదూతీ సప్తశతీ", "శ్రీ లలితా నామ సహస్ర స్తోత్ర సర్వస్వం", "భాగవతామృత కలశం", "శ్రీ శివానందలహరి నవతరంగం" వంటి గ్రంథాలు భక్తి సాహిత్యానికి ఆమె చేసిన సేవకు సాక్ష్యంగా నిలుస్తాయి. పవని నిర్మల ప్రభావతి కేవలం రచయిత్రిగానే కాక సామాజిక కార్యకర్తగా తనదైన ముద్ర వేశారు. తన గ్రామంలో ఆలయం నిర్మించడం, వైద్యశాల ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు సేవలందించారు. పోతన భాగవతాన్ని సమాజానికి పరిచయం చేసి భక్తి, సాంస్కృతిక విలువలను ప్రోత్సహించారు. సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు సాహిత్యాన్ని ఓ సాధనంగా ఉపయోగించారు. కాళీపట్నం రామారావు (కారా) ఆధ్వర్యంలోని శ్రీకాకుళం కథానిలయం ఆమె కథలను సంకలనం చేసి భద్ర పరిచింది. ఈ కథానిలయం ఆమె రచనలను ప్రచురిస్తూ స్త్రీల అంతరంగాన్ని ప్రతిబింబించిన కలం ఆమెదని అభివర్ణించింది. "అద్దంలో ప్రతిబింబాలు" వంటి కథలు నేటికీ పాఠకులకు ఆలోచనలకు ఆహ్వానం అందిస్తున్నాయి. పవని నిర్మల ప్రభావతి సాహిత్య జీవితం ఒక అద్భుతమైన ఉదాహరణ. సమాజంలో స్త్రీల సమస్యలను, వారి వ్యక్తిత్వాన్ని గాఢంగా అక్షరబద్ధం చేసిన ఆమె రచనలు తెలుగు సాహిత్యంలో విలువైన సృష్టులు. ఆమె కథలు పాఠకులకు కేవలం వినోదం మాత్రమే కాకుండా, సమాజాన్ని, వ్యక్తిగత జీవితాన్ని విశ్లేషించే అవకాశం కల్పిస్తాయి. ఆమె తెలుగు సాహితీ చరిత్రలో ఒక స్థిరమైన స్తంభంగా నిలిచిపోతారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# 'ప్రాణాలు కాపాడుకొండ్రోయ్'...పాక్ ఆర్మీ పరిస్థితిపై కీలక రేడియో చాట్!

ప్రగల్భాలు పలకమంటే ఆ విషయంలో మమల్ని కొట్టేవాళ్లు లేరని చెప్పినట్లుగా ఉంటుంది పాక్ ఆర్మీ పెద్దల పరిస్థితి! తమను అడ్డుకునేవారు లేరు.. తమను ఆపేవారూ లేరు.. తాము తలచుకుంటే సింధు నదిలో నీరు కాదు నెత్తురు ప్రవహిస్తుంది.. వంటి కబుర్లు చెప్పడంలో వారికి వారే సాటి, వారితో లేవరికీ పోటీ అన్నట్లుగా ఉంటుంది! అయితే.. ప్రాక్టికల్ గా వారి పెర్ఫార్మెన్స్ అందుకు పూర్తి భిన్నమనే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది! అవును... ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ, వారిని భారత్ పైకి ఉసిగొల్పి రాక్షసానందం పొందే పాకిస్థాన్ కు.. పహల్గాం ఉగ్రదాడి అనంతరం "ఆపరేషన్ సిందూర్"తో షాకిచ్చింది భారత్. ఇందులో భాగంగా.. పాక్, పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలను తుదముట్టించడంతో పాటు ఆ దేశ సైనిక పోస్టులు, ఎయిర్ బేస్ లనూ ధ్వంసం చేసింది. ఈ దెబ్బతో పాకిస్థాన్ ఆర్మీ ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. పాక్ ఆర్మీ చీఫ్ కనిపించకుండాపోయిన పరిస్థితి నెలకొంది! ఈ సమయంలో భారత్ క్షిపణుల దెబ్బకు పాక్ లోని 11 ఎయిర్ బేస్ లు ధ్వంసమయ్యాయి. అందులో కొన్నింటి పరిస్థితి ఐసీయూలో ఉందని, అవి ఎప్పుడు తేరుకుంటాయో చెప్పలేమని అంటున్నారు! ఆ సమయంలో.. భారత్ ఆర్మీ దెబ్బకు పాకిస్థాన్ సైన్యంలో కమాండర్ స్థాయి అధికారులు సైతం ప్రాణభయంతో పరుగులు పెట్టినట్లు, మసీదుల్లో దాక్కొన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు జాతీయ మీడియా కథనం వెల్లడించింది! ఇందులో భాగంగా.. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్, పీవోకేలోని ఉగ్రస్థావరాలపై ఇండియన్ ఆర్మీ విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో పీఓకే లోని ముజఫరాబాద్ సమీపంలో ఉన్న 75వ ఇన్ ఫాంట్రీ బ్రిగేడ్ కమాండర్ ఆ పోస్ట్ ను వదిలి పారిపోయినట్లు చెబుతున్నారు. ఆ సమయంలో.. సదరు కమాండర్ గురించి ఓ అధికారి మాట్లాడిన రేడియో చాట్ బయటకు రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు ఆ కథనం పేర్కొంది! ఆ రేడియో చాట్ లో... "చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మా కమాండర్ సాబ్ ఇక్కడ నుంచి పరారయ్యాడు.. పారిపోయి వెళ్లి మసీదులో తలదాచుకుని ప్రార్థనలు చేసుకున్నాడు.. ఆ సమయంలో, పోస్టులో కార్యకలాపాలు పునరుద్ధరించాలా అని అడిగితే.. ముందు మీ ప్రాణాలు కాపాడుకోంది.. ఆఫీసు తర్వాత తాపీగా తెరుచుకోవచ్చు అని సమాధానమిచ్చాడు" అని సదరు జూనియర్ అధికారి పేర్కొన్నాడు! కాగా... పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆర్మీ "ఆపరేషన్ సిందూర్" చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా.. 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన భారత ఆర్మీ.. సుమారు 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టింది. –ఈ సమయంలో ఆ 9 ఉగ్రశిబిరాల్లో.. ముజఫరాబాద్ లోని సైద్నా బిలాల్, షవాయ్ నల్లాహ్ అనే రెండు శిబిరాలు ఉన్నాయి. ఇది పీవోకే సరిహద్దుకు సుమారు 30 కి.మీ. దూరంలో ఉన్నాయి! ఆ సమీపంలోని 75వ ఇన్ ఫాంట్రీ బ్రిగేడ్ కమాండర్ పోస్ట్ లోనే తాజా ఘటన జరిగినట్లు చెబుతున్నారు. ముజఫరాబాద్ లోని ఉగ్ర శిబిరాలపై భారత్ ఆర్మీ విరుచుకుపడుతుంటే.. ఆ దెబ్బకు పాక్ ఆర్మీ ఇలా "ప్రాణాలు కాపాడుకొండ్రో.." అంటూ పారిపోయినట్లు రేడియో చాట్ లో వెల్లడైంది!

చురకలు



చురకలు

## సంపాదకీయం

# డ్రాగన్ ఫేక్ మార్కెంటింగ్... హెచ్.క్యూ-9 సంగతేమిటి చైనా?

'నీ ఫ్రెండ్ ఎవరో చెప్పు నీ గురించి నేను చెబుతాను' అని అంటారు. ఈ విషయంలో పాకిస్థాన్ ని అడిగినా, చైనాను అడిగినా.. ఇరు దేశాల గురించి ఈజీగా చెప్పెయ్యొచ్చు. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్న చందంగా ఆ రెండు దేశాలు చేస్తోన్న ఫేక్ ప్రచారాలు, ఫేక్ మార్కెంటింగ్ లు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. అదేమిటనేది ఇప్పుడు చూద్దామ్..! అవును... ఇటీవల భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్.. పాక్ లోని ఉగ్రశిబిరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... భారత వైమానిక దళం 23 నిమిషాల్లోనే పాక్ లోని 9 ఉగ్రశిబిరాలను నేలమట్టం చేసింది. ఆ సమయంలో.. పాకిస్థాన్ లోని గగనతల రక్షణ వ్యవస్థలు హెచ్.క్యూ-9 జామ్ అయిన పరిస్థితి. దీంతో.. ఆ 23 నిమిషాల్లోనూ పాకిస్థాన్ గగనతలంలో భారత క్షిపణులు విధ్వంసం సృష్టించాయి. ఆ దేశానికి ఊహించని నష్టాన్ని కలిగించాయి. ఈ సమయంలో రక్షణగా నిలవాల్సిన చైనా మేడ్ హెచ్.క్యూ-9 క్షిపణి వ్యవస్థలు పూర్తిగా విఫలమయ్యాయి. వాటి ఎయిర్ బేస్ లు గట్టి దెబ్బలే తిన్నాయి. .భారత్ కు చెందిన ఒక్క క్షిపణిని కూడా అవి ఆపలేకపోయాయి. ఈ నేపథ్యంలోనే రహీం యార్ ఖాన్ ఎయిర్ బేస్, నూర్ ఖాన్ ఎయిర్ బేస్, రఫీకి ఎయిర్ బేస్ సహా 11 పాక్ ఎయిర్ బేస్ లు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. దీనిపై ఇటీవల రాజస్థాన్ సభలో స్పందించిన ప్రధాని మోడీ.. భారత దాడి తర్వాత రహీం యూర్ ఖాన్ ఎయిర్ బేస్ ఇంటెన్సివ్ కేర్ లోకి వెళ్లిందని వ్యాఖ్యానించిన పరిస్థితి. ఈ క్రమంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ అనంతరం పాక్ కొన్ని ఫేక్ ప్రచారాలకు తెరలేపింది. ఇందులో భాగంగా.. భారత్ కు చెందిన యుద్ధ విమానాలను కూల్చేశామని చెప్పుకొంది. దీనిపై ఆ దేశ రక్షణ మంత్రిని మీడియా నిలిదీస్తే... సోషల్ మీడియాలో ఆ మేరకు ప్రచారం జరుగుతుందని చెప్పుకొన్న పరిస్థితి. ఈ నేపథ్యంలో చైనా ఫేక్ మార్కెంటింగ్ కు తెరలేపింది. ఇందులో భాగంగా... ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ఫైటర్ జెట్లను పాకిస్థాన్ పేల్చేసిందని.. ఆ సమయంలో తాము సరఫరా చేసిన జే-10సీ ఫైటర్ జెట్లనే పాక్ ఉపయోగించిందనే భ్రమను.. ప్రపంచం ముందు వాస్తవంగా ప్రజెంట్ చేయాలనుకుంటుంది చైనా. ఈ నేపథ్యంలో చైనా జే-10సీ ఫైటర్ జెట్లపై డాక్యుమెంటరీలు రూపొందిస్తోంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే... చైనా తయారు చేసిన జే-10సీ ఫైటర్ జెట్లు భారత్ కు ఏ మేరకు నష్టం కలిగించిందనే సంగతి కాసేపు పక్కనపెడితే... పాక్ నమ్ముకున్న హెచ్.క్యూ-9 గగనతల రక్షణ వ్యవస్థ మాత్రం భారత క్షిపణులను ఏమాత్రం అడ్డుకోలేకపోయింది.. నేడు పాక్ లో 11 ఎయిర్ బేస్ లు ధ్వంసం అవ్వడానికి హెచ్.క్యూ-9 కారణం. అయితే... ఈ విషయాన్ని చైనా వ్యూహాత్మకంగా దాచే ప్రయత్నం చేస్తూ... తాము తయారు చేసిన జే-10సీ ఫైటర్ జెట్లు అద్భుతమైన పెర్ఫార్మెన్స్ చూపించాయని చెప్పుకుంటూ ఓ డాక్యుమెంట్ తీసి, ప్రపంచంతో నకిలీ మార్కెంటింగ్ చేయాలని భావిస్తోంది! ఇక్కడ గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే... ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్ ఉపయోగించిన బ్రహ్మోస్ క్షిపణి, ఎస్-400 రక్షణ వ్యవస్థ గురించి ప్రపంచం మొత్తం చర్చించుకుటోన్న పరిస్థితి. మరోపక్క ఈ యుద్ధంలో పాకిస్థాన్ వాడిన ఆయుధాల్లో 80శాతం చైనా తయారు చేసినవే అని అంటున్నారు. దీంతో.. ప్రపంచ వ్యాప్తంగా చైనా రక్షణ పరిశ్రమ విశ్వసనీయతమపై ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో.. తన ఆయుధాలను మరోమారు ప్రపంచం ముందు ప్రదర్శనకు పెట్టుకొంటుంది చైనా.

# "శనీశ్వర పూజతో అంతా శుభమే" - వైశాఖ బహుళ అమావాస్య.... శని జయంతి

**"నీలాంజన సమాభాసం ! రవిపుత్రం యమాగ్రజం! ఛాయా మార్తాండ సంభూతం ! తం నమామి శనైశ్చరమ్" !**

భారతీయుల జ్యోతిష శాస్త్రం ప్రకారం 'శనీశ్వరుడు', నవగ్రహాలలో ఒక గ్రహం. సూర్యుడు, చంద్రుడు, ఛాయా గ్రహాలైన రాహువు మరియు కేతువులతో కలిపి గ్రహాలు తొమ్మిది. గగన మండలంలో ఉన్న గ్రహాలకు భూమితో సంబంధం ఉంది. కాబట్టి తొమ్మిది గ్రహాల ప్రభావం భూమి మీద, భూమిపై ఉన్న ప్రతి చరాచర జీవుల పైన, నిర్జీవ, ఝడ, నిర్లిప్త వస్తువుల మీద వుంటుంది. నవగ్రహాలలో ఒకటైన శని గ్రహం ఇందుకు బిన్నం కాదు. శని, శనిగ్రహం, శనేశ్వరుడు, శనీశ్వరుడు, అని పలు నామములతో పిలువబడి, గ్రహ రూపంలో పూజింపబడే 'శని' ఒక గ్రహదేవుడు. వారంలో ఏడవవారం శనివారం. శనికి మంద గమనుడు అని కూడా పేరు. శనై: క్రమతీతి అనగా అతినెమ్మదిగా కదిలేవాడు అని అర్థం. ఒకసారి సూర్యుని చుట్టి రావడానికి శనికి 30 సంవత్సరాలు పడుతుంది. శానైస్కర్య, అసిత, సప్తర్చి, క్రూరదృష్ట, క్రూర లోచనుడు, పంగు పాదుడు, గృధ్ర వాహనుడు మొదలైన పేర్లుకూడా ఉన్నాయి. సంఖ్యలలో 'ఎనిమిది' శనికి ప్రీతికరమయిన సంఖ్య. ఛాయదేవికి పుట్టిన సంతానం శనిదేవుడు. ఆయనకు ఛాయాపుత్రుడు అనే పేరు కూడా ఉంది. జీవుల జాతక చక్రాలపైన తన ప్రభావాన్ని ఎలా చూపబోతున్నాడో అని నిరూపించడానికి ఆయన జననం సూర్య గ్రహణములో జరిగింది. దేవతల్లో శని దేవుడికి విశిష్టమైన స్థానముంది. జీవులు చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం కల్పించి, శిక్షించి, ధర్మాన్ని నిలిపే శని భగవానుడు యమ ధర్మరాజుకు అన్న. యముడు మరణానంతరం దండనలు విధిస్తే, శనిదేవుడు వారి వారి కర్మ ఫలములను బట్టి జీవులు బ్రతికి ఉండగానే హింసించి, యాతనలకు గురిచేసి శిక్షిస్తాడు. శనీశ్వరుడు గోచారస్థితి ఫలితంగా ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని, ప్రభావం పడితే అనేక ఇబ్బందులను కలిగిస్తాడు. హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ చతుర్దశి అనంతరం వచ్చే అమవాస్య రోజు శని జయంతి జరుపు కుంటారు. సూర్యదేవుని కుమారుడైన శని.. జ్యోతిష శాస్త్రం ప్రకారం మానవుల జీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తాడు. శనీశ్వరుడిని భక్తి శ్రద్ధలతో కొలిచి ఆయన అనుగ్రహం పొందితే కష్టాలు దూరమై.. అదృష్టం కలిసి వస్తుంది. దుష్టశక్తుల నుంచి మనల్ని మనం కాపాడు కోవడానికి శని దేవున్ని ప్రసన్నం చేసుకోవాలి. అంటే తైలాభిషేకం చేసి శాంతి పూజలు నిర్వహించాలి. బ్రహ్మ వైవర్త పురాణం ప్రకారం, పార్వతీ దేవి, నలుగు పిండి బొమ్మకు ప్రాణం పోసినప్పుడు, వినాయకుడు జన్మించాడు. సకల దేవతలు, నవగ్రహాలు ఆ బాల వినాయకుడిని చూడటానికి వచ్చారు. ఆ ముగ్ధ మోహన బాలుడిని అక్కడకు విచ్చేసిన దేవతలు, మునులు కనులార చూసి, దీవెనలు అందించి, పార్వతీ దేవికి మోదం కలిగించారు. శని భగవానుడు మాత్రం తల ఎత్తి ఆ బాలుని చూడలేదు. అందుకు పార్వతీదేవి కినుక వహించి, తన బిడ్డను చూడమని శనిని ఆదేశించింది. అయినా శని తన దృష్టి, ఆ బాల గణపతి పై సారించలేదు. తన దృష్టి పడితే ఎవరికైనా కష్టాలు తప్పవని ఎంత నచ్చచెప్పినా, మాతృ గర్వంతో శనీశ్వరుడి సదుద్దేశం తెలుసుకో లేక, పార్వతీ దేవి తన కుమారుని చూడమని పదే పదే శనిని ఆదేశించింది. శని తల ఎత్తి చూసిన కారణంగా బాల గణపతి మానవ రూపంలో ఉండే తలను కోల్పోయినాడని బ్రహ్మ వైవర్త తదితరాలు తెలుపుతున్నాయి. శని భగవానుని జన్మ వృత్తాంతం విన్న విక్రమాదిత్యుడు ఆయనను పరిహాసమాడాడట! ఆ పరిహాసాన్ని విన్న శని కోపగ్రస్తుడై విక్రమాదిత్యుని శపించాడట. శనిని కించపరిచే విధంగా మాటలాడి, అవమానించి నందుకు ఫలితంగా విక్రమాదిత్యుడు అనేక కష్టాలు అనుభవించాడు. రాజ్యాన్ని పోగొట్టు కున్నాడు, చేయని దొంగతనపు నింద మోపబడి, పొరుగు రాజుచే కాళ్ళు, చేతులు నరికివేయ బడ్డాడు. చివరికి, విసిగి వేసారి పోయి, బాధలు ఏమాత్రం భరించే ఓపికలేక, నిర్వీర్యుడై, భ్రష్టుడై, చేసేదిలేక, తనను కనికరింపమని శనిదేవుని అత్యంత శ్రద్ధతో, ఆర్తితో, భక్తితో ప్రార్ధించగా, విక్రమాదిత్యుని భక్తికి సంతృప్తి చెందిన శనీశ్వరుడు తిరిగి అతని పూర్వ వైభవం ప్రాప్తింపచేసాడు. శని దశ దుష్ప్రభావాలతో బాధపడే వారు, భక్తితో శని దేవునికి నూనె సమర్పిస్తే చెడు ఫలితాలు పోతాయని విశ్వాసం. శని దేవతను ప్రతిబింబించే నల్ల వస్తువులను... నల్ల ధాన్యాలు, నల్ల మినపప్పు, నల్ల నూనెలు, నల్ల ఆవులు, నల్ల బట్టలు, మొదలైనవి దానం చేస్తే చెడు ప్రభావాలు తొలగి పోతాయి. చీమలకు బెల్లాన్ని



ఆహారంగా ఇస్తే శని సంతుష్టుడై ఉంటాడు. శని స్తోత్రాన్ని నిత్యం పఠిస్తే భగవంతుడి ఆశీర్వాదాలు పొందుతారు. జీవితంలో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొంటోన్న సమయంలో సూర్య దేవుడి కుమారుడైన, శని దేవుడికి పూజ చేస్తే మంచి ఫలితాలుంటాయి. శనివారం ఉపవాసం ఉండి, శనీశ్వరుడి అనుగ్రహం పొందితే అదృష్టం కలిసి వస్తుంది. శని మనిషి చేసిన చెడు కర్మ ఫలితాన్ని తొలగిస్తాడు. జాతక రీత్యా శని పన్నెండవ ఇంట, ఒకటవ ఇంట, రెండవ ఇంట సంచరిస్తున్నప్పుడు, దానిని "ఏలినాటి శని" లేదా "సాడే సాతి" అంటారు. అయితే ఈ సమయంలో శని ఇచ్చే ఫలితం తాత్కాలికంగా చెడు అనిపించినా, అది ఆ వ్యక్తి భవిష్యత్తుకు ఎంతో సహాయకారిగా ఉంటుంది. పూర్వ జన్మలో చేసిన పాపాల ప్రయత్నాన్ని కష్టాల రూపంలో శని ఈ సమయంలో తొలగిస్తాడు. తద్వారా ఆ వ్యక్తి కి మంచి భవిష్యత్తు కలుగుతుంది. మనం ఎంత కష్టం చేస్తే శని అంతా సంతృప్తి చెందుతాడు. కాబట్టి జాతకంలో కానీ, గోచారంలో కానీ, శని అనుకూలంగా లేని వ్యక్తులు శారీరకంగా కష్టపడటం, అంటే ఇతరులకు సహాయం చేయడం మొదలైనవి చేస్తే ఆ చెడు ఫలితం తగ్గిపోయి శుభ ఫలితాలను శని ఇస్తాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# "నవభారత నిర్మాత పండిత నెహ్రూ" - మే 27.... చాచా నెహ్రూ వర్ధంతి



హిందూ స్త్రీల దాస్య విముక్తికి, సమానత్వ సాధనకు కృషిచేసి సంఘ సంస్కరణ కర్తగా, స్వతంత్ర భారతావని సాంప్రదాయాలు, విధానాల రూపశిల్పిగా, నవభారత నిర్మాతగా, పేరెన్నిక గన్నారు చాచా నెహ్రూ. వివాహం కనీస వయస్సును, 12 నుండి 15 కి పెంచడం, సతులు... పతుల నుండి విడాకులు తీసుకుని ఆస్తి వారసత్వ హక్కు పొందడం, వరకట్న పద్ధతిని చట్టవిరుద్ధం చేయడం, దేశ తొలి ప్రభుత్వాధినేతగా, సమాజ సంస్కరణలలో సఫలీకృతులయ్యారు, జవహర్ లాల్. న్యాయవాదిగా పరిపూర్ణ రాజకీయవేత్తగా, రచయితగా, దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధానిగా, భారత రాజకీయాలను అత్యంత ప్రభావితం చేసిన నెహ్రూ - గాంధీ కుటుంబ అ మూలపురుషుడిగా సుపరిచితుడు అయిన నెహ్రూ, నేటి ఉత్తర ప్రదేశ్ లోని అలహాబాద్ నగరంలో కాశ్మీరీ బ్రాహ్మణ వంశంలో, ధనిక కుటుంబంలో, ప్రముఖ న్యాయవాది మోతిలాల్ నెహ్రూ, స్వరూప రాణిల తొలి సంతానంగా నవంబర్ 14, 1989లో జన్మించారు. సోదరీమణులైన కృష్ణ విజయలక్ష్మి పండిట్ లతో పాటు, "ఆనంద భవన్" లో ఆంగ్ల సాంప్రదాయ శిష్ట పద్ధతులలో పెరిగారు. బాల్యంలోనే హిందీ, సంస్కృతాలు, భారత సారస్వత గ్రంథాల పఠనా సక్తులు అయినారు. ఇండియన్ సివిల్ సర్వీసులో అర్హత పొందాలని తండ్రి కోరికను అనుసరించి, ఇంగ్లాండ్ నందలి హార్రో వెళ్ళాడు. పాఠశాల విద్య అక్కడ పూర్తిచేసి, 1907లో, కేంబ్రిడ్జ్ లో ప్రవేశ పరీక్ష రాసి, జీవశాస్త్ర అధ్యయనానికి కళాశాలకు వెళ్లి, 1910లో పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్ర అ అధ్యయనానికి ఇన్నెర్ టెంపుల్ వెళ్లి, 1912లో ఉత్తీర్ణుడై అక్కడే న్యాయవాద వృత్తి చేపట్టాడు. వెనువెంటనే భారతదేశానికి తిరిగి రావడం జరిగింది. 1919లో జలియన్వాలా బాగ్ దుర్ఘటనకు ప్రభావితుడై, కాంగ్రెస్ ఆధ్వర్యంలో, దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి ఆకర్షితుడై, సంగ్రామంలో తన శక్తులు లోడ్డుటకు ఉద్యుక్తుడయ్యాడు. మొదట మోతిలాల్ నెహ్రూ కుమారుని నిర్ణయాన్ని వ్యతిరేకించినా, తర్వాత ఆయన సైతం సంగ్రామంలో భాగస్వామి అయినాడు. అనంతరం మహాత్ముని నమ్మిన బంటుగా నెహ్రూ గుర్తింపు పొందాడు. ఆ సమయంలో 9 ఏళ్ళు జీవితం అనుభవించాడు. జీవితం సమయంలోనే 1334 లో "గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ', 1936 లో తన జీవిత చరిత్ర 1946లో "ది డిస్కవరీ ఆఫ్ ఇండియా" రచనలు పూర్తిచేశాడు తొలిసారిగా గాంధీ నాయకత్వ పోరాటంలో, 1929 లో భారత జాతీయ కాంగ్రెస్ నేతగా, లాహెూర్ సమావేశాలకు నాయకత్వం వహించాడు. 1936,1937,1940 లలో, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైనాడు. యువకునిగా ఉన్న నాటి నుండే జాతీయ కాంగ్రెస్ లో, వామపక్ష భావజాల ప్రభావితుడై, సంపూర్ణ స్వాతంత్ర్య సముపార్జన ఆసక్తుడై, గాంధీ సలహాలతో, ప్రజాకర్షణ గల నేతగా, సంస్కరణవాదిగా స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్య భూమిక నిర్వహించి గాంధీ అనంతరం, రెండవ అగ్రశ్రేణి నాయకుడిగా గుర్తించబడి నాడు. 1916లో కాశ్మీరీ బ్రాహ్మణ వంశస్థులు రాలైన కమలా కౌల్ తో వివాహితుడైన నాడు. ఫలితంగా కుమార్తె ఇందిరా ప్రియదర్శిని 19 17 నవంబర్ 19న జన్మించింది. కమలా నెహ్రూ 19 46 లో క్షయ వ్యాధితో మృతి చెందగా, కుమార్తె ఇందిర, సోదరి విజయలక్ష్మిలపై, ఎక్కువగా ఆధార పడడం జరిగింది. 1947 నుండి 64 వరకు దేశ ప్రధానిగా ఉన్న నెహ్రూ, సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు లో ప్రధాన పాత్ర పోషించి, 1952 లో దేశ తొలి ప్రధాని గా ఎన్నుకొనబడినాడు. 1947 ఆగస్టు 15న స్వతంత్ర్య భారత పతాకాన్ని ఎగరవేసిన తొలి భారతీయుడిగా, గౌరవం దక్కించుకున్న ఘనత ఆయనది. పార్లమెంటరీ తరహాలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛావాదం, పేద అణగారిన వారి పట్ల అనురాగం, ప్రధానిగా ఆయన రూపొందించిన విధానాలపై ప్రభావం చూపాయి. 1964 మే 27న తన 74వ ఏట పరమపదించాడు. పంచశీల సూత్ర అనువర్తిగా, అలీనోద్యమ స్థాపనకులలో ఒకరిగా, యుద్ధానంతర కాల అంతర్జాతీయ ప్రముఖుడిగా, గౌరవసూచకంగా "పండిట్" గా పిలువబడిన నెహ్రూ, సుధీర్ఘ పదవీకాలం అనుభవాన్ని రంగరింప చేసుకున్న కూతురు ఇందిర, మనమడు రాజీవ్, ప్రధాని పదవులు పొందడానికి స్ఫూర్తి పొందా రనాడంలో, రవంతైనా అతిశయోక్తి లేదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నవయుగ వైతాళికుడు వీరేశలింగం - మే 27... కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి




తెలుగులో తొలి నవల రచనకు నాంది పలికిన గొప్ప కవి ఆయన. మొదటి స్వీయ చరిత్ర రాసిన మహెూన్నత వ్యక్తి ఆయనే. తెలుగులో తొలి ప్రహసనం వ్రాసింది కూడా ఆయనే. మొట్ట మొదటి వితంతు వివాహం జరిపించిన గొప్పతనం ఆయనదే. ఆయనే నవయుగ వైతాళికుడిగా ప్రఖ్యాత గాంచిన కందుకూరి వీరేశలింగం పంతులు. బాల్యవివాహాల రద్దుకోసం ఉద్యమించిన మహెూన్నతుడు, గొప్ప సంఘ సంస్కర్త. మూఢ నమ్మకాలపై యుద్ధం ప్రకటించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 రాజమండ్రిలో జన్మించారు. బ్రిటిష్ హయాంలో బాల్య వివాహాలను నిరసిస్తూ ఆయన పెద్ద ఎత్తున ఉద్యమమే నిర్వహించారు. దీంతోపాటు అనేక సంఘ సంస్కరణలకు పాటు పడ్డారు. సామాజిక దురాచారాల నిర్మూలన కోసం నిరుప మానంగా కృషి చేశారు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించిన కందుకూరి, బాల్య వివాహాలు రద్దు కోసం ఉద్యమిస్తూనే .. వితంతు వివాహాలు జరిపించాలని కోరేవారు. దేశంలో మొదటి వితంతు వివాహం జరిపింది ఆయనే. సాహితీ వ్యాసంగంలోనూ విశేషంగా కృషిచేశారు కందుకూరి వీరేశలింగం పంతులు. బహుముఖ ప్రజాశాలి అయిన కందుకూరి. మొట్టమొదటి సహవిద్యా పాఠశాలను కూడా ప్రారంభించారు. తెలుగులో తొలి నవల వ్రాసింది. మొదటి స్వీయ చరిత్ర రాసింది కూడా ఆయనే. అంతేగాక తొలి ప్రహసనం కూడా కందుకూరి చేతినుంచి జాలువారింది. కందుకూరి జయంతిని నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటారు. జాతికి నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, మన తెలుగు జాతి గర్వించదగ్గ మహెూన్నత వ్యక్తి . సంఘ సంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు,తెలుగు సాహితీ వ్యాసంగంలోనూ నిరుపమానమైన కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. యుగకర్త గా, హేతువాదిగా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా అనేక విషయాలలో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు. తెలుగు కవుల జీవిత చరిత్ర రాసిన మొదటి వ్యక్తి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు రచయిత. ఆంధ్ర దేశంలో బ్రహ్మ సమాజం స్థాపకులు. యువజన సంఘాల స్థాపన కూడా ఆయనతోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేశారు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పని చేసారు. తాము నమ్మిన సత్యాన్ని, సిద్దాంతాన్ని తు.చ. తప్పకుండా పాటించిన ఆదర్శ వ్యక్తి. యుగకర్త గా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఆంధ్ర సమాజాన్ని సంస్కరణాల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం. ఆయన చేసిన ఇతర సంస్కరణా కార్యక్రమాలొక ఎత్తు, వితంతు పునర్వివాహాలొక ఎత్తు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని విస్తృత ప్రచారం చేసారు. వీరేశలింగం హేతువాది. ఆయన జీవితం సంఘసంస్కరణ, సాహిత్య కృషి రెండింటితో పెనవేసుకు పోయింది. ప్రభుత్వంలోని అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాన్ని, అబద్ధాలు ఆడక తప్పదని న్యాయవాద వృత్తిని వదులుకున్న వ్యక్తి అటువంటి దురాచారాలపై ధ్వజమెత్తి, తన సంస్కరణా భిలాషను నిరూపించు కున్నారు. ఉన్నత విద్యానంతరం వీరేశలింగం అధ్యాపక వృత్తిని చేపట్టారు. రాజమండ్రి, కోరంగి, ధవళేశ్వరం, మద్రాసులలోని పాఠశాలల్లో పని చేశారు. అధ్యాపకుడిగా పనిచేస్తుండడంతో 'పంతులు'గారని, వీరేశలింగం పంతులుగారని ప్రాచుర్యం పొందారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి 1876లో ఉపాధ్యావృత్తి నుండి జర్నలిస్టుగా మారి 'వివేకవర్థిని' అనే మాసపత్రికను ప్రారంభించారు. మొదట ఈ పత్రిక మద్రాసు నుండి వచ్చేది. తర్వాత కొంతమంది స్నేహితులతో కలిసి, రాజమండ్రి లోనే సొంత ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి పత్రికను నిర్వహించారు.ఆ రోజుల్లోనే లంచగొండితనం, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు%ౌ% ఇలా ఎన్నో అన్యాయాలు సమాజంలో జరుగుతుండేవి. వాటిపైకి తన పత్రిక 'వివేకవర్థిని'ని ఆయన ఎక్కుపెట్టారు. ఉపన్యాసాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా, ఆచరణాత్మకంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తొలి వితంతు పునర్వివాహాన్ని 11 డిసెంబర్ 1881న తన ఇంట్లోనే జరిపించారు. నవల, వ్యాసం, ఉపన్యాసం, విమర్శ వంటి ప్రక్రియలకు ఆద్యులు. తెలుగులో వచ్చిన తొలి సాంఘిక నవల 'రాజశేఖర చరిత్ర' (1878) పంతులు గారు రాసిందే. సంఘసేవలో వీరేశలింగం ఎంత కృషి చేసారో, సాహిత్యం లోనూ అంతే కృషి జరిపారు. చదువుకునే రోజుల్లోనే రెండు శతకాలు రాసాడు. పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవారు. వివేకవర్ధనిలో సులభశైలిలో రచనలు చేసేవారు. వ్యావహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకరు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో అద్వితీయ ప్రతిభ కలవారు కందుకూరి. ఆయన 130కి పైగా గ్రంధాలు రాసాడు. అన్ని గ్రంధాలు రాసిన వారు తెలుగులో అరుదు. సాంఘిక దురాచారాలను సంభాషణాత్మకంగా, వినోదాత్మకంగా విమర్శించే ప్రహసనాల వంటి ప్రయోగానికి వీరేశలింగమే ఆద్యుడు.ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం 1919 మే 27 న మరణించారు. వీరేశలింగం గొప్ప సంస్కర్తే కాదు, గొప్ప కవి, రచయిత. తెలుగు సాహిత్యంలో ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. ఆయన రచనలు, కవిత్వాల్లో కూడా అభ్యుదయ భావాలు నిండి ఉండేవి. తెలుగు సాహిత్యంలో ఆయనకు సమున్నతమైన స్థానం ఉంది. నవలలు, కథలు, వ్యాసాలు అన్ని రకాల సాహితీ ప్రక్రియల్లో వీరేశలింగం గారు తన దైన ముద్ర వేశారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకూ వీరేశలింగం ఉంటారు.

సంస్కరణోద్యమం ఉన్నంత వరకూ ఆయన పేరు చిరస్థాయిలో నిలుస్తుంది. ఆయన వ్యక్తి కాదు,గొప్ప వ్యవస్థ అనేది నూటికి నూరుపాళ్లు నిజం. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# ఖాళీ స్థలాలు.. కనుమరుగు

సిరిసిల్ల : జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ పురపాలికలు విస్తరిస్తూ.. కలిసిపోయాయి. త్వరలో జంట పట్టణాలుగా ఆవిర్భవించనున్నాయి. ఈ రెండు పురపాలికల పరిధిలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీనికి తోడు ఇబ్బడి ముబ్బడిగా లేఅవుట్లు వెలుస్తున్నాయి. నిబంధనల ప్రకారం లేఅవుట్లలో పదిశాతం ఖాళీస్థలం పురపాలికకు రిజిస్ట్రేషన్ చేశాకే విక్రయాలు ప్రారంభించాలి. రెండు పట్టణాలు పంచాయతీలుగా ఉన్నప్పటి నుంచి లేఅవుట్లను ఏర్పాటు చేస్తూ ప్లాట్ల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. పురపాలికల్లోని లేఅవుట్ స్థలాల్లో జనాభా అవసరానికి తగ్గట్టుగా పిల్లలకు ఆట స్థలాలు, పార్కులు, తాగునీటి ట్యాంకులు, వార్డు, సామాజిక భవనాలు, శ్మశానవాటికలు, ఆరోగ్యకేంద్రాల నిర్మాణాలు జరిగాయి. ఇంకా చాలా వరకు ఖాళీ స్థలాలు ఉన్నాయి.

**ధరణి తర్వాతే ఆక్రమణలు**

జిల్లాలోని పురపాలికల ఖాళీ స్థలాలు.. రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖల వివరాల్లో స్పష్టత కొరవడింది. భూ దస్త్రాల ప్రక్షాళన తర్వాత మ్యుటేషన్ అయినవి మాత్రమే ధరణిలో నమోదయ్యాయి. చాలా వరకు అప్పటికీ మ్యుటేషన్ కాలేదు. ఇదే అదనుగా పక్క ఇంటి నంబరు, ధరణిలోని సర్వే నంబరులో మార్పులు చేసి కొందరు దస్త్రాలు సృష్టించారు. వీటి ఆధారంగానే పురపాలిక స్థలాలు చేతులు మారుతున్నాయి. వాటిల్లో ఎక్కువగా మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలాలు ఉండటం గమనార్హం.

**రక్షణపై శ్రద్ధకరవు..**

పురపాలికలకు రిజిస్ట్రేషన్ చేసిన ఖాళీ స్థలాలకు జియోట్యాగింగ్ చేసుకుని భద్రంగా ఉన్నామని యంత్రాంగం భావిస్తుండగా చాలా చోట్ల రాత్రికి రాత్రే బోర్డులు కనిపించకుండా పోతున్నాయి. రక్షణపై శ్రద్ధ చూపితే మేలు.

**ఇదీ పరిస్థితి**

ప్రస్తుతం కలెక్టర్ సమీపంలో సిరిసిల్ల పంచాయతీగా ఉన్నప్పుడు అయిదు ఎకరాల్లో వేర్వేరుగా లేఅవుట్లు చేసి విక్రయించారు. దీనికి సంబంధించిన 12 గుంటల ఖాళీ స్థలం లేవుట్ కింద అప్పుడు పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. బైపాస్ రహదారి రావడంతో ప్రస్తుతం ఈ ప్రాంతంలో గుంట రూ.30 లక్షలకుపైనే పలుకుతుంది. ఇందులో పురపాలిక ఖాళీస్థలం పాత దస్త్రాలతో రిజిస్ట్రేషన్లతో చేతులు మారాయి.సిరిసిల్ల పట్టణ వ్యాప్తంగా పురపాలకశాఖ వద్ద ఉన్న లెక్కల ప్రకారం 152 లేఅవుట్ స్థలాలు ఉండాలి. వాటిలో చాలావరకు ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తున్నారు. కొన్నింటికి హద్దులు ఏర్పాటు చేశారు. ఇంకా చాలాచోట్ల ఉన్న ఖాళీ స్థలాలు ఎక్కడ ఉన్నాయనేది రెవెన్యూ, పురపాలకశాఖ అధికారులే గుర్తించలేని పరిస్థితి. వేములవాడ పురపాలిక పరిధిలోని విలీన గ్రామాల్లో పురపాలికకు రిజిస్ట్రేషన్ చేసిన ఖాళీ స్థలం చేతులు మారుతున్న వైనం గతేడాది ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై పురపాలక సంఘం న్యాయస్థానాన్ని ఆశ్రయించి వాటిపై స్టే తీసుకొచ్చింది. వేములవాడ పురపాలికలో 35 లేఅవుట్ స్థలాల్లో 9.12 ఎకరాలకు ఎలాంటి రక్షణలేదు. ఇంకా చాలా వరకు ఇప్పటికీ గుర్తించలేదు. కారణం దీనికి సరైన బడ్జెట్‌లేదంటూ అధికారులు దాటవేస్తున్నారు.

# రోడ్డెక్కితే ఉగ్గబట్టుకోవాల్సిందే



హైదరాబాద్ : నగరవాసులు ఏడాదికి రూ.2వేల కోట్ల ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు మాత్రం గ్రేటర్ ప్రజలకు కనీసం మరుగుదొడ్లను ఏర్పాటు చేయలేకపోతున్నారు. ప్రధాన రహదారులపై కిలోమీటర్లు నడిచినా మూత్రవిసర్జనకు వసతులు కనిపించడం లేదు. అక్కడక్కడ కనిపించే ప్రజా మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటంతో వినియోగించుకోలేని పరిస్థితి.

గత సర్కారు హయాంలో అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు కలిసి రూ.60 కోట్లతో మూడు వేల ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్లను(పీఎఫ్‌టీ) కొన్నారు. వాటిని రోడ్ల పొడవునా ఏర్పాటు చేశారు. వాటికి నీటి వసతి, మురుగు కనెక్షన్లు ఇవ్వలేదు. కొన్నాళ్లకు ఆయా నిర్మాణాలు దొంగలపాలయ్యాయి. ఇప్పటికీ వాటి పేరుతో అధికారులు ఏడాదికి రూ.15 కోట్లు లూటీ చేస్తున్నారు. స్వచ్ఛ్ సర్వేలో వీటికి కూడా మార్కులున్నాయి. ప్రస్తుతం నగరంలో ఈ సర్వే జరుగుతోంది. మరుగుదొడ్ల పరిస్థితిని చూసి సర్వే అధికారులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దీని ప్రభావం ర్యాంకుపై పడుతుందని అంటున్నారు.

**కిలోమీటర్లు నడిచినా కనిపించవు..**

మూసాపేట ప్రధాన రహదారి నుంచి కైత్లాపూర్‌కు దూరం నాలుగు కిలోమీటర్లు. గతంలో ఈ రోడ్డుపై ఐడీఎల్‌చౌరస్తా వద్ద పది పీఎఫ్‌టీ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక్క డబ్బా ఉంది. అదీ ఏడాదిన్నరగా వినియోగంలో లేదు.

జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం ముందు స్థానికుల కోసం కంటైనరు డబ్బాలో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. కొన్నాళ్లకే దాని నిర్వహణను బల్దియా గాలికొదిలేసింది. సిబ్బంది తాళం వేసి చుట్టూ మొక్కలు పెట్టారు. ఇప్పటికీ కంటైనరు నుంచి దుర్వాసన వస్తోంది.

వై జంక్షన్ నుంచి బాలనగర్ చౌరస్తావరకు గతంలో 8 పీఎఫ్‌టీలుండేవి. ఇప్పుడు నైపర్ వద్ద ఉపయోగంలో లేని ఓ డబ్బా కనిపిస్తోంది.

అమీర్‌పేటలో రోజూ 20 వేల మంది ఆర్టీసీ బస్సులు ఎక్కుతూ దిగుతూ ఉంటారు. కోఠి, చార్మినార్ సమీపంలోని మదీనా, లాడ్‌బజార్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లోకూ మహిళలు షాపింగ్ కోసం వేలాదిగా వెళ్తుంటారు. ఆయా ప్రాంతాల్లో ఒక్క ప్రజామరుగుదొడ్డీ కనిపించదు. దీంతో జనాలు తీవ్రమానసిక వేదనకు గురవుతున్నారు. హొటళ్లు, షాపింగ్ మాల్స్‌కు వెళ్లి కొందరు అవసరాలను తీర్చుకుంటున్నారు. అక్కడి సిబ్బంది ప్రశ్నిస్తారనే భయంతో చాలామంది ఇంటికెళ్లే వరకు ఉగ్గబట్టుకుంటున్నారు.

**కమిషనర్లు మారితే ఆదేశాలంతే..**

కాలిబాటలు, రోడ్ల పక్కనున్న ఖాళీ స్థలాల్లో టాయిలెట్లు నిర్మించి ఛార్జీ వసూలు చేసుకునే బీఓటీ(బిల్ట్, ఓన్, ఆపరేట్) రకం నిర్మాణాలు అధ్వానంగా ఉంటున్నాయనే ఫిర్యాదులతో గత కమిషనర్లు కొత్తతరహా ప్రజా మరుగుదొడ్ల నిర్మాణంపై దృష్టి సారించారు. గతంలో కమిషనర్లుగా పనిచేసిన రోనాల్డ్‌రాస్, ఆమ్రపాలి వేర్వేరు రాష్ట్రాల్లోని నమూనాలను పరిశీలించి ప్రయోగాత్మకంగా నగరంలో నిర్మించేందుకు ఆదేశాలిచ్చారు. కొన్నాళ్లకే వారు బదిలీకావడంతో అధికారులు వారి ఆదేశాలను అటకెక్కించారు. ఇప్పటికైనా నాణ్యమైన టాయిలెట్ల నిర్మాణానికి, నిర్వహణకు అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మందుల కొరత కార్మికుల వ్యథ!



గోదావరిఖని : రక్తపోటుతో బాధపడుతున్న ఓ సింగరేణి విశ్రాంత కార్మికుడికి కొన్ని రోజుల క్రితం నెలనెలా మందులు ఇచ్చేవారు. ప్రస్తుతం వారానికి మాత్రమే అందిస్తున్నారు. మళ్లీ వారానికి వచ్చి తీసుకెళ్లమని చెపుతున్నారు. నెలకోసారి ఆస్పత్రికి వచ్చే విశ్రాంత ఉద్యోగి ప్రస్తుతం వారానికి ఒకసారి వెళ్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాడు. మధుమేహంతో బాధపడుతున్న మరో విశ్రాంత కార్మికుడికి సైతం ఈ సమస్యనే ఎదురవుతోంది.సింగరేణి ఉద్యోగులు, విశ్రాంత కార్మికులకు యాజమాన్యం సంస్థ ఆస్పత్రుల ద్వారా దీర్ఘకాలిక జబ్బులకు నెలనెలా ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది. ఇటీవల మాత్రం వారానికి సరిపడా అందిస్తోంది. ఆస్పత్రుల్లో మందుల కొరత కారణంగా పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేకపోతోంది. విశ్రాంత కార్మికులు చాలామంది రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు, శ్వాస, నరాల సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. వీరికి సింగరేణి ఆస్పత్రుల ద్వారా మందులు అందిస్తోంది. వైద్యం పొందే సౌకర్యం కూడా ఉంది. మందుల కోసమే ఏటా రూ.40 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు చెపుతున్న యాజమాన్యం క్షేత్రస్థాయిలో మాత్రం అలా కనిపించటం లేదు.

**దూర ప్రాంతాల్లో నివాసం.. వారానికోసారి ప్రయాణం**

గనులు విస్తరించి ఉన్న ఆరు జిల్లాల పరిధిలో పనిచేసిన విశ్రాంత కార్మికులు ఆ తర్వాత ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్ తదితర జిల్లాల్లో నివసిస్తున్నారు. అక్కడి నుంచి వారు పనిచేసిన ప్రాంతానికి చెందిన ఆస్పత్రికి వచ్చి మందులు తీసుకెళ్తుంటారు. నెలకోసారి వచ్చి మందులు తీసుకెళ్లే విశ్రాంత కార్మికులు ప్రస్తుతం వారానికి ఒకసారి రావడం వల్ల ప్రయాణ ఖర్చులతో పాటు అలసటకు గురవుతున్నారు. సింగరేణి వ్యాప్తంగా నాలుగు ప్రధాన ఆస్పత్రులతో పాటు 21 డిస్పెన్సరీలున్నాయి. వీటిల్లోనే విశ్రాంత కార్మికులు వారు పనిచేసిన ప్రాంతంలోని వైద్యశాలల్లో మందులు తీసుకోవాలి. కొత్తగూడెం, భూపాలపల్లి, గోదావరిఖని, రామకృష్ణాపూర్‌లలో ప్రధాన ఆస్పత్రులున్నాయి. మిగతావి డివిజన్‌కు ఒక డిస్పెన్సరీ నిర్వహిస్తున్నారు.

**వెంటనే కొనుగోలు చేయాలి**

విశ్రాంత కార్మికులకు నెల రోజులకు సరిపడా మందులు పంపిణీ చేయాలి. కొరత లేకుండా మందులు వెంటనే కొనుగోలు చేయాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే విశ్రాంత కార్మికులకు వారానికి సరిపడా మందులు ఇవ్వడం వల్ల ప్రయాణ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
వై.సత్తయ్య, బీఎంఎస్ నాయకులు

# వ్యాధుల కాలం.. అప్రమత్తతే దివ్యౌషధం

కొత్తగూడెం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొన్నిరోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ మార్పులతో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. పైగా నివాసాల పరిసరాల్లో మురుగు నీటి నిల్వలు పేరుకుపోతున్నాయి. ఈగలు, దోమలు వృద్ధి చెందితే మలేరియా, డెంగీ, గున్యా, మెదడువాపు తదితర వ్యాధుల ముప్పు పొంచి ఉంటుందని వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

దోమల నియంత్రణతో సగం రోగాలు దూరం ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే రాష్ట్రాన్ని తాకుతాయని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వర్షాలు ఇప్పటికే మొదలయ్యాయి. కాలానుగుణ వ్యాధులకు.. దోమల దండయాత్రకు వానాకాలం అనుకూలం. మశకాలను నియంత్రించగలిగితే సగం వ్యాధులు దూరమవుతాయి. ముఖ్యంగా దోమకాటు వల్ల జ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువ. వాటితో పాటు మలేరియా, డెంగీ, గున్యా వంటి వ్యాధులు సోకుతాయి. దోమలు ప్రధానంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, మురుగు కాల్వలు, చెత్త, అపరిశుభ్ర వాతావరణంలో గుడ్లుపెట్టి వ్యాప్తి చెందుతాయి. ఇలాంటి ప్రాంతాలను గుర్తించి మశకాల నివారణకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామంటున్నారు.

**ఇవీ సూచనలు..**

కాలానుగుణ వ్యాధులను అరికట్టేందుకు గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి.

దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలి.

రహదారుల పక్కన మురుగు కుంటల్లో నీరు నిలవకుండా చూడాలి.

ఇళ్లల్లో నీటి డ్రమ్ములను రెండు, మూడు రోజులకు ఒకసారి శుభ్రంగా కడగాలి.కిటికీలు, గుమ్మాలకు జాలీలు అమర్చుకోవాలి. దోమ తెరలు వినియోగించాలి.

**మరిన్ని జాగ్రత్తలు అవసరం**

వర్షాల సమయంలో ప్రధానంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశాలు ఎక్కువ. ప్రజలు సాధ్యమైనంత వరకూ వేడిచేసి చల్లార్చిన నీటినే తాగాలి. ఇళ్లల్లో పాత సామాన్లు, నీళ్ల డ్రమ్ములు, వాడిపాడేసిన టైర్లు, కూలర్లు తదితరాల్లో నీరు నిలవకుండా జాగ్రత్తపడాలి. మాస్కు ధరించటంతో కాలానుగుణ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. వాతావరణం చల్లబడటంతో బ్యాక్టీరియా, వైరస్‌లు సులువుగా వ్యాప్తి చెందుతాయి. ముఖ్యంగా పిల్లల్లో వీటి తీవ్రత అధికంగా ఉంటుంది. వర్షంలో చిన్నారులు తడవకుండా చూసుకోవాలి. ఆహారం వేడిగా ఉన్నప్పుడు తీసుకుంటే మంచిది. జ్వరం, జలుబు, దగ్గు సమస్యలు మూడు రోజులైనా తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలి.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా కాలానుగుణ వ్యాధులు, దోమల నివారణకు చేపట్టాల్సిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. గతంలో మలేరియా, డెంగీ కేసులు ఎక్కువగా నమోదైన తిరుమలాయపాలెం, బోనకల్లు, చింతకాని, ముదిగొండ తదితర మండలాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.డా.కళావతిబాయి, జిల్లా వైద్యాధికారి, ఖమ్మం

# ఎకరాల లెక్క.. వసూళ్లు పక్కా!

ఖమ్మం : మధిర నియోజకవర్గంలో ఓ రెవెన్యూ కార్యాలయ అధికారి భూ క్రయవిక్రయాలకు వచ్చే రైతులతో నేరుగా బేరసారాలు ఆడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎకరాకు రూ.5వేల చొప్పున ఇచ్చిన వారి భూముల రిజిస్ట్రేషన్లే చేస్తున్నారు. నగదు లేకుంటే 'ఫోన్ పే' ద్వారా తన నంబర్‌కు డబ్బులు పంపించాలని ఒత్తిడి తెస్తున్నారు. మూడెకరాల భూమి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లిన ఓ రైతు.. ఫోన్ పే ద్వారా రూ.15వేలు చెల్లించారు.

పాలేరు నియోజకవర్గంలో ఓ అధికారికి డబ్బు ముట్టజెప్పనిదే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎకరాల చొప్పున లెక్కగట్టి ఆ అధికారి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఓ రైతు తన రెండెకరాల భూమిని కుటుంబ సభ్యుడి పేరిట బదలాయించుకునేందుకు వెళ్తే సదరు అధికారి రూ.30వేలు డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని రైతు తెలిపితే.. రూ.20వేలు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుందని తెగేసి చెప్పారు. చేసేదేమీ లేక రైతు డబ్బు ముట్టజెప్పిన తర్వాతే రిజిస్ట్రేషన్ తంతు పూర్తిచేశారు. మరో మండలంలోనూ ఇదే రకమైన వసూళ్ల పర్వం కొనసాగుతోంది.

భూముల క్రయవిక్రయాలు పారదర్శకంగా జరగాలనే సదుద్దేశంతో భూభారతి చట్టం అమలుకు ప్రభుత్వం పూనుకుంటోంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన (జూన్ 2) పూర్తిస్థాయిలో 'భూ భారతి'ని అమల్లోకి తీసుకురాబోతోంది. ఇందులో భాగంగా 'ధరణి' స్థానంలో భూభారతి పోర్టల్‌ను తీసుకొచ్చి ప్రయోగాత్మకంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపడుతోంది. పోర్టల్ పేరు మారిందే తప్ప అధికార యంత్రాంగం వసూళ్ల తీరు అలాగే సాగుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అనేక రెవెన్యూ కార్యాలయాల్లో ఇలాంటి పరిస్థితులు దాపురించాయనే వాదనలు వినిపిస్తున్నాయి.. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు స్థానిక తహసీల్ కార్యాలయాల్లో జరుగుతున్నాయి. భూ క్రయవిక్రయాలు, వారసత్వ భూముల మార్పిడి, సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్‌ల వంటి భూముల రిజిస్ట్రేషన్ల కోసం ముందుగా రైతులు 'మీసేవ'లో స్లాట్ బుక్ చేసుకోవాలి. తమకు అనుకూలమైన తేదీని ఎంచుకోవాలి. ఆయా ప్రాంతాల్లో భూముల విలువకు ప్రభుత్వ ధరను బట్టి ఆన్‌లైన్‌లో సర్కారుకు రుసుము చెల్లించాలి. ఒక్కో తహసీల్ కార్యాలయంలో రోజుకు సగటున 5-10 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. పారదర్శకత కోసం 'ధరణి' స్థానంలో భూ భారతి చట్టాన్ని తెచ్చినా కొంతమంది అధికారుల తీరులో మార్పు కానరావటం లేదు. అనేక రెవెన్యూ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లకు ఎకరాల చొప్పున వసూళ్లు చేస్తున్నారు. కొన్నిచోట్ల నేరుగా అధికారులు, ఇంకొన్నిచోట్ల ఆపరేటర్లు ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నారు. ఎకరాకు రూ.2వేల నుంచి రూ.10వేల వరకు దండుకుంటున్నారు. డాక్యుమెంట్‌లో చిన్నపాటి సవరణకైనా అడిగినంత ముట్టజెబితేనే తంతు ముగిస్తున్నారు. లేకపోతే సాకులు చూపి కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటున్నారు. వారసత్వ భూముల మార్పిడి, గిఫ్ట్ డీడ్‌లకూ ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు.

కొందరు అధికారులు దర్జాగా తమ సెల్‌ఫోన్ నంబర్లకే 'ఫోన్ పే' ద్వారా డబ్బులు జమచేయించుకుంటున్నారు. ఇటీవల ఉభయ జిల్లాల్లో కొంతమంది అధికారులు బదిలీ అయ్యారు. వీరిలో ఒకరిద్దరు అధికారులపై వసూళ్ల ఆరోపణలు వెల్లువెత్తటం గమనార్హం. అవినీతికి తావులేకుండా భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగేలా భూ భారతి చట్టాన్ని అమలుచేస్తాం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము మినహా మిగతా ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా అధికారులు వసూళ్లకు పాల్పడినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్

# నిబంధనతో సరి.. చిత్తశుద్ధి ఏది?

ధర్మపురి : పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి వినియోగం కూడా పెరుగుతోంది. కానీ సంరక్షణ చర్యల్లో ప్రజల బాధ్యతరాహిత్యం, అధికారుల నిర్లక్ష్యంతో విఫలమవుతున్నారు. దీంతో భూగర్భజలాలు పడిపోయి ఏటా వేసవిలో నీటి కష్టాలు నెలకొంటున్నాయి. అప్పటికప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక చర్యలతో చేతులు దులుపుకొంటున్నారు. కానీ శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టడం లేదు. పట్టణాల్లో ఇంటి నిర్మాణ సమయంలో తప్పకుండా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలనే నిబంధన ఉంది. కానీ జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పురాల్లో అమలు కావటం లేదు. రోజురోజుకు పట్టణాల విస్తీర్ణం పెరుగుతోంది. దారులన్నీ సీసీ రోడ్లుగా మారుతుండటంతో వాన నీరు ఇంకే పరిస్థితి లేదు. మరోవైపు నిర్వహణ లోపంతో తవ్విన ఇంకుడుగుంతలు కనిపించటం లేదు.

**అధికారుల అలసత్వం**

టీజీబీపాస్ చట్టం ప్రకారం భవన నిర్మాణానికి అనుమతి పొందాలంటే ఇంకుడుగుంత నిర్మాణం సైతం చేపట్టాలి. 200 చదరపు మీటర్ల విస్తీర్ణ భవనాలు, బహుళ అంతస్తుల నిర్మాణాల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంత ఉండాలి. ఇందుకు నిర్మాణ సమయంలో కనీసం రూ.2 వేలు చెల్లించాలి. ఏర్పాటు చేసుకుంటే ఆ రుసుము అధికారులు వాపసు ఇస్తారు. కాని అనేక మంది అశ్రద్ధ చూపుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సైతం నిబంధనలను అమలు పరచటంలో విఫలమవుతున్నారు. వ్యక్తిగత, వాణిజ్య సముదాయాల్లో ఎన్ని ఇంకుడు



గుంతలు ఉన్నాయి? ఎన్ని నిర్మించాలనే విషయాలపై పుర అధికారులకే స్పష్టత లేకపోవడం వారిలోని చిత్తశుద్ధి లోపం కన్పిస్తోంది.

**నిర్వహణలో నిర్లక్ష్యం**


ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణాల్లో నిర్మించిన ఇంకుడుగుంతలు ఆనవాళ్లు కోల్పోయాయి. 2022లో అప్పటి ప్రభుత్వం నిర్ణీత లక్ష్యాలను ఇచ్చి జగిత్యాల వ్యాప్తంగా అన్ని పురపాలకాల్లో 121 ఇంకుడుగుంతల నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపట్టింది. నిర్వహణ లేక అవి అధ్వానంగా మారాయి. పిచ్చిమొక్కలు, పూడికతో నిండిపోయాయి.

**సదస్సులతో అవగాహన**

ధర్మపురి పురపాలికలో ఇంకుడుగుంతల నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. నూతన ఇంటి నిర్మాణానికి తప్పనిసరిగా ఇంకుడుగుంతలకు రుసుం చెల్లించిన తర్వాతే అనుమతులు ఇస్తున్నాం. పాత వాటిని గుర్తించి వృథా నీరు అందులోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. వచ్చే వర్షాకాలం ప్రారంభంలో ఇంకుడుగుంతలపై సదస్సులను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తాం.
రాజశేఖర్, ధర్మపురి పుర కమిషనర్

# పని చేయని ట్రాఫిక్ సిగ్నళ్లు

కోరుట్ల : జిల్లాలోని రెండో అతిపెద్ద పట్టణం కోరుట్లలో జాతీయ రహదారిపై రాకపోకలకు వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. పట్టణంలోని ప్రధాన రహదారిపై నెలకొన్న రద్దీని నియంత్రించేందుకు నాలుగేళ్ల కిందట నందిచౌక్, కల్లూర్‌రోడ్ క్రాసింగ్ వద్ద పురపాలక సంఘం అధికారులు రూ.లక్షలు వెచ్చించి ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేశారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోయినా పని చేసే విధంగా వాటిపై సోలార్ పరికరాలు అమర్చారు. పట్టణంలో విద్యుత్తు సరఫరా ఉంటేనే సిగ్నళు పని చేస్తుండేవి. గతేడాది వేసవిలో ట్రాఫిక్ సిగ్నళ్లు చెడిపోగా ఏడాది గడిచినా మరమ్మతు చేయకుండా బల్దియా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు.పట్టణంలోని ప్రధాన రోడ్డు జాతీయ రహదారి ఒక్కటే కావడంతో నిత్యం వేల సంఖ్యలో భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణంలో రహదారిపై డివైడర్లు ఉండటంతో కూడళ్ల వద్ద మాత్రమే ప్రజలు రోడ్లు దాటే వీలుంది. పట్టణంలోని ప్రధాన కూడళ్లు నందిచౌక్, కల్లూర్ రోడ్ క్రాసింగ్ వద్ద రోజంతా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భారీగా వాహనాలు ఒక్కసారిగా రహదారిపైకి వచ్చి అడ్డదిడ్డంగా వెళ్లడంతో వాహనాలు, ప్రజలు రోడ్లు దాటడం కష్టంగా మారింది.



వీటితోపాటు కొత్తబస్టాండ్ సర్కిల్, కార్గిల్‌చౌక్, అయిలాపూర్‌రోడ్ క్రాసింగ్ వద్ద వాహనాలు రోడ్లు క్రాస్ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధాన సర్కిళ్ల వద్ద వాహనాల రద్దీని నియంత్రించేందుకు పోలీస్ స్టాండ్‌లను ఏర్పాటు చేసినా అందులో సిబ్బందిని నియమించడం లేదు. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ సిగ్నళ్లకు మరమ్మతు చేయించాలని పట్టణ ప్రజలు పలుమార్లు బల్దియా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవచూపి ట్రాఫిక్ సిగ్నళ్లకు మరమ్మతు చేయించి ఇక్కట్లు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# ఆక్రమణ అంతుచూశారు..!

హైదరాబాద్ : అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా పేరున్న పీర్జాదిగూడ నగర పాలక సంస్థపై హైడ్రా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రహదారులు, ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం చోద్యం చేస్తున్నారని ఇటీవల హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు పదుల సంఖ్యలో ఫిర్యాదులు వెళ్లాయి. స్పందించి ఆయన విచారణ చేపట్టారు. ఉదయం పలు నిర్మాణాలను కూల్చివేయించారు.

**ఫిర్యాదులు ఇవే:** కంచె పర్వతాపూర్‌లో మైనారిటీల ఖబ్రస్థాన్లు రెండు ఉన్నాయి. వీటిని కబ్జా చేసి ప్లాట్లుగా కొందరు భారాస నేతలు విక్రయించారు. స్థానిక నేత సుఖేందర్‌రెడ్డికి సర్వే నంబరు-12లో సొంత భూమి ఉంది. ఆ పక్కనే సర్వే నంబరు-1లో ప్రభుత్వ భూమి ఉంది.



ఈ భూమితో పాటు ఖబ్రస్థాన్ కబ్జా చేసి ఇంటి స్థలాలు విక్రయించారు. సమాధులపై మట్టి పోసి కనిపించకుండా చేశారని ముస్లింలు కొందరు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇందులో పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కావెంకట్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు జగదీశ్వర్‌రెడ్డితో పాటు సుఖేందర్‌రెడ్డి ఆక్రమించారని తెలిపారు. 15 ప్లాట్ల ప్రహరీల మీద తప్పుడు రిట్ పిటిషన్ నంబర్లు రాయించారని కమిషనర్‌కు ఫిర్యాదుదారులు వివరించారు. ఈ స్థలాలను కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. తప్పుడు సర్వే నంబర్లు జోడించి అనుమతులు పొందినట్లు గుర్తించామని తెలిపారు. మూడు దుకాణాలతో పాటు 15 ప్లాట్ల ప్రహరీలను తొలగించారు. దుకాణాదారులకు తగిన సమయం ఇచ్చి కూల్చివేతలు చేపట్టామని హైడ్రా అధికారులు ప్రకటనలో తెలిపారు.

# డ్యూయల్ డిగ్రీకి అనుమతులివ్వాలని వినతి

హైదరాబాద్ : ఇంజినీరింగ్ డ్యూయల్ డిగ్రీ కోర్సులను అఖిలభారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) అనుమతులు లేకుండా పదహారేళ్లు నిర్వహించిన జేఎన్‌టీయూ అధికారులు తప్పులు దిద్దుకునేందుకు దిల్లీ బాట పట్టారు. దిల్లీలో ఏఐసీటీఈ ఛైర్మన్ ప్రొఫెసర్ సీతారాంను కలసి అనుమతులు లేని కోర్సుల నిర్వహణపై విజ్ఞప్తులు అందజేయాలని మూడు రోజుల క్రితమే ఇద్దరు ప్రొఫెసర్లు దిల్లీకి వెళ్లారు. ఇంజినీరింగ్ డ్యూయల్ డిగ్రీ నిర్వహణకు తమవద్ద అన్ని వనరులున్నాయని,అనుమతులు మాత్రం తీసుకోలేదని క్షుణ్ణంగా వివరించినట్టు తెలిసింది. నిబంధనలను పరిశీలించి అనుమతులివ్వాలా? వద్దా అని తుది నిర్ణయం తీసుకుంటామని ఏఈసీటీఈ అధికారులు చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం.

**అనుమతులున్నాయనే..**

జేఎన్‌టీయూ నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ డ్యూయల్ డిగ్రీకి అనుమతులున్నాయనే విద్యార్థులు చదువుకుంటున్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ డ్యూయల్ డిగ్రీకే అనుమతులుండగా.. 2009వ సంవత్సరం నుంచి అధికారులు కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్,



సివిల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఈఈఈ, ఈసీసీ, సీఎస్సీ, సివిల్ ఇంజినీరింగ్ సీట్లను ఒక్కో విభాగంలో ముప్పై చొప్పున పెంచారు.

**మినహాయింపు ఉంటుందా? కోర్సులు రద్దు చేయాలా?**

అనుమతులు లేకుండా డ్యూయల్ డిగ్రీ కోర్సులు నిర్వహించామంటూ జేఎన్‌టీయూ అధికారులు చెప్పిన వివరాలను పరిగణలోకి తీసుకుని ఏఐసీటీఈ అధికారులు మినహాయింపు ఇస్తారా? నిబంధనలు పాటించలేదని కోర్సులు రద్దు చేస్తారా? అన్న అంశాలపై జేఎన్‌టీయూ అధికారులకు స్పష్టత లేదు. ప్రభుత్వ వర్సిటీ కావడంతో ఈ ఒక్కసారికి మినహాయింపులు ఇవ్వాలంటూ ఏఐసీటీఈ అధికారులను అభ్యర్థించామని జేఎన్‌టీయూ వర్గాలు తెలిపాయి. డ్యూయల్ డిగ్రీ కోర్సుల అనుమతులపై అవసరమైతే మరోసారి అధ్యాపకులను పంపే విషయంపై నిర్ణయం తీసుకుంటామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి చెప్పారు.

# జిల్లాకు చల్లని కబురు

కొత్తగూడెం: ఖమ్మం జిల్లా అధిక వేడి ప్రమాదంలో ఉందని దిల్లీకి చెందిన శక్తి పర్యావరణం, నీటిమండలి (సీఈఈడబ్ల్యూ) ప్రచురించిన కొత్త అధ్యయనం స్పష్టం చేసింది. దీని ప్రకారం రాష్ట్రంలో అధిక వేడి నుంచి చాలా అధిక వేడి ప్రమాదంలో ఉన్న జిల్లాల జాబితాలో ఖమ్మం 21వ స్థానంలో నిలిచింది. 24వ స్థానంలో కొనసాగుతున్న భద్రాద్రి కొత్తగూడెం.. తక్కువ వేడి ప్రమాదం ఉన్న జిల్లాల జాబితాలో చోటుదక్కించుకోవటం విశేషం. అధ్యయనంలో భాగంగా సీఈఈడబ్ల్యూ పరిశోధకులు ఉభయ జిల్లాలకు సంబంధించిన 40ఏళ్ల వాతావరణ వివరాలు, ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించి ఉష్ణోగ్రత ధోరణులు, భూ వినియోగం, నీటి వనరులు, పచ్చదనాన్ని అధ్యయనం చేశారు. వేడి ముప్పుపై సమగ్ర చిత్రం కోసం రాత్రి ఉష్ణోగ్రతలు, తేమతోపాటు జనాభా, భవనాలు, ఆరోగ్యం, సామాజిక-ఆర్థిక అంశాలనూ ఇందులో చేర్చారు.

ప్రధాన అంశాలు ఇవిగో..తెలంగాణలో తొమ్మిది జిల్లాలు అత్యధిక వేడి ప్రమాదంలో, 14 జిల్లాలు అధిక వేడి ప్రమాదంలో ఉన్నాయి. ఇందులో ఖమ్మం జిల్లా ఒకటి.మిగతా పది జిల్లాలు తక్కువ వేడి ప్రమాదం కలిగిన జాబితాలో ఉన్నాయి. వీటిలో భద్రాద్రి జిల్లా ఒకటి.1982-2011తో పోల్చితే.. 2012-2022 దశాబ్ద కాలంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 3 నుంచి 6 తీవ్ర వడగాల్పులు నమోదైన రోజులు పెరిగినట్లు అధ్యయనం స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఉభయ జిల్లాల్లో వేడిరాత్రుల నమోదు సైతం 3 నుంచి 6 రోజులు పెరిగినట్లు తేలింది. అధిక వెచ్చని రాత్రుల సంఖ్య మరింత పెరిగితే శరీరం చల్లబడే అవకాశం లేక అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని పరిశోధకులు చెబుతున్నారు.

1982-2011తో పోల్చితే.. 2012-2022 దశాబ్ద కాలంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో వేసవి తేమ 0-3శాతం పెరిగినట్లు అధ్యయనం పేర్కొంది. అధిక తేమ మానవ శరీరంపై వేడి ఒత్తిడిని తీవ్రతరం చేస్తుంది.మానవ ఆరోగ్యానికి పెనుప్రమాదం..'నిశ్శబ్ద విపత్తు'గా భావించే వేడిగాలులు మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని అధ్యయనం వెల్లడించింది.

# మీ పని మీదే.. మా పని మాదే



హైదరాబాద్ : మూసీ నది ప్రక్షాళనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంటే.. మరోవైపు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. బఫర్ జోన్ దాటి కబ్జాదారులు నదిలోకి ప్రవేశిస్తున్నారు. ఉంటే స్థలం ఉంటుంది.. పోతే ప్రభుత్వం నుంచి పరిహారం వస్తుందనే ఆశతో ఇలా చేస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. భారీగా వరదలొస్తే నగరాన్ని ముంచెత్తడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే చిన్నపాటి వర్షానికే నాలాలు పొంగి వరదంతా రోడ్లపైకి చేరుతుంది. మూసీలో కలిసే మార్గాలన్నీ కుంచించుకుపోయాయి. వరదనీటి మళ్లింపు వ్యవస్థకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. మూసీ ఆక్రమణకు ఈ చిత్రమే నిదర్శనం. గండిపేట మండల సమీపంలో ఓఆర్ఆర్ వద్ద నదిని ఇలా పూడ్చారు. పక్కనే భారీ నిర్మాణం జరుగుతోంది. గుర్తు తెలియని వ్యక్తులు నదిలో నిర్మాణ వ్యర్థాలను డంప్ చేస్తున్నారని.. తమకు సంబంధం లేదని ఆ నిర్మాణ సంస్థ చెబుతోంది. విద్యుత్తు లైన్లకు సంబంధించి భారీ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఆ గుత్తేదారు సైతం నిర్మాణ వ్యర్థాలను నదిలో నింపేశారు. ఇదంతా రోడ్డు పక్కనే జరుగుతున్నా అధికారులు సైతం మౌనంగానే ఉంటున్నారు.

**మురుగు వదిలేసి.. కలుషితం చేసి**

ప్రధానంగా మురుగు నీరు నేరుగా మూసీని చేరుతోంది. సుమారు 200 కోట్ల లీటర్ల మురుగునీరు వివిధ స్థాయిల్లో నదిలో కలుస్తోంది. నార్సింగి నుంచి ప్రతాపసింగారం వరకు (ఓఆర్ఆర్) ఆక్రమణలు కోకొల్లలు. వాటిని గుర్తించేందుకే యంత్రాంగం ఆపసోపాలు పడుతోంది. నిర్మాణ వ్యర్థాలను వేసి నదిని పూడ్చుతూ ప్రవాహాన్ని అడ్డుకున్నారు. ఎంఆర్‌డీసీఎల్ ఏర్పాటైన తర్వాత బఫర్ జోన్ 50 మీటర్ల నుంచి 100 మీటర్లకు పెంచారు. అయినా నిర్మాణాలు ఆగడం లేదు. జలవనరుల శాఖ అధికారులు కూడా ఎన్‌వోసీ ఇచ్చేస్తుండటం గమనార్హం. ఎక్కడా నది వెడల్పు (బెడ్ విడ్త్)ను మాత్రం స్పష్టంగా పేర్కొనడం లేదు.

**ఎంఆర్‌డీసీఎల్ ఆవిర్భవించినా..**

మూసీ ప్రక్షాళన కోసం ఎంఆర్‌డీసీఎల్ ఏర్పాటు చేసినా ఆక్రమణలు నియంత్రించలేకపోతున్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్), మరోవైపు జలవనరుల సంరక్షణే లక్ష్యంగా, ఆక్రమణలు అరికట్టడమే ధ్యేయంగా పనిచేస్తున్న హైడ్రా సైతం వీటిపై దృష్టిసారించలేని పరిస్థితి. 2005లో సేవ్ మూసీ పేరుతో కార్యక్రమం చేపట్టినా అది మధ్యలోనే ఆగింది. నాడు దాదాపు రూ.908 కోట్లు అవసరమని అంచనా వేశారు. 2017లో మూసీ నది అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశారు. 115 కిలోమీటర్ల మేర నదిని ప్రక్షాళన చేసి మంచినీటి నదిగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు ప్రాథమికంగా రూ.16,635 కోట్లతో ప్రణాళికలు రూపొందించారు. ఇందులో ఆక్రమణల తొలగింపు, వంతెనల నిర్మాణం, పార్కుల అభివృద్ధి వంటివి ఉన్నాయి.

# ముప్పును ముందే గుర్తిద్దాం.. అప్రమత్తమవుదాం



హైదరాబాద్: 'అగ్ని' గండంతో నగరం బెంబేలెత్తిపోతోంది. గుల్జార్‌హౌజ్ ఘటనతో పాటు ఇటీవల జరిగిన వరుస ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాద నివారణ చర్యలపై అందరూ దృష్టి పెట్టాలని అగ్నిమాపక శాఖ చెబుతోంది. నివాస భవనాలు, ఆసుపత్రులు, వాణిజ్య భవనాలు, పాఠశాలల్లో మాక్‌డ్రిల్స్ నిర్వహించడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమని స్పష్టం చేస్తోంది. రాష్ట్రంలో నమోదయ్యే అగ్నిప్రమాద ఘటనల్లో 40 శాతం రాజధాని పరిధిలోనే సంభవిస్తున్నాయని నివేదికలు చెబుతున్నాయి. **ఎలా చేస్తారు..?:** అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలు ఎలా ఆర్పాలి..? అగ్నిమాపక సామగ్రి ఎలా వినియోగించాలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఫైర్ వాటర్ వ్యాన్‌తో పైఅంతస్తుల వరకు ఎలా వెదజల్లుతారో ప్రదర్శిస్తారు. స్ప్రింక్లరు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్, ప్రతి ఎవాక్యుయేషన్ ప్లాన్, మాన్యువల్ కాల్ పాయింట్స్ (భవన భద్రత, సర్టిఫైడ్ నిపుణుల పర్యవేక్షణ, వారి బాధ్యత)పై అవగాహన కల్పిస్తారు.

**ప్రమాదకర భవనాలను గుర్తించి..**

అపార్టుమెంట్లు, ఐటీ కంపెనీలు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేటు కార్యాలయాల వారు దరఖాస్తు చేసుకుంటే అగ్నిమాపక శాఖ ఫైర్‌మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. ప్రతి శుక్రవారం బహుళ అంతస్తుల భవనాల్లో నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. **ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడమెలా..?** %https://fire.telangana.gov.in%/ వెబ్‌సైట్‌లోకి వెళ్లి 'అప్లై ఫర్ మాక్‌డ్రిల్ సర్వీస్'పై క్లిక్ చేస్తే లాగిన్ పేజీ ప్రత్యక్షమవుతుంది. ఇక్కడ రిజిస్టర్ ప్రక్రియ పూర్తిచేసి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ సృష్టించుకోవాలి. లాగిన్ అయి డాష్‌బోర్డు పేజీలో మాక్‌డ్రిల్ అప్లికేషన్‌ను ఎంచుకోవాలి. దరఖాస్తుదా రు పేరు, మాక్‌డ్రిల్ చేయాల్సిన ప్రదేశం, చిరునామా, అది ప్రభుత్వ భవనమా.. కాదా..? చెప్పాలి. ప్రైవేటు వారైతే రూ.5వేల రుసుము చెల్లించాలి. దరఖాస్తులు పరిశీలించి మాక్‌డ్రిల్ అనుమతులు జారీ చేస్తున్నారు.

# ఏళ్లుగా తాళం.. ఎందుకు తాత్సారం!




తాండూరు : గ్రామాల్లోనే పౌర సేవలు అందించే లక్ష్యంతో పల్లెల్లో మీసేవా కేంద్రాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. తొలిసారిగా తాండూరు మండలంలో కార్యాచరణకు శ్రీకారం చుట్టి, రూ.2కోట్లతో భవనాల నిర్మాణం చేపట్టింది. ఇవి పూర్తై ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో తాండూరు మండలం గ్రామాల్లో రూర్బన్ పథకం అమలు చేశారు. పథకం ద్వారా పట్టణాల మాదిరిగా, పల్లెల్లోనూ సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా పల్లెల్లోనే 200కుపైగా పౌర సేవలు అందించాలని నిర్ణయించారు. 25 పంచాయతీల్లో మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఖరారు చేశారు. నిర్మాణ బాధ్యతలను నీటి పారుదల శాఖకు అప్పగించారు. మల్కాపూర్, సంగెంకలాన్, కొత్లాపూర్, ఐనెల్లి, మిట్టబాస్పల్లి, పర్వతాపూర్, గోనూరు, నారాయణ్‌పూర్, బెల్కటూరు, బిజ్వార్, వీరారెడ్డిపల్లి, రాంపూర్, చెంగోల్, చెంగెష్‌పూర్, కరణ్‌కోట, అంతారం, చంద్రవంచ, ఎల్మకన్నె, గౌతాపూర్‌లో భవనాలు నిర్మించారు. సిరిగిరిపేటలో పునాదులు, స్తంభాల వరకు నిర్మించి వదిలేశారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.8లక్షలు ఖర్చు చేశారు. వీటికి రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు.

**వినియోగిస్తే ఉపాధి:** కేంద్రాలను అందుబాటులోకి తెచ్చి నిర్వహణ బాధ్యతలను గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు అప్పగిస్తే ఉపాధి లభించనుంది. గ్రామస్థులకు రేషన్‌కార్డుల దరఖాస్తు, కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలు వంటి వందలసంఖ్య పౌర సేవలు చేరువలోనే పొందే వెసులుబాటు లభిస్తుంది. దీంతో పదుల కి.మీ. ప్రయాణించి పట్టణానికి వెళ్లే బాధలు తీరనున్నాయి. సమయం ఆదా అవడంతోపాటు రవాణా భారం నుంచి ఉపశమనం లభించనుంది. పట్టణంలోని మీసేవా కేంద్రాల నిర్వాహకులపై ఒత్తిడి తగ్గడంతో ఊరట కల్గుతుంది. **మూడేళ్లుగా ప్రారంభించకుండా..**

భవనాలు పూర్తయినా మూడేళ్లుగా ప్రారంభోత్సవానికి నోచడంలేదు. ఇరవైకిపైగా గ్రామాల్లో భవనాలకు తాళం వేసి ఉంచారు. జిన్‌గుర్తిలో మీసేవా భవనాన్ని పంచాయతీ కార్యాలయానికి వినియోగిస్తున్నారు. మిట్టబాస్పల్లిలో ముడిసరుకు సామగ్రి నిల్వకు వాడుతున్నారు. కరణ్‌కోటలో ఏకంగా భవనానికి కొత్త రంగులు వేసి పౌరపఠన కేంద్రంగా నామకరణం చేశారు. మిగిలిన గ్రామాల్లో భవనాలకు తాళాలు వేశారు. ఆర్భాటంగా నిర్మించిన భవనాలను ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంచిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు.

# ఆశల ఇంటికి ఆంక్షల అడ్డు

పెద్దపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రయోగాత్మక గ్రామాల్లో ప్రగతి ముందుకెళ్లడంలేదు. తక్కువ స్థల విస్తీర్ణం, బిల్లుల చెల్లింపులో జాప్యం, రూ.5 లక్షల నిధులు సరిపోవనే భావన, ఆర్థిక స్తోమత ఇతరత్రా కారణాలతో లబ్ధిదారులు వెనుకాడుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పించినప్పటికీ ఆసక్తి చూపడంలేదు. నిబంధనలు సడలించాలని కోరుతున్నారు.

**ప్రధాన కారణాలివే..**

400-600 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించుకుంటేనే బిల్లులు మంజూరు కావడం చాలామంది ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించుకునేందుకు ఆసక్తి చూపించడం పాత ఇంటిని తొలగిస్తే నివాసం దొరకడం కష్టంగా ఉంటుందని భావించడం ప్రస్తుత పరిస్థితుల్లో నిరుపేదల చేతిలో నగదు లేకపోవడం మొదట్లో బిల్లుల చెల్లింపులో కొంత జాప్యం నెలకొనడంతో ఇబ్బందులు ఎదురవడం

**పలు ప్రాంతాల్లో ఇదీ పరిస్థితి**

కాల్వశ్రీరాంపూర్ మండలం అంకంపల్లిలో 113 ఇళ్లకు 20 నిర్మాణాలకు ముగ్గు పోయగా పనులు కొనసాగుతున్నాయి. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో 167 ఇళ్లకు 74 వాటికి పనులు చేస్తున్నారు.



ఓదెల మండలం శానగొండలో 217 ఇళ్లు మంజూరైతే 31, పాలకుర్తి మండలం రామారావుపల్లిలో 121 ఇళ్లకు 31 చోట్ల పనులు మొదలుపెట్టారు. రామగిరి మండలం రత్నాపూర్‌లో 323 ఇళ్ల లబ్ధిదారులకు వ్యయం సరిపోకపోవడంతో వేచి చూస్తున్నారు. కమాన్‌పూర్ మండలం రొంపికుంటలో 206 ఇళ్లకు 52, ధర్మారం మండలం బంజేరుపల్లిలో 71 ఇళ్లకు 33 ఇళ్ల నిర్మాణం సాగుతోంది.

జిల్లాలోని 13 ప్రయోగాత్మక గ్రామాల్లో 1940 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 736 చోట్ల పనులు ప్రారంభించారు. 316 ఇళ్లు బేస్‌మెంట్ వరకు, 14 వాటికి గోడలు, ఒక నిర్మాణానికి సంబంధించి పైకప్పు దశలో ఉన్నాయి.

**ఇలా చేస్తేనే ప్రగతి సాధ్యం**

గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి పెంకుటిళ్లు ఉన్నాయి. ఎక్కువ విస్తీర్ణంలోని ఇళ్లను తొలగించి నిర్మించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. విస్తీర్ణ నిబంధనలు తొలగించి.. నిరుపేదల ఇళ్లకు మేస్త్రీలు, కూలీలను సమకూర్చే బాధ్యత గుత్తేదార్లకు అప్పజెప్పాలి. స్టీల్, సిమెంట్ ధరలు అధికంగా ఉండటంతో వ్యయం పెంచాల్సిన అవసరముంది. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తే వేగం పెరగనుంది. స్వశక్తి సంఘాల్లోని పేద లబ్ధిదారులకు రూ.లక్ష రుణం మంజూరు చేయాలని అధికారులు ప్రయత్నిస్తునారు. అయితే వీరిలో చాలామంది మహిళలకు మొండి బకాయిలు ఉండటంతో ఆశయం నెరవేరడంలేదు.

# భక్తులు పెరిగినా.. సిబ్బంది అంతే

వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాలోని శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయం, భక్తులకు ఎస్పీఎఫ్ (స్పెషల్ పోలీస్ ఫోర్స్) సిబ్బంది, హోంగార్డులు రక్షణ కల్పిస్తున్నారు. స్వామివారి దర్శనానికి ప్రతిరోజు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వస్తుంటారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా భక్తుల రద్దీ అధికంగా ఉన్న సోమ, ఆది, శుక్రవారాలతో పాటు ఆలయంలో ఏడాది పొడవునా వివిధ ఉత్సవాలు జరుగుతున్న సందర్భంలో, ఆలయ హుండీల లెక్కింపులో సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉన్న సందర్భాల్లో భక్తుల వస్తువులు, నగదు, సెల్‌ఫోన్లు చోరీకి గురైన సంఘటనలు ఉన్నాయి. ఇలాంటి సందర్భంలో వెంటనే సీసీ కెమెరాలను పరిశీలించి చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించడం, వస్తువులను స్వాధీనం చేసుకొని తిరిగి భక్తులకు అప్పగించిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

**సీసీ కెమెరాలతో నిఘా..**

ఆలయంలో భద్రత దృష్ట్యా ఎస్పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షణతో పాటు వివిధ ప్రాంతాల్లో దాదాపు 36 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.




కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్నారు. అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేసి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నేటి అవసరాలకు సరిపడేనారాజన్న ఆలయానికి భక్తుల రాక రోజు రోజుకూ పెరుగుతోంది. భక్తుల భద్రతా చర్యల్లో భాగంగా ఆలయంలో 1999-2000 వేల సంవత్సరంలో అప్పుడు వచ్చే భక్తుల సంఖ్యను బట్టి ఒక ఏఎస్సై, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, మరో పది మంది పోలీస్ కానిస్టేబుళ్లను నియమించారు. వీరితో పాటు మరో 36 మంది హోంగార్డులను నియమించారు. రెండు దశాబ్దాల క్రితం సోమవారం 5 నుంచి 10వేల మంది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చే వారు. ప్రస్తుతం సోమవారం 40 నుంచి 50 వేలకు పైగా మంది భక్తులు వస్తున్నారు. హోంగార్డులు సంఖ్య 22కు తగ్గింది. భక్తుల రాక వేలల్లో ఉంటున్నా ఎస్పీఎఫ్ సిబ్బంది మాత్రం అంతే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఒత్తిడితో కూడిన విధులు నిర్వహిస్తున్నారు. క్యూలైన్లలో భక్తులు పోటెత్తిన సమయంలో వారిని నిలువరించడం కష్టతరంగా మారుతోంది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది.

చురకలు



# పట్టణాల్లోని ఇళ్లకు కొలతలు

కరీంనగర్: జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు మున్సిపాలిటీల్లో ఉన్న ఇళ్లకు కొలతలు నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించారు. రెండేళ్ల కిందట భువన్ యాప్‌తో సర్వే చేపట్టగా ఆ సమయంలో 75 శాతం ఇళ్లను లెక్కించారు. 2018 సంవత్సరంలో విలీనమైన గ్రామాలతోపాటు నగరంలో నూతన భవనాల సంఖ్య విపరీతంగా పెరిగింది. వీటికి సరైన విధంగా పన్ను మదింపు జరగకపోవడం, అదనపు అంతస్తులు నిర్మించుకోవడం, ఆస్తిపన్ను పరిధిలోకి రాకపోవడం, అక్రమ నిర్మాణాలు కట్టడం, ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్లు తీసుకోవడంతో కొలతల విషయంలో తేడాలు ఉంటున్నాయి. ఆస్తిపన్ను మదింపునగర, పురపాలికల్లో భువన్ యాప్ ద్వారా భవనాల చిత్రాలు, కొలతలను అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా అంతర్జాలంలో నమోదు చేశారు. వీటన్నింటికి ఆస్తిపన్ను మదింపు ప్రక్రియ జరుగుతుంది. ఇప్పటికే ఆస్తిపన్ను సర్దుబాటు కావాల్సి ఉండగా పెండింగ్‌లో ఉంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి పెంచిన మొత్తంతో డిమాండ్ నోటిసులు వచ్చే అవకాశముంది.

అదనపు కట్టడాలకు నోటీసులు

ఆస్తిపన్ను మదింపులో తేడాలు ఉండటంతో ఒక్కో ఇంటికి సర్వే చేస్తూ



అదనపు కట్టడాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. కొత్తగా వచ్చిన వార్డు అధికారులకు డివిజన్లు, వార్డులు అప్పగించి తక్కువ ఆస్తిపన్ను చెల్లిస్తున్న జాబితాను తీసుకొని మళ్లీ కొలతలు చేపడుతున్నారు. ప్రధానంగా అదనంగా అంతస్తులు నిర్మించుకోవడం, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిని వదలడం లేదు. వాణిజ్య సంస్థ ఆస్తిపన్ను ఏవిధంగా వస్తుందో నిశితంగా పరిశీలించేలా చర్యలు తీసుకుంటున్నారు.

**పెరుగుతున్న పన్ను**

భువన్ యాప్‌తోపాటు అదనపు నిర్మాణాలకు కొలతలు ఇష్టానుసారంగా చేస్తుండటంతో అడ్డగోలుగా పన్నుల భారం పడుతుంది. దాంతో ఇంటి యజమానులు ఆందోళన చెందుతున్నారు. కొందరికి అయితే ఎలాంటి కొలతలు చేపట్టకుండానే రివైజ్డ్ ఆస్తిపన్ను చెల్లించాలని ఒత్తిడి చేశారు. ఓ దశలో నల్లా కనెక్షన్ కూడా తొలగించారు. వీటిపై అభ్యంతరాలు పరిష్కరించుకునే అవకాశాన్ని ఇవ్వకుండా దాటేశారని మండి పడ్డారు. ప్రస్తుతం ఆస్తిపన్ను అధికంగా వస్తుందనే ఫిర్యాదుల మేరకు తిరిగి కొలతలు చేపట్టి ఆస్తిపన్ను రాబట్టుకోవాలని నిర్ణయించారు.

# చల్లనివన్నీ.. మంచివి కాదండోయ్..!

నీలగిరి : ఎండలు మండుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం పొందేం దుకు చల్లటి పానీయాలు తీసుకుంటే బాగుంటుందని అందరూ భావిస్తుంటారు. అయితే చల్లనివన్నీ మంచి పానీయాలా కాదా అని ఆలోచించాలని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో సమృద్ధిగా నీరు తాగాల్సిన అవసరం ఉంది. ఎండ వేడికి తట్టుకోలేక పలువురు జ్యూస్ లు, ఐస్‌క్రీంలు, ఇతర పానీయాలు తీసుకుంటారు. వినియోగదారులను ఆకర్షించేందుకు నిర్వాహకులు వీటిలో రంగులు, ఇతర పదార్థాలను కలుపుతారు. వీటి వల్ల అనేక రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉందని ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు చెబుతున్నారు.

**కల్తీకి అవకాశం ఉన్న పదార్థాలు**

జ్యూస్‌లు, మజ్జిగ, ఐస్‌క్రీంలు ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లు కల్తీ జరిగేందుకు ఎక్కువగా అవకాశం ఉంటుంది. రంగులు, రుచి కోసం పలు రకాల రసాయనాలను వీటిలో కలుపుతారు. ఫుట్‌పాత్‌లపై తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకునే ముందు ఓ సారి ఆలోచించి తీసుకోవడం ఉత్తమం. జ్యూస్‌లు, ఐస్‌క్రీంలు తయారు చేసేందుకు కలుషిత నీరు, పాలు..పండ్లు త్వరగా పక్వానికి వచ్చేందుకు కార్బైడ్‌లను వినియోగిస్తారు.

**కల్తీపై నిరంతర నిఘా**

–జ్యోతిర్మయి, జోనల్ అధికారి ఆహార కల్తీ నిరోధక శాఖ ఉమ్మడి నల్గొండ

జిల్లా ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్న వ్యాపారులపై నిరంతర నిఘా పెట్టాం. ఉమ్మడి జిల్లాలో సంచార తనిఖీ వాహనం తిప్పుతున్నాం. వినియోగదారులు ఫిర్యాదులు చేసిన చోట, అనుమానం ఉన్న ఫుడ్ తయారీ కేంద్రాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

2024–25 నల్గొండ జిల్లాలో మొత్తం 42 కేసులు నమోదు చేశారు. 9 చోట్ల అనారోగ్య కారకాలు ఉన్నట్లు గుర్తించారు. 33 చోట్ల నాణ్యత పాటించడంలేదని తేలింది. వీరికి రూ.3.47లక్షలు జరిమానా విధించారు.

వేసవిలో తీసుకోవాల్సిన పదార్థాలు

–కల్యాణి, డైటీషియన్

వేసవిలో ఆరోగ్యం కోసం తాజా పండ్లు, అధిక నీటిని అందించే కూరగాయలు తీసుకోవాలి. నీటిని ఎక్కువగా తాగుతూ ఉండాలి. నీరు అధికంగా ఉండే సొరకాయ, బీరకాయ, దోసకాయ, టమాట, కీరదోస మొదలైనవి తీసుకోవాలి. సబ్జా గింజలు రోజుకు 15 గ్రాములు నానబెట్టి తీసుకుంటే శరీరం వేడి నుంచి ఉపశమనం పొందుతుంది. ఫ్రైలు, అధిక కొవ్వు పదార్థాలు తీసుకోవడం మంచిది కాదు. షుగర్ వ్యాధిగ్రస్థులు పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తీసుకోవాలి.

# గురుకులం.. పక్కా పర్యవేక్షణే బలం

సంగారెడ్డి : గురుకులాలు.. ఒకప్పుడు సీటు లభించాలంటే ప్రవేశ పరీక్షకు కష్టపడి చదవాలి. ఇక్కడ సీటు దక్కింతే తమ పిల్లల భవిత బాగుంటుందని తల్లిదండ్రులు సంబర పడేవారు. రానురాను గురుకులాల్లో నాణ్యత తగ్గుతోంది. విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు.. భోజనం నాణ్యంగా లేకపోవడం వంటి కారణాలతో పిల్లలు వీటిలో చదివేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రవేశాలు తీసుకుంటాయి. ఫలితాలు వచ్చిన తరువాత పిల్లలు చేరకపోవడంతో సెప్టెంబరు వరకు సైతం ప్రవేశాలు కొనసాగిస్తున్నారు. పూర్తి స్థాయిలో భర్తీ కావడం లేదు. **అద్దె భవనాల్లో ఇరుకుగా..** ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లాల్లో బీసీ, మైనార్టీ గురుకులాలు 56 ఉన్నాయి. వీటిలో చాలా వరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. తరగతి గదిలోనే ఉదయం పాఠాలు వినడం.. రాత్రిపూట అదే గదిలో పడుకోవడం చేయాల్సి వస్తోంది. సొంత భవనాలు నిర్మిస్తామని పాలకులు హామీ ఇచ్చినా అమలు కావడంలేదు. కొద్దిపాటి శౌచాలయలు విద్యార్థుల సంఖ్యకు సరిపోవడం లేదు. దుర్వాసన వ్యాపిస్తోంది. విద్యార్థులు అస్వస్థతకు గురై ఇబ్బంది పడుతున్నారు. వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

**ఆటపాటల ప్రోత్సాహం తక్కువే** సాంఘిక సంక్షేమ, గిరిజన, బీసీ గురుకులాల్లో గతంలో అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించే వారు. విద్యాభ్యాసంపై దృష్టి పెడుతూనే మరోవైపు ఆటలు.. సాంస్కృతిక కార్యక్రమాల్లో తర్ఫీదు ఇచ్చేవారు. 5వ తరగతి నుంచే క్రీడలు నేర్పించేవారు. ఇక్కడ చదివిన పిల్లలు వివిధ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. ప్రత్యేకంగా కౌన్సెలర్లతో సైకాలజీ తరగతులు నిర్వహించేవారు. తల్లిదండ్రులకు దూరంగా ఉండే వారు.. మార్కులు తదితర కారణాలతో అఘాయిత్యాలు చేసుకోకుండా మానసిక స్థైర్యం కల్పించే వారు. వేసవి శిబిరాలు అన్ని జిల్లాల్లో నెల రోజుల పాటు ఉండేది. మూడేళ్ల నుంచి అరకొరగా చేపడుతున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు వచ్చేందుకు నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రత్యేక తరగతులు చెప్పించేవారు.

# కోట్‌పల్లి.. కల్పవల్లి!



ధారూర్: చుట్టూ అటవీ ప్రాంతం.. మధ్యలో ప్రాజెక్టు ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని చెట్లు, అలుగు నుంచి ప్రవహించే నీరు, ఇక్కడి ప్రకృతి రమణీయత సందర్శకులను ఆకట్టుకుంటోంది. వికారాబాద్ జిల్లా కేంద్రానికి 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు జిల్లాలోనే అతిపెద్ద సాగునీటి వనరు. వికారాబాద్‌కు ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న అనంతపద్మనాభ స్వామిని దర్శించుకొని అనంతగిరి కొండలను తిలకించి అక్కడి నుంచి సందర్శకులు ఈ ప్రాజెక్టు అందాలను తిలకించడానికి వస్తుంటారు. రోజు రోజుకూ పర్యాటకుల తాకిడి పెరిగి అక్కడి పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంటోంది. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించాలని అక్కడ మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు. ఇదిగో ఇలా.. కోట్‌పల్లి ప్రాజెక్టు 24 అడుగుల లోతు, 1784 ఎకరాల్లో విస్తరించి ఉంది. పర్యటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో పరిసర ప్రాంతాల నుంచే కాకుండా జంట నగరాలు, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు ఇక్కడకి వస్తున్నారు. వారాంతంలో, సెలవు రోజుల్లో ఐదు వందల నుంచి వెయ్యి వరకు, మిగతా రోజుల్లో వంద నుంచి రెండు వందల వరకు సందర్శకులు ఇక్కడకు వస్తుంటారు. ప్రోగ్రెసివ్ ఇన్ తెలంగాణ, జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోటింగ్ కొనసాగుతోంది. అందులో 40 మంది లైఫ్‌గార్డులు పనిచేస్తున్నారు. 50 వరకు వివిధ రకాల బోట్లు అందుబాటులో ఉన్నాయి. అటవీశాఖ అధికారులు చెక్‌పోస్టును ఏర్పాటు చేసి పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు.

**ఇలా చేస్తే మేలు..**

ప్రాజెక్టు సమీపంలో చిన్న పార్కును ఏర్పాటుచేసి అందులో పిల్లలు ఆడుకోవడం కోసం పరికరాలను, కూర్చోడానికి బల్లలు ఏర్పాటుచేస్తే బాగుంటుంది.

క్రికెట్, వాలీబాల్ ఆటలు ఆడుకునేందుకు స్థలాన్ని గుర్తించి అభివృద్ధి చేయాలని పర్యాటకులు చెబుతున్నారు.

ప్రాజెక్టు చుట్టూ గ్రామీణ ప్రాంతం కావడంతో పట్టణాల నుంచి వచ్చే వారికి స్థానికంగా మంచి హొటళ్లు లేక ఇబ్బందులకు గురవుతుంటారు. హొటళ్లు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

వర్షాకాలంలో కోట్‌పల్లి ప్రాజెక్టు అందాలు కనువిందు చేస్తుంటాయి. కనుచూపుమేరా నీళ్లు సందర్శకులను ఆకట్టుకుంటాయి. ఎత్తైన ప్రదేశం నుంచి వీక్షించాలంటే అక్కడ వాచ్‌టవర్ ఏర్పాటు చేయాలి. సేదతీరేందుకు చిన్నపాటి షెడ్ ఉండాలి.

నీటిని చూసిన వెంటనే సందర్శకులు ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతుంటారు. ప్రాజెక్టు ఎక్కువ లోతులో ఉండడం, గుంతలు, రాళ్లు కారణంగా ఈతకు వెళ్లలేక నిరుత్సాహానికి గురవుతున్నారు. అక్కడ ఈత కొలను ఏర్పాటు చేస్తే అందరికి మరింత ఉత్సాహంగా గడిపేందుకు అవకాశం ఉంటుంది.

# అనంత గిరులు.. ఆరోగ్య సిరులు



వికారాబాద్ : అందమైన అనంతగిరి కొండలు.. ఆధ్యాత్మికతకు నిలయమైన పద్మనాభ ఆలయం. ఆపై ఔషధ మొక్కలు.. వెరసి ఈ కొండలు వేలాది పర్యాటకులను ఆకట్టుకోవడమే కాదు, ఆరోగ్యాన్ని కూడా ప్రసాదిస్తున్నాయి.

**క్షయకు మందుల్లేని రోజుల్లోనే..**

క్షయ వ్యాధికి మందులు లేని రోజుల్లోనే వికారాబాద్–అనంతగిరి కొండలపై కొన్ని నెలల పాటు నివసించి ఇక్కడి గాలి పీల్చుకుంటే చాలు క్షయ వ్యాధి తగ్గేదని చరిత్ర చెబుతోంది. ఇందుకు నిదర్శనంగా నాటి నిజాం నవాబు ఏర్పాటుచేసిన ఛాతీ ఆసుపత్రి నిలుస్తోంది.

**ఔషధ వనం ఏర్పాటు**

ఈ కొండలపై మానవాళికి ఉపయోగపడే ఎన్నో రకాల ఔషధ మొక్కలు సహజ సిద్ధంగా పెరుగుతున్నాయి. వీటి సంరక్షణ అటవీ అధికారులు చేపట్టారు. అనంతగిరికి వచ్చే దారిలో 1200 ఎకరాల్లో ఔషధ వనాన్ని నిర్మించారు.. సుమారు 30 రకాల ఔషధ మొక్కలను నాటారు.

**జాగ్రత్తగా రక్షిస్తున్నాం**

అనంతగిరి కొండలపై సహజ సిద్ధంగా ఉన్న ఔషధ మొక్కలకు తోడు అటవీ శాఖ నాటిన ఔషధ మొక్కలను కూడా రక్షిస్తున్నాం. వట్టిపోయిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నాటుతున్నాం. స్వదేశీ అభియాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం అనంతగిరి కొండలను అభివృద్ధికి ఎంపిక చేసింది. ఈ పనులను రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తోంది.

జ్ఞానేశ్వర్, జిల్లా అటవీ అధికారి, వికారాబాద్.

**ప్రయోజనాలు గమనించండి**

కానుగలో ఔషధ గుణాలు మెండుగా ఉన్నాయి. కానుగ గింజల నుంచి నూనెను తీస్తారు. కానుగ నూనె చర్మవ్యాధులకు తగ్గడానికి ఉపయోగపడుతుంది. కానుగ మొక్కలను నీడ కోసం రోడ్ల పక్కన పెంచుతున్నారు.

తిప్పతీగ రోడ్ల పక్కన ఎక్కడపడితే అక్కడ సులభంగా పెరిగి ఎగబాకుతుంది. ఇక్కడ బాగా పెరుగుతోంది. మధుమేహం, రక్తపోటుకు బాగా పనిచేస్తుంది. అల్లనేరెడు దీని ఆకులు, బెరుడు పండు కాలేయం పనితీరును క్రమబద్ధీకరిస్తుంది. మెదడు, గుండె చక్కగా పనిచేయడానికి ఉపకరిస్తుంది. మూత్రంలో మంటను తగ్గించటానికి పనిచేస్తుంది..

స్వదేశీ అభియాన్ కింద.. కేంద్రం ఎంపిక

అనంతగిరి కొండల విస్తీర్ణం.. 3,763 ఎకరాలు

వికారాబాద్ టౌన్‌కు దూరం.. 6. కి.మీ.

ఔషధ మొక్కల పెంపకం.. 1,200 ఎకరాలు

# మైదానాలిలా.. ఆటలెలా?



జగిత్యాల:కోరుట్ల పట్టణంలోని క్రీడా మైదానం ప్రహరీ కూలిపోవడంతో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ఆటలు ఆడుకునేందుకు క్రీడాకారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థినులు, యువతులు అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాల్సి వస్తోంది. కోరుట్ల స్టేడియంలో ఆటలు ఆడుకోవాలంటే జిల్లా క్రీడల అధికారి అనుమతి తీసుకోవాలని సూచించడంతో పలువురు క్రీడాకారులు అసహనానికి గురవుతున్నారు. ఇండోర్ స్టేడియం పూర్తయినప్పటికీ క్రీడా పరికరాలు లేవు.

ధర్మపురి పట్టణంలోని క్రీడా మైదానం అభివృద్ధికి గతంలో రూ.1.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాకపోవడంతో క్రీడా వసతులకు నోచుకోకుండా పోయింది.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం గల క్రీడాకారులను వెలికితీసేందుకు ఏటా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. సాధన చేసేందుకు అవసరమైన వసతుల కల్పనలో యువజన, క్రీడల శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మినీ క్రీడా ప్రాంగణాలతో పాటు మల్లాపూర్, ధర్మపురి, రాయికల్, ఇబ్రహీంపట్నంతో పాటు పలు మండలాల్లో మినీ క్రీడా ప్రాంగణాలకు స్థలం కేటాయించినప్పటికీ నిర్మాణాలు చేపట్టలేదు. లక్ష జనాభా దాటిన కోరుట్ల, జగిత్యాల, మెట్‌పల్లి పట్టణ ప్రాంతాల్లో క్రీడా మైదానాల్లో వసతులు అంతంత మాత్రంగానే ఉండటంతో యువత ముందుకు రావడంలేదు. క్రీడా మైదానంలో వసతులు కల్పించకపోవడంతో క్రీడాకారులకు తిప్పలు తప్పడంలేదు. ఆటలు ఆడుకోవడానికి సరైన క్రీడా పరికరాలు లేవు. మూత్రశాలలను అభివృద్ధి చేయాల్సి ఉంది. క్రీడా మైదానంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. క్రీడాకారులకు అవసరమైన మేరకు పరికరాలు అందుబాటులో లేవు. వేసవి దృష్ట్యా వసతులు కల్పించాల్సి ఉంది. మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, రాయికల్‌తో పాటు పలు మండలాల్లో మినీ స్టేడియాలకు స్థలాలను కేటాయించి ఎంపీ, జడ్పీ నిధులతో తాత్కాలికంగా ఏర్పాట్లు చేసినప్పటికీ వాటిల్లో క్రీడా వసతులు శూన్యం. ఆయా క్రీడా మైదానాలు ఇప్పటికీ యువజన, క్రీడల విభాగంలో చేరకపోవడం గమనార్హం.

వసతులు కల్పిస్తాం– రవికుమార్, జిల్లా క్రీడల అధికారి, జగిత్యాల

జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో క్రీడా మైదానాల్లో వసతుల కల్పనకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. అవసరమైన క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచుతాం. ఇండోర్ స్టేడియాల్లో సౌకర్యాల కల్పనకు కృషిచేస్తాం. కోరుట్ల మైదానంలో టోర్నమెంట్‌కు మాత్రమే అనుమతులు తీసుకోవాలని సూచించాం. నిత్యం ఆటలు ఆడుకునేందుకు ఎలాంటి అభ్యంతరం లేదు.

# వేసవి సెలవులు.. బోధనకు మెరుగులు

వెల్గటూరు: అభ్యసనా సామర్థ్యాల సాధనలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ సగటు కంటే వెనుకబడినట్లు వివిధ సర్వేల్లో వెల్లడయింది. ఫలితంగా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి.. తద్వారా విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యాల పెంపునకు వేసవి సెలవులు వేదిక కానున్నాయి. ఈ మేరకు ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటానికి రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. శిక్షణకు రిసోర్స్ పర్సన్లను ఎంపిక చేసి ఈ నెల 30 లోగా పూర్తి చేసి ఎస్‌సీఈఆర్టీకి జాబితా పంపించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లా విద్యాధికారుల నుంచి రిసోర్స్ పర్సన్ల ఎంపికకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

**సర్వే ఫలితాలతో దిద్దుబాటు**

ఎన్‌సీఈఆర్టీ, విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ అసైన్‌మెంట్ సెంటర్ నిర్వహించిన జాతీయ సాధన సర్వే(నాస్)–2021లో జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణ ఫలితాలు తక్కువగా ఉన్నాయి. పీజీఐ,



అసర్ నివేదికలు వివిధ స్థాయిలలో ముఖ్యమైన అభ్యసనా అంతరాలు చూపాయి. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల సామర్థ్యాల పెంపు ప్రాముఖ్యతను పీజీఐ స్పష్టం చేసింది. అసర్ నివేదికలో ప్రాథమిక స్థాయిలో పఠనం, గణిత నైపుణ్యాలలో పేలవమైన ఫలితాలు వచ్చాయి. దీంతో ఉపాధ్యాయుల్లో సాధికారత కల్పించటం, వినూత్న వ్యూహాలు, ప్రభావవంతమైన బోధనా పద్ధతులపై దృష్టి పెట్టేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థుల అభ్యసనా ప్రతిభలో అంతరాలు పరిష్కరించటంతో పాటు బోధన నాణ్యత పెంచడానికి ఇది దోహదపడనుంది.

**రిసోర్స్ పర్సన్ల ఎంపిక ఇలా**

రిసోర్స్ పర్సన్లను జిల్లా కలెక్టర్, డీఈవో, డైట్ అధ్యాపకులు తదితర అధికారులతో కలిసి ఇంటర్వ్యూ, డెమోల ఆధారంగా ఎంపిక చేయనున్నారు. ప్రతి మండలం నుంచి ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరు ఎస్జీటీల చొప్పున, జిల్లా పరిధిలో స్కూల్ అసిస్టెంట్లను రిసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేయాలి. ఈ నెలాఖరు వరకు వీరి నియామకం పూర్తి చేసి మే నెలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీరి ద్వారా మొత్తం ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తారు. ఎస్జీటీల నుంచి ప్రతి మండలానికి తెలుగు, పరిసరాల విజ్ఞానం(ఈవీఎస్), ఆంగ్లం, గణితంకు ఇద్దరి చొప్పున 8 మంది.

తెలుగు, ఈవీఎస్, గణితం, ఆంగ్లం, ప్రత్యేక విద్య(స్పెషల్ ఎడ్యుకేషన్)లకు ఇద్దరి చొప్పున 10 మంది డీఆర్పీలు.

ఉర్దూ మాధ్యమంలో ఉర్దూకు ఇద్దరు, గణితం, ఈవీఎస్‌లకు ఒక్కొక్కరి చొప్పున నలుగురు డీఆర్పీలు.

ఉన్నతస్థాయి: స్కూల్ అసిస్టెంట్ల నుంచి తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, భౌతిక–రసాయన, జీవ, సాంఘికశాస్త్రాలు, వ్యాయామ, ప్రత్యేక విద్యలకు నలుగురి చొప్పున 36 మంది డీఆర్పీలు.

ఉర్దూ మాధ్యమానికి ఉర్దూ, గణితం, భౌతిక, జీవ, సాంఘికశాస్త్రాల నుంచి ఇద్దరేసి చొప్పున 10 మంది డీఆర్పీలు.


ప్రధానోపాధ్యాయుల శిక్షణ: ప్రాథమిక స్థాయిలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు, ఉన్నత స్థాయిలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు నలుగురేసి చొప్పున డీఆర్పీలు.

# జాతీయ రహదారులు.. ప్రమాదాలకు నిలయాలు

జగిత్యాల : జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండగా ఇటీవల పోలీసు అధికారులు ప్రమాదాల బ్లాక్ స్పాట్లను గుర్తించారు. జిల్లాలో 46 బ్లాక్ స్పాట్లను గుర్తించిన పోలీసులు ఆర్మూర్–జగదల్‌పూర్, జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు నిర్ధారించారు. ఈ ఏడాది మూడు నెలల్లో 128 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా 47 మంది మృతి చెందారు. 123 మంది క్షతగాత్రులయ్యారు.

**రాత్రిపూట కనిపించేలా సోలార్ బోర్డులు**

జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ప్రమాదాల నివారణ కోసం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి చర్యలు చేపట్టారు. ఇటీవల డీజీపీ కార్యాలయం నుంచి 11 రకాల రోడ్డు భద్రతకు ఉపయోగించే బారికేడ్లు, సోలార్ హెచ్చరిక లైట్లు, మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పట్టుకునేలా



బ్రీత్ ఎనలైజర్ మిషన్లు, పోలీసులకు రక్షణ జాకెట్స్, ట్రాఫిక్ కోన్స్, ఇనుప బారికేడ్లతోపాటు పలు రకాల పరికరాలు జిల్లాకు తెప్పించారు. రాత్రిపూట సోలార్‌తో పని చేసే హెచ్చరిక బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై మల్యాల, కొండగట్టు ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేసి కేసులు నమోదు చేస్తున్నారు.

ఆర్మూర్–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై మెట్‌పల్లి సమీపంలో వట్టివాగు, గండి హన్మాండ్లు, ఆరపేట, కోరుట్ల వద్ద నంది చౌక్, మేడిపల్లి సమీపంలో పీఎన్ఆర్ గార్డెన్ సమీపంలో, జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి, చల్‌గల్, ఏఆర్‌గార్డెన్, రిలయన్స్ పెట్రోల్ బంక్, మంచినీళ్ల బావి, తిప్పన్నపేట, పొలాస, కల్లెడ, ధర్మపురి, రాయపట్నం సమీపంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుండగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై పూడూరు, కొండగట్టు, మల్యాల ఎక్స్‌రోడ్, రాజారం, ధరూర్, రెడ్డి ఫంక్షన్ హాల్ ప్రాంతాలను ప్రమాద బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు.


చురకలు



# మదింపు.. ఆదాయం పెంపు

శ్రీకాళహస్తి : పురపాలక సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు వీలుగా ప్రభుత్వం ఆస్తి పన్ను మదింపు చేయాలని నిర్ణయించింది. పట్టణాల్లో ఇబ్బడిముబ్బడిగా కట్టడాలు వెలుస్తున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగం నుంచి అనుమతులు పొందింది కొంత వరకైతే.. అనధికారంగా అంతకు మించి సాగుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ నగరపాలక, పురపాలక సంఘాల్లో భవన నిర్మాణాలకు అనుగుణంగా పన్నులు వసూలు అవుతున్నాయో లేదా అనే విషయమై ప్రభుత్వం పరిశీలనకు ఆదేశించింది. ఆ క్రమంలోనే ఆస్తి, కుళాయి, వాణిజ్య పన్నులను మరోసారి మదింపు చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పురపాలక సంఘాలకు ఆస్తి పన్ను రూపంలో వచ్చే ఆదాయాన్ని 20 శాతం పెంచుకునేలా ఈ మదింపు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇందుకు సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో భవన నిర్మాణ కొలతలు సేకరించి తదనుగుణంగా ఆస్తిపన్నులు నిర్ణయిస్తారు. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు ఉన్నవి, లేని వాటిని, అనుమతి కొంత, నిర్మాణం అధికంగా చేపట్టినవి, పాతగృహాల్లో మార్పులు,



అధునాతన వసతులతో మరమ్మతులు చేసుకున్న వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి కొలతలు తీస్తారు. ఇప్పటి వరకు పన్ను లేని వాటికి అసెస్‌మెంట్ సంఖ్యలు జారీ చేస్తారు. ప్రత్యేక బృందాలతో ఇంటింటా సర్వే చేసేందుకు యంత్రాంగం సమాయాత్తం అవుతోంది. ఆస్తి పన్ను ద్వారా తిరుపతి నగరపాలికతో పాటు పురపాలక సంఘాల ద్వారా ఏటా రూ.253.54 కోట్లు ఆదాయం వస్తోంది. ప్రభుత్వ సూచనల మేరకు 20 శాతం పెరిగితే దాదాపు రూ.49.57 కోట్లు అదనంగా సమకూరనుంది.

**కష్టాలకు చరమగీతం**

ఆదాయం పెంచి పురపాలికల కష్టాలకు స్వస్తి పలకాలనే దిశగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పలు చోట్ల విద్యుత్తు ఛార్జీల చెల్లింపులు, పొరుగు సేవకులు, ఒప్పంద ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు చెల్లింపు కష్టసాధ్యంగా మారుతోంది. ఆస్తిపన్ను మదింపు దృష్ట్యా పెరగనున్న ఆదాయంతో ఈ తరహా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంది.

# చెరువు కట్ట.. చేవ కటకట

నంద్యాల : చెరువు.. పల్లె జీవనాడి. ఊరంత ఉపాధి చూపు చెరువు చెమ్మగిల్లింది. ఐదేళ్ల అధికారంలో ఉన్న వైకాపా తటాకాల అభివృద్ధికి తూట్లు పొడిచింది. సాగు, తాగునీటికి ఆధారమైన జల వనరుల నిర్వహణకు నీళ్లొదిలింది. ముళ్లపొదలు పెరిగి కట్టలు కుంగాయి.. కాలువలు, తూములు రూపు కోల్పోయాయి. స్లూయిస్‌లు దెబ్బతిన్నాయి. సప్లయ్ ఛానళ్లు, షట్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 574 చెరువులకు 9,263.85 మిలియన్ ఘనపుట డుగుల (ఎంసీఎఫ్‌టీ) నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉంది. 81,098 ఎకరాలకు సాగు నీరు అందిచాల్సి ఉంది. చెరువులు చెడిపోవడంతో ఆయకట్టులో అరక సాగడం లేదు. చిన్నపాటి వరద వచ్చినా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధుల కింద బాగు చేయాలని నిర్ణయించింది.

**దృష్టిసారించిన 'కూటమి' ప్రభుత్వం**

చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు కేంద్రం రిపేర్స్, రెనోవేషన్, రెస్టోరేషన్ (ఆర్‌ఆర్‌ఆర్) పథకం కింద నిధులు



విడుదల చేస్తోంది. కర్నూలు జిల్లాలో 21 చెరువులకు రూ.31.06 కోట్లు, నంద్యాలలో 91 చెరువులకు రూ.169.62 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు రూపొందించారు. రాష్ట్రం నిధులు 40 శాతం ఖర్చు చేస్తే కేంద్రం నుంచి 60 శాతం విడుదల కానున్నాయి.

**వాటా ఇవ్వక వదిలేసిన వైకాపా**

వైకాపా హయాంలో రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడంతో చెరువుల అభివృద్ధి ఆగింది. జిల్లాలో ఎస్‌డీఎంఎఫ్ కింద 27 పనులకు నిధులు మంజూరు కాగా ఇందులో 11 పనులే పూర్తయ్యాయి.

జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లో 14 చెరువుల అభివృద్ధికి ముందుకొచ్చింది. రూ.7.20 కోట్లతో చేపట్టాల్సిన పనులు ఇప్పటికీ పూర్తికాలేదు.

ఆంధ్రప్రదేశ్ సమగ్ర సాగునీటి వ్యవసాయ పరివర్తన పథకం (ఏపీఐఐఏటీపీ) కింద 46 చెరువులను ఎంపిక చేశారు. రూ.66.91 కోట్లతో ఎంపిక చేసిన చెరువుల వద్ద 34 రకాల పనులు చేపట్టాలి. 29,644 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు అత్యంత కీలకమైన పనులు నత్తను తలపిస్తున్నాయి. 2020-21 ఏడాదిలో కురిసిన భారీ వర్షాలకు 39 చెరువులు చెదిరిపోయాయి. మరమ్మతులకు రూ.1.53 కోట్లు అవసరం అవుతాయని అధికారులు ప్రతిపాదించారు. నిధుల లేమితో పనులు మమ అనిపించారు. అమృత్ సరోవర్ కింద రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వెచ్చించి పనులు చేపట్టినట్లు నివేదికల్లో రాశారు. కేవలం మట్టి తవ్వి పొలాలకు తరలించి పైపై పనులు చేశారు. ఎమ్మిగనూరు మండలం గువ్వాలదొడ్డి సమీపంలోని చెరువుకు గండి పడినా ఇప్పటికీ పూడ్చలేదు. 70 మంది రైతుల వద్ద 115 ఎకరాలు సేకరించి 2009లో నిర్మించారు. ఇందుకు రూ.2.50 కోట్లు వెచ్చించారు. ఐదేళ్ల కిందట వచ్చిన వర్షాలకు గండి పడి నీరంతా వృథా అవుతోంది. పత్తికొండ ఊరి చెరువు 184.5 ఎకరాల్లో విస్తరించింది. నీటి నిల్వ సామర్థ్యం 48.40 ఎంసీ ఎఫ్‌టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్). 108 ఎకరాల ఆయకట్టు ఉంది. గత ఐదేళ్లు నిర్వహణ లేకపోవడంతో కట్టపై ముళ్ల పొదలు పెరిగి అడవిని తలపిస్తోంది. రివిట్‌మెంట్ కుంగిపోయింది. దేవనకొండ మండలం మాచాపురం, కరివేముల, నేలతలమర్రి గ్రామాల్లో పెద్ద చెరువులున్నాయి. వీటి కింద మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి నిర్వహణకు గత ఐదేళ్లలో పైసా ఖర్చు వెచ్చించలేదు. కట్టలు బలహీనంగా మారడంతో మూడు రోజుల కిందట కురిసిన వర్షాలకు గుడిమిరాళ్ల చెరువు గండిపడింది.

# ప్రతి మడికి నీటితడి



అనకాపల్లి : సాగునీటి రంగం గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. జలవనరుల నిర్వహణకు అయిదేళ్లలో ఒక్క రూపాయి కూడా నిధులివ్వలేదు. కూటమి సర్కారు కొలువుదీరిన ఏడాదిలోనే అత్యవసర పనులకు సొమ్ములిచ్చింది. భారీ ప్రాజెక్టులను పట్టాలెక్కించింది. తాజాగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జలాశయాల గేట్లు, వాటికింద కాలువలు, ఇతర ప్రధాన నీటి వనరుల నిర్వహణకు నిధులు ఇచ్చారు. వీటిని సకాలంలో పూర్తిచేస్తే చాలావరకు సాగునీటి సమస్యలు తీరిపోనున్నాయి. ఖరీఫ్ సీజన్ కొద్దిరోజుల్లో మొదలుకానుంది. పంటలు వేయడానికి ఇంకా సమయం ఉన్నందున ఆలోగా ఈ పనులు పూర్తిచేయడానికి అవకాశం ఉంది. మంజూరైన పనుల్లో రూ. 10 లక్షల లోపు అంచనా విలువున్న వాటిని కొత్తగా ఎన్నుకున్న సాగునీటి సంఘాలతో నామినేషన్ పద్ధతిలో చేయించాలి. అంతకన్నా ఎక్కువ విలువున్న వాటికి ఏడు రోజుల కాలపరిమితితో కూడిన షార్ట్ టెండర్లను పిలిచి కార్యరూపంలోకి తీసుకురావాలని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు సూచించారు. దీంతో నియోజకవర్గాల వారీగా మంజూరైన పనుల గురించి ఎమ్మెల్యేలకు వివరించి వాటిని ఏయే సాగునీటి సంఘాల సభ్యులతో చేయించాలో అనుమతులు తీసుకునే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. జిల్లాలో టెండర్లు పిలిచి చేయాల్సిన పనులు తక్కువగా ఉండటంతో సీజన్‌కు ముందుగానే సాగునీటి వనరులను చక్కబెట్టేయవచ్చు. ఉమ్మడి జిల్లాలో 174 పనుల నిమిత్తం రూ. 10.75 కోట్లు మంజూరు చేశారు. వీటితో సీజన్‌కు ముందే పనులను పూర్తిచేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వీటిని పురోగతిలోకి తీసుకురావడంలో జాప్యం జరుగుతోంది.

చేయాల్సిన పనుల్లో కొన్ని ఇలా..

అరకులోయలోని నందిగుడ చెరువు సప్లయ్ ఛానల్ మరమ్మతులు రూ. 10 లక్షలతో చేపట్టనున్నారు.

చింతపల్లి మండలం తాజంగి జలాశయం హెడ్ వర్క్స్, కాలువల ఆధునికీకరణకు రూ. 20 లక్షలు మంజూరు చేశారు.

బుచ్చెయ్యపేటలోని మంగళాపురం ఆనకట్ట, కస్పా ఛానల్ పనుల్ నిర్వహణకు రూ. 25 లక్షలు ఇచ్చారు.


చోడవరం మండలంలోని లక్కవరం ఛానల్‌లో రూ. 6 లక్షలతో పూడికతీత పనులు చేయనున్నారు.

తాండవ ప్రాజెక్టు కాలువల్లో ఇటు నాతవరం, అటు కాకినాడ జిల్లా పరిధిలో పూడికతీత, మరమ్మతులకు భారీగా నిధులిచ్చారు.

సాగునీటికి ఇబ్బంది లేకుండా..: జిల్లాలో నీటివనరుల నిర్వహణ పనులకు ప్రభుత్వం నిధులిచ్చింది. ఖరీఫ్ సీజన్‌కు ఈ పనులు ఎంతో ఉపయుక్తం కానున్నాయి. టెండర్లతో సంబంధం లేకుండా నీటి సంఘాలతో చేయాల్సినవే ఎక్కువ ఉండటంతో త్వరితగతిన మొదలు పెట్టడానికి అవకాశం ఉంది. ఈ ఏడాది సాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం.

త్రినాథం, ఈఈ, జలవనరులశాఖ

# ప్రజారోగ్యంతో చెలగాటమా?



పరవాడ : పరవాడ మండలం భరణికం మోల్లోడు గెడ్డవాగును ఫార్మా వ్యర్థ జలాలు మళ్లీ ముంచెత్తాయి. వీటి నుంచి ఘాటైన దుర్వాసన రావడంతో అటుగా వెళ్లే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నెల 18వ తేదీన వర్షం పడే అవకాశం ఉందని భావించి ఫార్మా సంస్థలు వదిలిన వ్యర్థ జలాలు గెడ్డవాగులోకి చేరాయి. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో పీసీబీ (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) అధికారులు నీటి నమూనాలు సేకరించి ప్రయోగశాలకు తీసుకెళ్లారు. ఫలితాల్లో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (సీవోడీ) 250 దాటితే చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు ఆ సమయంలో ప్రకటించారు. ఇదిలా ఉంటే ఈ నెల 21వ తేదీన భారీ వర్షం పడడంతో వ్యర్థ జలాలను మళ్లీ బయటకు వదిలేయడంతో గెడ్డవాగు కాలుష్య కాసారంగా తయారైంది.

**శాశ్వత పరిష్కారం చూపరూ..**

వర్షం పడిన ప్రతిసారీ ఈ సమస్య తెరపైకి వస్తోంది. రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి తలెత్తుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనూ గెడ్డవాగులోకి వ్యర్థ జలాలు భారీగా చేరగా యంత్రాంగం పరిశీలించి రసాయనాల శాతం అధికంగా ఉందని నిర్ధారించింది. దాంతో ఆయా జలాలను ట్యాంకర్లతో రాంకీ సీఈటీపీకి తరలించారు. ఈ సమస్య పునరావృతం కాకుండా కూటమి పాలకులు, అధికారులు గట్టి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**తరచూ తలెత్తుతున్న సమస్య**

ఫార్మాసిటీ నుంచి వర్షం నీరు తప్ప వ్యర్థ జలాలేవీ బయటకు రాకూడదు. ఇక్కడి వ్యర్థ జలాలను తొలుత రాంకీ సంస్థకు తరలించాలి. అక్కడ శుద్ధి జరిగిన తర్వాత పైపులైన్ ద్వారా తిక్కవానిపాలెం సాగర తీరంలోకి విడిచిపెట్టాలి. ఈ ప్రక్రియ వ్యయ ప్రయాసలతో కూడుకున్నది కావడంతో శుద్ధి చేయకుండానే ఇలా విడిచిపెట్టి ఆయా సంస్థలు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. ఈ సమస్య వల్ల గెడ్డవాగులు, చెరువులు, పంట భూములు విషతుల్యంగా మారుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ కారణంగా భూగర్భ జలాలు కూడా కలుషితమై తాగునీరు కూడా కొనుగోలు చేయాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

# చి'వరి'కి ఏమవుతుందో?



పుంగనూరు : అల్పపీడన ప్రభావంతో జిల్లా వరి రైతుల్లో ఆందోళన నెలకొంది. వరి పంట చేతికందే సమయంలో వర్షాలు కురిస్తే పంటలు మునిగిపోతాయని అన్నదాతల గుండెల్లో దడ మొదలైంది. అకాల వర్షం, అల్పపీడన ప్రభావంతో వారం రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. నైరుతి రుతుపవనాలు ఈనెల 26 నాటికి రాయలసీమ మీదుగా రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ విభాగం పేర్కొంది. ఈ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రబీలో వరి సాధారణ సాగు 10,530 కాగా.. ప్రస్తుతం 7,650 హెక్టార్లలో మాత్రమే సాగైంది. పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో బోరుబావుల ఆధారంతో వరి సాగు చేశారు. తడులు అవసరమైనప్పుడు కురవని వర్షం కోతల సమయంలో వద్దంటే పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత కోసిన ధాన్యం పొలాల్లోనే నిల్వ చేసి పట్టలు కప్పుతున్నారు.


**గంటన్నర నుంచి రెండు గంటలు:** పొలాల్లో తేమ ఆరకపోవడంతో ఎకరా పొలం నూర్పిడి చేయడానికి గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతోంది. టైర్ యంత్రానికి గతంలో గంటకు రూ.2,500 ఉండగా.. రూ.2,700బీ బెల్ట్ యంత్రానికి రూ.3,500 ఉండగా రూ.3,800 వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. తగ్గిన ధరలు: కోతలకు ముందు క్వింటా రూ.2900 పలికిన ధాన్యం.. ప్రస్తుతం రూ.1700కు కొనుగోలు చేస్తున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టడానికి, నిల్వ చేయడానికి వసతులు లేని రైతులు తక్కువ ధరకే విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గట్లు కొట్టాలి: వర్షపు నీరు పొలంలో ఉండకుండా గట్లు కొట్టాలి. వాతావరణ పరిస్థితులను గుర్తించి నూర్పిడి చేయాలి. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి. శివకుమార్, ఏడీఏ, పుంగనూరు

# కన్నేసి.. దర్జాగా కాజేసి

తనకల్లు :రూ.లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కాజేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదంతా తనకల్లు మండలంలోని బొంతలపల్లి పంచాయతీలో అన్నమయ్య జిల్లా ములకల చెరువు వద్ద తితిదే ఫంక్షన్ హాల్ పక్కన జరుగుతోంది. ములకలచెరువు వ్యాపారపరంగా దినదినాభివృద్ధి చెందడమే కాక 42వ నంబరు జాతీయ రహదారి కావడంతో భూములు అధిక ధరలు పలుకుతున్నాయి. దీంతో పక్కనే ఉన్న తనకల్లు మండలానికి చెందిన ప్రభుత్వ భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. స్థలాన్ని శుభ్రం చేసి ఒక్క రోజులోనే రేకులు వేసుకొని సొంతం చేసుకుంటున్నారు.

**కుంట జాగా రూ.15 లక్షలు**

తితిదే ఫంక్షన్ హాల్ పక్కన సర్వేనంబరు 183.ఎ లో దాదాపు ఎకరాకుపైగా ప్రభుత్వ భూమి ఉంది. ప్రస్తుతం కుంట జాగా రూ.15 లక్షలకుపైగా పలుకుతోంది. అంతేకాకుండా పీటీఎమ్ రోడ్డుకు




నాయనచెరువుపల్లి సత్రం వద్ద 228, 229 సర్వేనంబర్లలో సైతం అక్రమ నిర్మాణాలు చేపట్టారు. మోడల్ పాఠశాల వద్ద సర్వేనంబరు 9లో దాదాపు 42 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొంతకాలం కిందట ఓ వ్యక్తి ఎకరాకుపైగా ఆక్రమించి మామిడి మొక్కలు నాటారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. 183 సర్వేనంబర్‌లో పలు సబ్ లెటర్లలో ఉన్న రెండు ఎకరాలకుపైగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుక ఉన్న భూమిలో స్థానికులు అక్రమ నిర్మాణాలు చేపట్టి నివాసం ఉంటున్నారు. ప్రభుత్వ భూమిని గుర్తించి రక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విచారణ జరిపిస్తాం : వీవీఎస్ శర్మ, ఆర్డీఓ, కదిరి

ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం. భూమిని స్వాధీనం చేసుకొని బోర్డు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపడతాం.

# కార్డుదారుల సేవ'రణం'

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో మ్యాపింగ్ తప్పుల తడకగా చేయడం రేషన్‌కార్డు దారులకు తంటాలు తెచ్చిపెడుతోంది. రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు, తొలగింపులు తదితరాలకు సంబంధించి ఈనెల 7 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జనం గ్రామ, వార్డు సచివాలయాల ఎదుట వరుస కడుతున్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తే చిన్నచిన్న సవరణల కోసం వచ్చినవే 90 శాతానికిపైగా ఉన్నాయి. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, తప్పుల సవరణ, కొత్త కార్డులు, కార్డుల విభజన తదితర వాటికి 62,815 దరఖాస్తులొచ్చాయి. వాటిలో కొత్త కార్డులకు 3,929, కార్డుల్లో పేర్ల నమోదుకు 51,576 మంది అర్జీ పెట్టుకొన్నారు. గత ప్రభుత్వ హయాంలో భార్య, పిల్లలు ఒకచోట, భర్త పేరు వేరే ప్రాంతంలో మ్యాపింగ్ చేశారు. ఇప్పుడు వారు తమ పిల్లలను రైస్ కార్డులో చేర్చాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. దీనిని సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో నివాసం వద్ద ఎర్రర్ చూపిస్తోంది. భర్త పేరు లేకుండా భార్య, పిల్లలు విడిగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో మార్పులు,



చేర్పులు చేసే అవకాశం సచివాలయ సిబ్బందికి లేకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు.

రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, పేర్లు తొలగించాలన్నా.. వయస్సు సరిచేయాలన్నా కష్టంగా ఉంది. నిబంధనలు అడ్డుగా ఉండటం.. సర్వర్ సాంకేతిక సమస్య నేపథ్యంలో దరఖాస్తుదారులకు అవస్థలు తప్పడం లేదు.

**పేర్ల తొలగింపునకు ఇబ్బందులే**

రేషన్ కార్డులో పేర్లు తొలగించడం కష్టతరంగా మారింది. చనిపోయిన వ్యక్తులకు సంబంధించి మాత్రమే మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా తొలగింపునకు దరఖాస్తు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో తల్లిదండ్రులు ఆదాయ పన్ను చెల్లిస్తున్నారని.. తమ బంధువుల కార్డుల్లో చేర్పించారు. అయితే ఆ బంధువులు ఇప్పుడు ఆ పిల్లలను తొలగించేందుకు వెళ్తుంటే ఆప్షన్ లేదని చెబుతున్నారు. చనిపోయిన వారిని మాత్రమే తొలగించేందుకు ఆప్షన్ ఉందని చెబుతుండటంతో చేసేదేమీ లేక వెనుదిరుగుతున్నారు

**494 దరఖాస్తులు తిరస్కరణ**

జిల్లాలో ఈనెల 7వ తేదీ నుంచి ఇప్పటి వరకు 37,967 దరఖాస్తులు వచ్చాయి. అందులో నిర్ణీత వ్యవధిలో 672 దరఖాస్తులకు ఆమోదం లభించగా.. 494 దరఖాస్తులను తిరస్కరించారు. రేషన్ కార్డుల్లో పేర్ల నమోదు, తొలగింపు, చిరునామా మార్పు, ఆధార్ సీడింగ్ దిద్దుబాటు, కార్డుల సరెండర్‌కు సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా ఆమోదించలేదు.

# పరీక్షలు గగనమే

భీమవరం : అత్యవసరమైనప్పుడు ఆసుపత్రికి వెళ్తాం.. అలాంటప్పుడు చేయాల్సిన ల్యాబ్ పరీక్షలు అందుబాటులో లేకపోతే ఆ ఇబ్బంది చెప్పలేనిది. 'ఏడో నెల గర్భిణిని, వైద్య పరీక్షలకు వస్తే ల్యాబ్ పరీక్షలకు వేరొక చోటకు వెళ్లమన్నారు. అదేమైనా దగ్గరలో ఉందా అంటే మూడు నాలుగు కి.మీ. దూరంలో ఉంది. ఎలా వెళ్లాలి అంటూ భీమవరంలోని బలుసుమూడి పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ఓ గర్భిణి వాపోయారు. నరసాపురం, తాడేపల్లిగూడెంలోని కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో రోగులు వెనుదిరిగారు. జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ పరీక్షలు గురించి పరిశీలన సమయంలో స్థానికంగా ఉన్న ఇబ్బందులను రోగులు వెల్లడించారు.

**ఖాళీలు.. సెలవులు..** జిల్లాలోని పట్టణాల్లో 18 ఆరోగ్యకేంద్రాలున్నాయి. ప్రతి ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు, స్టాఫ్‌నర్సులు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫార్మసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్లు.. ఇలా మొత్తం 12 మంది ఉండాలి. పరిశీలన సమయంలో కొన్నిచోట్ల ల్యాబ్ టెక్నీషియన్లు లేరు. ఇప్పుడే బయటకు వెళ్లారంటూ అక్కడ ఉన్న సిబ్బంది సమాధానమిచ్చారు. కొన్నిచోట్ల వైద్యుల సేవలు కూడా అలాగే కనిపించాయి. తాడేపల్లిగూడెంలోని కడకట్లలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది.

నరసాపురం అరుంధతిపేటలోని పట్టణ ఆరోగ్యకేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ సెలవు పెట్టారు. వైద్యుడు వారంలో మూడు రోజులు ఇక్కడ, మిగిలిన రోజులు ఎన్టీఆర్ కాలనీలోని ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంటారు.



భీమవరం బలుసుమూడిలోని ఎన్టీఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి రోజూ 30 నుంచి 40 మంది రోగులు వస్తారు. వారిలో 90 శాతం మందికి రక్త, నీరుడు ఇతరత్రా పరీక్షలు అవసరం. ఇక్కడ ప్రస్తుతం ల్యాబ్ టెక్నీషియన్ ప్రసూతి సెలవులో ఉన్నారు. దాంతో పరీక్షలు ఇక్కడ చేయడం లేదు. పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రికి, దుర్గాపురంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తున్నారు.


**ఆ కొన్నే అందుబాటులో..** ఉదయం 11 గంటల తర్వాత సేవలు కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో లేవు. 60 రకాల ల్యాబ్ పరీక్షలు చేయాల్సి ఉంది. రెండు మూడు మాత్రమే చేస్తుంటారు. హైరిస్క్ ఉందంటూ కొన్నింటిని సమీపంలోని ప్రాంతీయ ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఎక్కువగా రక్తపోటు, చక్కెరవ్యాధి, జ్వరం, కండరాల నొప్పులు వంటివాటికి ఔషధాలు ఇచ్చి పంపిస్తున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో జి.గీతాభాయి మాట్లాడుతూ పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీ పోస్టుల వివరాలు తీసుకుని భర్తీ చేయడంతో పాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తానన్నారు.

# 25,331.60 ఎకరాలు హాంఫట్..!

ఒంగోలు : వైకాపా ప్రభుత్వ హయాంలో భూచోళ్లు చేపట్టిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఫ్రీహోల్డ్‌ను అడ్డం పెట్టుకొని సుమారు 25,331.60 ఎకరాలను అక్రమంగా నిషిద్ధ జాబితాలోంచి తప్పించారని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. 2003కు ముందు అసైన్ చేసిన భూములపై అనుభవదారులకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ నాటి వైకాపా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అదనుగా సర్కారు, పేదల భూములను వైకాపా నాయకులు దొడ్డి దారిన దక్కించుకున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రధానంగా కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ఈ తరహా అక్రమాలు జరిగాయని గుర్తించిన కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఒంగోలు, కనిగిరి, మార్కాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో అధికారులు భూ దస్త్రాలు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

**నిషేధిత జాబితాలోనివీ వదల్లేదు..**

జిల్లాలో మొత్తం 1.82 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేయగా.. అందులో ఇరవై నాలుగు అంశాల్లో 46,615.71 ఎకరాల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 16,905.97 ఎకరాలను పొరపాటున రెండుసార్లు ఫ్రీహోల్డ్ చేశారు. కోర్టు కేసులు ఉన్నవి, దేవాదాయ, అటవీ, పట్టా, పోరంబోకు, చుక్కలు, ఇనాం భూములు 4,378 ఎకరాలు ఉన్నాయి. ఇవి తీసివేయగా.. మిగిలిన 25,331.60 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా నిషిద్ధ జాబితా నుంచి తప్పించారని అధికారులు గుర్తించారు. బదిలీ చేయకుండా నిషిద్ధ జాబితాలో ఉన్నవి, అసైన్డ్ భూమి అని చెప్పడానికి ఆధారాలు, రెవెన్యూ దస్త్రాలు లేనివి, నిబంధనల ప్రకారం 20 ఏళ్ల అసైన్డ్ కాలం పూర్తికాని భూములనూ ఫ్రీహోల్డ్ చేసినట్లు తేల్చారు. మొదట ఏ ఒక్క ఆధారం ఉన్నా ఫ్రీహోల్డ్ చేయగా.. పునఃపరిశీలనలో మాత్రం రెవెన్యూ



దస్త్రాలను ప్రామాణికంగా తీసుకున్నారు. అలాంటి భూములు 15,584.08 ఎకరాలున్నాయని తేల్చారు.

**బాధ్యులపై నాన్చుడు ధోరణి ఎన్నాళ్లు..!**

మొత్తం ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో 16.32 శాతం తేడాలు ఉన్నట్లు దస్త్రాల పునఃపరిశీలనలో వెల్లడైంది. ఇప్పటి వరకు 666 రిజిస్ట్రేషన్లు నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు తేలింది. కనిగిరిలో ఎలాంటి అనుమతి లేకుండా అసైన్డ్ భూమిలో స్తంభాలు పాతారు. క్రయవిక్రయాల విషయంలో పెద్దఎత్తున నగదు లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వివిధ రకాల భూములను నిషిద్ధ జాబితాలోంచి తప్పించిన తహసీల్దారు, ఆర్ఐలు, వీర్వోలు, తదితర అధికారులు, అప్పుడు చక్రం తిప్పిన నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని అంతా భావించారు. ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, నాన్చుడు ధోరణి అవలంబిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**సీసీఎల్ఏ ఆదేశాల మేరకు చర్యలు**

దస్త్రాల పునఃపరిశీలనలో వెల్లడైన తేడాలు, ఎక్కడెక్కడ అక్రమాలు చోటుచేసుకున్నాయి.. బాధ్యులెవరో గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. సీసీఎల్ఏ నుంచి ఆదేశాలు వచ్చాక సంబంధిత తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్వోలపై చర్యలు తీసుకుంటాం. ఆర్.గోపాలకృష్ణ, జిల్లా సంయుక్త కలెక్టర్

# వనం వదిలి పొలాల్లోకి..



కదిరి : అడవుల్లో వన్యప్రాణుల స్వేచ్ఛాయుత వాతావరణానికి భంగం వాటిల్లింది. ఏటా వేసవిలో నిప్పు రాజుకుని పచ్చదనం హరించుకుపోతోంది. అడవి జంతువులకు మేత, నీళ్లు దొరకుండా పోతున్నాయి. దీనికితోడు వన్యప్రాణుల కోసం అటవీశాఖ చేపట్టే సంరక్షణ చర్యలు నామమాత్రంగా మారాయి. ఫలితంగా జింకలు, నెమళ్లు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఆకలి, దప్పులు తీర్చుకోవటానికి పచ్చని పంటలను మేస్తున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంటలను కాపాడుకోవటానికి రాత్రింబవళ్లు కాపలా కాయలేకున్నామని వాపోతున్నారు.

**నీళ్లు, మేత కరవై..**

అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు నీళ్లు, మేత కరవైంది. దీంతో మైదాన ప్రాంతాల వైపు జింకలు, నెమళ్లు వస్తున్నాయి. వంకలు, వాగులను ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి. సమీప ప్రాంతాల్లో పొలాల్లో మొలకెత్తున్న విత్తనాలను నెమళ్లు తింటున్నాయి. వేరుసెనగ, మొక్కజొన్న, కంది, సజ్జ, అలసంద పంట లేతగా ఉన్నప్పుడు జింకలు మేస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతదశ పంటలకు అడవి పందుల బెడద తప్పలేదని వాపోతున్నారు. అమడగూరు మండలం కంచనగారిపల్లి, హరిపురం, గంగిరెడ్డిపల్లి, తనకల్లు మండలంలోని యరగుంటపల్లి, సీజీ ప్రాజెక్టుకు ఎగువన ఉన్న గ్రామాల్లో జింకలు, నెమళ్లు మందలుగా చేరుతున్నాయి. తలుపుల, ఎన్పీకుంట, నల్లమాడ ప్రాంతాల్లో అడవి పందుల సమస్య అధికంగా ఉందంటున్నారు. పంటలు సాగు చేయాలంటేనే భయపడే పరిస్థితి ఎదురవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**అరకొర నిధులు.. కొరవడిన చర్యలు**

అడవికి నిప్పు రాజుకోకుండా, వన్యప్రాణులకు తాగునీటి సదుపాయం కల్పించాల్సిన బాధ్యత అటవీశాఖదే. ఆ దిశగా చర్యలు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. ఫలితంగా గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు, అడవి జంతులకు తాగునీటి తొట్టెల ఏర్పాటు అంతంత మాత్రంగా మారింది. గడిచిన ఏడాదిలో చైతన్య కార్యక్రమాలు, సంరక్షణ చర్యలకు కేటాయించిన నిధులు రూ.2.25 లక్షలే. అడవి జంతుల కారణంగా జరిగిన నష్టం అపారం. జిల్లా వ్యాప్తంగా బాధిత రైతులకు అందించిన పరిహారం రూ.వేలల్లోనని వాపోతున్నారు.

**తగిన చర్యలు చేపడుతున్నాం : చక్రపాణి, జిల్లా అటవీ అధికారి**

వన్యప్రాణుల సంరక్షణకు తగిన చర్యలు చేపడుతున్నాం. అడవుల్లోంచి బయటకు రాకుండా నీళ్లు ఇతర సదుపాయాలు కల్పిస్తున్నాం. అడవి జంతువులతో పంటలు, పశువులను నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తున్నాం. చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

# పంచాయతీల్లో క్లస్టర్ విధానానికి స్వస్తి





విశాఖ : పంచాయతీల్లో ప్రజలకు మెరుగైన పాలనను అందించడానికి కూటమి సర్కార్ పంచాయతీ ప్రక్షాళన దిశగా అడుగులు వేసింది. క్లస్టర్ విధానానికి స్వస్తి పలికి గ్రేడ్ విధానాలను అందుబాటులోకి తేనుంది. గతంలో ఒక క్లస్టర్‌లో రెండు, మూడు పంచాయతీలు ఉండేవి. జనాభా, వార్షిక ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని కొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. జిల్లాలోని 24 మండలాల పరిధిలో 646 పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం క్లస్టర్లలో మేజర్, మైనర్ పంచాయతీల వ్యవస్థ నడుస్తోంది. రెండు, మూడు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఒక కార్యదర్శిని నియమించి పాలన సాగించేవారు. ఇకపై జనాభా, ఆదాయం ఆధారంగా గ్రేడ్లుగా రూపకల్పన చేయనున్నారు. ప్రత్యేక గ్రేడ్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3లుగా వీటిని మార్చనున్నారు. దీంతో ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి అందుబాటులోకి రానున్నారు. మున్సిపాలిటీల తరహాలో నూతనంగా ప్రణాళిక విభాగం సైతం ఏర్పాటు చేసి ఆదాయ వనరులు పెంచనున్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక మోడల్ ఆదర్శ పంచాయతీని తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల ప్రజాప్రతినిధులతో ఆన్‌లైన్ సమీక్ష చేపట్టారు. ఈ మేరకు ఇందుకు సరిపోయే గ్రామాల వివరాలు సేకరిస్తున్నారు.

గ్రేడ్ విధానంలో సచివాలయ సిబ్బందిని అవసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేయనున్నారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

**గ్రేడ్ల విభజన ఇలా..**

ప్రత్యేక గ్రేడ్: దీనిలో పదివేల జనాభా లేదా ప్రభుత్వ గ్రాంట్లు కాకుండా రూ. కోటి ఆదాయం ఏదో ఒకటి ఉండాలి. డిప్యూటీ ఎంపీడీఓలను (ఈఓఆర్‌డీ) పంచాయతీ అధికారిగా నియమిస్తారు. వీటి పరిధిలో మేజర్ పంచాయతీలను తీసుకురానున్నారు.

గ్రేడ్-1: నాలుగు నుంచి పదివేల మధ్య జనాభా లేదా రూ. 50 లక్షల నుంచి రూ. కోటి ఆదాయం ఉండాలి. మండల కేంద్రాలుగా ఉండే పంచాయతీలను వీటి పరిధిలోకి తేనున్నారు.

గ్రేడ్-2: రెండువేల నుంచి 4 వేల మధ్య జనాభా ఉన్నవాటిని వీటి పరిధిలోకి తీసుకువస్తారు.

గ్రేడ్-3: రెండు వేల కన్నా తక్కువ జనాభా ఉండే గ్రామాలను ఈ గ్రేడ్-3 పరిధిలోకి రానున్నాయి.

మండలాలు: 24

పంచాయతీలు: 646

జనాభా: 14,94,947కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం: జిల్లాలో పంచాయతీల గ్రేడ్ల గుర్తింపు ప్రక్రియ జరుగుతుంది. జనాభా, ఆదాయ ప్రాతిపదికన విభజన జరుగుతుంది. అధికారులు క్షేత్రస్థాయిలో నివేదికలు తయారు చేస్తున్నారు. పూర్తి నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు అందించి గ్రేడ్ల విభజనపై ప్రకటిస్తాం. శిరీషారాణి, జిల్లా పంచాయతీ అధికారి

# సాగరగర్భం.. కృత్రిమ ఆవాసం!



విశాఖ : తీరంలో సముద్ర ఉత్పత్తుల దిగుబడులు పెంచి, మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ఏడాది సాధించిన దిగుబడుల కంటే కనీసం 30 శాతం అధికంగా ఉండేలా కొత్త పద్ధతుల్ని అమలు చేస్తుంది. అందులో భాగంగానే సాగర గర్భంలో కృత్రిమ ఆవాసాలు (ఆర్టిఫిషియల్ రీఫ్స్) ఏర్పాటు చేస్తుంది.

**'సీఎంఎఫ్ఆర్ఐ' పర్యవేక్షణ:** ఈ మాడ్యుల్స్‌ను కేరళ రాష్ట్ర తీర ప్రాంత అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ అభివృద్ధి చేసి, సరఫరా చేస్తుంది. ఆ సంస్థ ఆధ్వర్యంలోనే ఆవాసాల ఏర్పాటు ప్రక్రియ జరుగుతోంది. అయితే సాగర గర్భంలో మాడ్యుల్స్ ఏర్పాటు, సర్టిపై చేయడం వంటి సాంకేతిక అంశాలను సీఎంఎఫ్ఆర్ఐ (కేంద్రీయ సముద్ర మత్స్య పరిశోధన సంస్థ) పర్యవేక్షిస్తోంది.

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద జిల్లాకు 12 కృత్రిమ ఆవాస యూనిట్లు మంజూరయ్యాయి. వాటిల్లో పెద ఉప్పాడ-6, యారాడ-3, పెదజాలరిపేట- ఎండాడ మధ్యలో 3 చొప్పున సిద్ధం చేస్తున్నారు.

ఆవాసాలకు సంబంధించిన పరికరాలను బోట్ల సాయంతో సముద్రం లోపలకు తీసుకెళ్లి.. క్రేన్లు ఉపయోగించి 40 అడుగుల లోతులో వాటిని అమర్చుతున్నారు. ఒక్కో ఆవాసంలో 200 రీఫ్ మాడ్యుల్స్ ఉంచుతున్నారు. వాటిల్లో త్రికోణాకారం- 80, ఫ్లవర్ ఆకారం- 80, పైప్ ఆకారంలో- 40 చొప్పున ఉంటాయి(పైన చిత్రంలో ఉన్నట్లు). తీరానికి కిలోమీటర్ దూరంలో సముద్రపు అడుగు భాగంలో ఉండే ఇసుకతిన్నెలపై వాటిని ఏర్పాటు చేస్తున్నారు.

సముద్రంలో దశాబ్దాల నాటి సహజ సిద్ధమైన ఆవాసాలు దెబ్బతినడంతోనే కృత్రిమ ఆవాసాలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

పెద్ద చేపలు గుడ్లు పెట్టేందుకు, చిరు చేపల ఉత్పత్తికి ఇవి దోహదం చేస్తాయి. ఇప్పటికే కేరళ రాష్ట్రంలో సత్ఫలితాలు రావడంతో రాష్ట్రంలోనూ ఈ విధానాన్ని ఇక్కడి అధికారులు అమల్లోకి తీసుకొచ్చారు.

**ఉపాధికి ఊతం:** రాష్ట్ర వ్యాప్తంగా 184 ప్రాంతాల్లో మాడ్యుల్స్ ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం ప్రతిపాదించింది. వాటి ద్వారా సముద్ర ఉత్పత్తులు మెరుగు పడితే...లక్షల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఒక్కో యూనిట్

ద్వారా 4,300 మంది మత్స్యకారులకు చేపల వేటలో అధిక దిగుబడులు చేతికి వస్తాయని, జిల్లాలోని 12 ఆవాసాల ద్వారా 50 వేల మందికి ప్రయోజనం ఉంటుందని అధికారులు లెక్కలు కడుతున్నారు.

**నిరంతర ప్రక్రియ:** మత్స్య సంపద పెంపులో భాగంగా ఆవాసాల ఏర్పాటు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. వీటితో దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందొచ్చు. సుమారు 40 అడుగుల లోతులో ఉండడం ద్వారా ఆవాసాలు విచ్ఛిన్నమయ్యే అవకాశాలు ఉండవు. పి.లక్ష్మణరావు, జేడీ, మత్స్యశాఖ, విశాఖ జిల్లా

# రొయ్య ఉక్కిరి బిక్కిరి

గణపవరం : వేసవిలో ఆక్వా సాగు ఆశాజనకంగా ఉంటుందన్న గంపెడాశతో ఉమ్మడి జిల్లాలోని రైతులు ఉత్సాహంగా చేపట్టారు. నెల రోజులు అంతా సవ్యంగానే సాగింది. ఇంతలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, విపరీతమైన ఉక్కపోతతో ఆక్వారంగం తీవ్ర ఒత్తిడికి లోనవుతోంది. చెరువులో పిల్ల వేసిన 18 నుంచి 30 రోజుల వ్యవధి కలిగిన సాగుకు వైట్‌స్పాట్, విబ్రియో వంటి వ్యాధులు సోకి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. రాత్రి సమయంలో వర్షం పడుతూ, పగటి పూట ఎండ వేడికి చెరువులో పీహెచ్ హెచ్చుతగ్గుల కారణంగా రొయ్యలు ఒత్తిడికి గురవుతున్నాయి. పలు చెరువుల్లో ఆక్సిజన్ అందక రైతులు మందులు వెదజల్లేందుకు గట్ల వెంబడి ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య చేపడుతున్న సస్యరక్షణ చర్యలు ప్రతికూల వాతావరణం కారణంగా సత్ఫలితాలు



ఇవ్వకపోవడంతో రైతులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు.

వారం వ్యవధిలోనే.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాల్లో ఆక్వాసాగు జరుగుతుంటే వారం వ్యవధిలో సుమారు 25 శాతం చెరువులు వైరస్ బారిన పడ్డాయి. దీనికితోడు ఉన్న సరకుకు గిట్టుబాటు ధర లేక అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వైరస్ సోకిన చెరువులు అప్పటికప్పుడు పట్టుబడి చేయాల్సి ఉండటంతో ఇదే అదనుగా భావించిన వ్యాపారులు ఆ సరకును అయినకాడికి కొనుగోలు చేస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారు. గణపవరం ఎఫ్‌డీవో శివరామకృష్ణ మాట్లాడుతూ వాతావరణంలో నెలకొన్న మార్పులతో చెరువు దగ్గర లైమ్ తప్పనిసరిగా ఉంచుకుని పీహెచ్ స్థాయిని బట్టి వాటిని చల్లుకోవాలని సూచించారు. ఆక్సిజన్ స్థాయిని పెంచే మందులు అందుబాటులో ఉంచుకుని అవసరమైనప్పుడు వినియోగించాలని వెల్లడించారు.

# చాపకింద నీరులా..!

కనిగిరి : జిల్లాలో మూత్రపిండాల వ్యాధిగ్రస్థులు ఏటా పెరుగుతూనే ఉన్నారు. జీవన విధానంలో వచ్చిన మార్పులు, ఆహారపు అలవాట్లతో పాటు, ఫ్లోరైడ్ సమస్య కూడా ఒక కారణంగా నిలుస్తోంది. కనిగిరిలోని డయాలసిస్ కేంద్రంలో అయిదేళ్ల క్రితం 50 మంది రోగులు ఉంటే ప్రస్తుతం 122 మందికి చేరారు. సమస్య తీవ్రతరమయ్యే వరకు చాలామంది తెలుసుకోలేకపోవడంతో ప్రాణాల మీదకు వస్తోంది.

జిల్లాలోని ఒంగోలు నగరంతోపాటు, కనిగిరి, వై.పాలెం, గిద్దలూరు, మార్కాపురం ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కలిపి మొత్తం ఎనిమిది డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో రోజూ 623 మంది కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. దీంతోపాటు నెల్లూరు, గుంటూరు, కర్నూలు, కడప జిల్లాల్లోనూ మరో 300 మంది వరకు డయాలసిస్ చేయించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రెండేళ్ల క్రితం 500 మంది ఉన్న రోగుల సంఖ్య ఒక్కసారిగా 100కు పైగా పెరిగింది. చాలా మంది అవగాహన లోపంతో మూత్ర పిండాల వ్యాధికి గురవుతున్నారు. నొప్పులు తగ్గడానికి అధికంగా మాత్రలు వాడడం, రక్తపోటు, మధుమేహం వంటి వాటిని సకాలంలో గుర్తించక.. నియంత్రణలో ఉంచుకోలేక మరి కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఫ్లోరైడ్ తాగడం కూడా మరో ప్రధాన కారణం అవుతోంది.



**జాగ్రత్తలతోనే నివారణ**

మధుమేహం, అధిక రక్తపోటు కిడ్నీలు పాడవ్వడానికి ప్రధాన కారణం. వారసత్వ ఊబకాయం, ధూమపానం, వృద్ధాప్యం, నొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలకు మాత్రలు ఎక్కువగా ఉపయోగించడం వల్ల మూత్రపిండ సమస్యల బారిన పడుతున్నారు. కలుషితమైన, ఫ్లోరైడ్ నీళ్లు కూడా ఒక విధంగా కారణం అవుతున్నాయి. కిడ్నీలను కాపాడుకోవాలంటే వాటి పనితీరుపై అవగాహన పెంచుకోవాలి. ఎక్కువగా నీరు తీసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు అవసరం. ధూమ, మద్యపానానికి దూరంగా ఉండాలి. పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు.. అన్నీ ఉండేలా చూసుకోవాలి. ఉప్పు మితంగా వాడాలి. దీంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. డాక్టర్ అనిల్ కుమార్ జిల్లా ఫ్లోరోసిస్ నివారణ అధికారి

# వసతి గృహాల ముస్తాబు

ఒంగోలు : పాఠశాల, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే మంచి ఆహారంతోపాటు, మౌలిక వసతులు సమకూర్చాలి. వైకాపా ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించింది. కూటమి ప్రభుత్వం రాగానే సాంఘిక సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా జిల్లాలోని 38 సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల మరమ్మతులకు రూ. 11.80 కోట్లు, మరో ఎనిమిది నూతన భవనాల నిర్మాణానికి డీఎంఎఫ్, పీఎం అజయ్ కింద మరో రూ. 25.35 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా వసతి గృహాల మరమ్మతుల పనులు చివరి దశకు చేరుకోవడంతో రూపురేఖలు మారుతున్నాయి. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ సమయానికి హాస్టళ్లలో పనులు పూర్తయ్యేలా సాంఘిక సంక్షేమశాఖ అధికారులు ప్రణాళిక చేశారు. ఒంగోలు అంబేడ్కర్ భవన్ సమీపంలోని సాంఘిక సంక్షేమ (బాలికల) ఆనంద నిలయం వసతి గృహం శిథిలావస్థకు చేరింది. వ్యక్తిగత మరుగుదొడ్లు మరమ్మతులకు గురయ్యాయి. దాంతో ఆవరణ అంతా అధ్వానంగా మారింది. దీంతో ఈ భవనం మరమ్మతుల నిమిత్తం రూ. 50 లక్షలు కేటాయించగా, పనులు చివరి దశకు చేరుకున్నాయి. దాంతో భవనం, వసతుల కల్పనతో రూపురేఖలు మారాయి.

## వన్యప్రాణులకు.. సాంకేతిక భరోసా

తిరుపతి : అగ్ని ప్రమాదాలకు తోడు మండుతున్న ఎండలతో వన్యప్రాణులు ఆహారం, నీటి కోసం అలమటించాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అటవీశాఖ గతంలోకంటే మెరుగ్గా, సాంకేతికత తోడుగా దాహార్తిని తీర్చే కార్యాచరణ అమలు చేస్తోంది. శేషాచలం అడవుల్లో సహజంగా నీటి ఆధారిత ప్రదేశాలు ఎక్కువ. తలకోన నుంచి తిరుమల మీదుగా మామండూరు, బాలపల్లె వరకు జలపాతాలు, నీటిచెలమలు, కుంటలు, పాతబావులు అనేకం ఉన్నాయి. ప్రధానంగా ఎస్వీ నేషనల్ పార్కు, ఎస్వీ అభయారణ్యం, చామల పరిధిలోకి వచ్చే అటవీ ప్రాంతంలో ఎక్కువగా అడవులకు ఉత్తర భాగంలోనే ఈ నీటి ఆధారిత ప్రదేశాలు ఉన్నాయి.

**దక్షిణం వైపునే ప్రాణాపాయం**

తిరుమలకు, అవ్వాచారికోనకు దక్షిణ భాగంలో ఉండే అటవీ ప్రాంతంలో ఎలాంటి నీటి ఆధారాలు లేవు. వన్యప్రాణులు సమూహాలుగా అవి నిర్దేశించుకున్న ప్రదేశాల్లోనే జీవిస్తూ ఉత్తర ప్రాంతం వైపు వెళ్లకుండా సమీపంలోని జనావాసాల్లోకి వెళ్తూ వేటగాళ్లు, కుక్కల దాడుల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి.

దక్షిణంవైపున నీటి ఆధారంలేని ప్రదేశాలను అటవీశాఖ రెండు నెలలకు ముందుగానే నోటిఫై చేసింది. సీసీ కెమెరాలు, డ్రోన్ సాంకేతిక దన్నుతో ఎక్కడెక్కడ నీటి నిల్వలు ఉన్నాయి, ఎక్కడ వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయన్న సమాచారాన్ని అధికారులు సేకరించారు.



శేషాచలంతోపాటు శ్రీకాళహస్తి, ఏర్పేడు, వెంకటగిరి, వడమాలపేట, పుత్తూరు, భాకరాపేట, యర్రావారిపాలెం పరిధిలో నీటి ఆధారంలేని, వన్యప్రాణులు ఎక్కువగా సంచరించే 200 పైగా పాయింట్లను గుర్తించింది. అందుబాటులో ఉన్నవాటితోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన సాసర్ పిట్లలో అవసరాన్నిబట్టి వారానికి ఒకట్రెండుసార్లు నీటిని నింపే ఏర్పాట్లను అటవీశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

తిరుమల నుంచి మామండూరు వరకు 75 చోట్లకు పైగా నీటి లభ్యత ఉండేలా చూస్తున్నారు. పటిష్ఠంగా అమలు: వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు డీఎఫ్‌వో వివేక్ ఆనంద్ సారథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేశాం. సమస్యాత్మక అటవీ ప్రదేశాల్లో వారానికి ఒకట్రెండుసార్లు నీటిని నిల్వ చేస్తున్నాం. రాబోయే మూడు నెలలపాటు ఈ ఏర్పాట్లు జరుగుతాయి. సుదర్శన్‌రెడ్డి, అటవీక్షేత్రాధికారి, తిరుపతి రేంజి

## రూ.లక్షలు పోసి.. ఖాళీగా వదిలేసి

చిత్తూరు : రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం ఖాళీగా వదిలేయడంతో విలువైన ప్రజాధనం వృథాగా మారింది. 2016లో అప్పటి తెదేపా పాలనలో ఎంతో ఉన్నతాశయంతో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం ప్రాంగణంలోనే జీవ నియంత్రణ ప్రయోగశాల (బయోలాజిక్ కంట్రోల్ ల్యాబ్) భవనాన్ని రూ.25-30 లక్షలతో నిర్మించారు. ఇక్కడ ప్రయోగశాలకు అవసరమైన పరికరాలు అమర్చి జీవ నియంత్రణ ఎరువులు తయారుచేసి రాయితీపై రైతులకు అందజేయాలి. 2019లో అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వం ఈ ప్రయోగశాలను పట్టించుకోలేదు. **నెల్లూరు నుంచి దిగుమతి..**

జిల్లాకు ప్రస్తుతం నెల్లూరు, నంద్యాలలోని జీవ నియంత్రణ ప్రయోగశాలల నుంచి తెప్పించి రైతులకు అందజేస్తున్నారు. తద్వారా ప్రభుత్వానికి ఆర్థిక భారంతో పాటు రైతులకు సకాలంలో అందడం లేదు. తెగుళ్లు అరికట్టలేక పంట దిగుబడులు పడిపోయి రైతులు నష్టపోతున్నారు.

**జీవనియంత్రణ ఎరువుల తయారీ..**

పంటల సాగులో జీవ నియంత్రణ ఎరువులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. రైజోబియం, ట్రైటోడెర్మావిరిడి, పాస్ఫోబ్యాక్టీరియా, సుడోమోనాస్ వంటి జీవనియంత్రణ ఎరువులు భూమిలో ఉన్న ఎరువులు మొక్కకు అందేలా దోహదపడతాయి. ఈ ఎరువులు ఇక్కడ తయారుచేసి రైతులకు రాయితీపై అందజేయాలి. వీటి వినియోగంతో వేరుకుళ్లు సహా పలు రకాల తెగుళ్లు నివారించవచ్చు.

**వృథాగా పరికరాలు..**జీవన ఎరువుల తయారీకి ఉపయోగించే యంత్రాలు, పరికరాలు భవనంలో వృథాగా పడి ఉన్నాయి. రూ.లక్షల విలువ చేసే ఈ యంత్రాలు కొన్ని నెలలు అలానే పడేస్తే పనికిరాకుండా పోయే పరిస్థితులు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులే పేర్కొంటున్నారు. **మరికొన్నింటికి ప్రతిపాదనలు..** -నాగపద్మిని, ఇన్‌ఛార్జి డీడీ, జిల్లా వనరుల కేంద్రం, చిత్తూరు ప్రయోగశాలను అందుబాటులోకి తేవాలంటే మరికొన్ని పరికరాలు కావాలి. వీటి సరఫరాకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అవి రాగానే అమర్చి ప్రయోగశాలను ప్రారంభిస్తాం.

## విద్యార్థులు ఫుల్.. ఫలితాలు నిల్

చిత్తూరు : పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో చివరి నుంచి మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఫలితాలపై చర్చించాల్సిన అధికారులు పట్టించుకోలేదు కారణం ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో నిమగ్నమవడమే. జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత ఏడు పాఠశాలలు సాధించగా.. సున్నా ఉత్తీర్ణత పాఠశాలలు లేవు.. పైగా ఒకరిద్దరు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఒకరిద్దరు ఉత్తీర్ణత.. ముళకలుత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాల (గంగాధరనెల్లూరు)లో 25 మంది పరీక్ష రాయగా ఒకరు పాసయ్యారు. తంబుగానిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల (బంగారుపాళ్యం)లో పదిమందికి ఒకరు, కొల్లాగుంట సీఎస్ఐ ఉన్నత పాఠశాల (కార్వేటినగరం)లో 29 మందికి నలుగురు ఉత్తీర్ణులయ్యారు. నక్కనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల(వి.కోట)లో ఏడుగురికి ఒకరు, కొల్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాల(శాంతిపురం)లో ఏడుగురికి ఒకరు, నరసింహరాజుపురం జడ్పీ ఉన్నత పాఠశాల (ఎస్ఆర్‌పురం)లో 20 మందికి ముగ్గురు, ఎస్ఆర్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 92 మందికి 15 మంది, రామకుప్పం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 25 మందికి ఐదుగురు ఉత్తీర్ణత సాధించారు. వందశాతం ఉత్తీర్ణత పాఠశాలలు ఇలా.. పూతలపట్టు మండలంలో ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ పాఠశాలలోని 75మందీ ఉత్తీర్ణులయ్యారు. అదే మండలంలో గొడుగుచింత జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడుగురు, సదుం మండలం పాలమంద జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిది మంది, జ్యోతిబా ఫులే రెసిడెన్షియల్ పాఠశాలలో 77మంది, యాదమరి మండలంలో 14కండ్రిగ జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో 13మంది, గుడిపాల మండలం ఏఎల్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 30మంది, బైరెడ్డిపల్లె మండలం ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో 82మంది ఉత్తీర్ణత సాధించారు. ఎస్ఆర్‌పురంలో మరీ తక్కువ. ఎస్ఆర్‌పురం మండలంలో 321 మందికి.. 115 మంది ఉత్తీర్ణులై 35.83 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. రామకుప్పంలో 679 మందికి.. 338 మంది ఉత్తీర్ణతతో 49.78 శాతం, గుడుపల్లెలో 576మందికి.. 312మంది ఉత్తీర్ణతతో 54.17శాతం సాధించింది. గుడిపాల మండలంలో 273 మంది పరీక్ష రాయగా 261మంది ఉత్తీర్ణతతో 95.60శాతం సాధించింది. తర్వాత స్థానంలో పూతలపట్టు మండలంలో 447మందికిగాను 384మంది ఉత్తీర్ణతతో 85.91శాతం, సదుం మండలంలో 245మందికిగాను 210మంది ఉత్తీర్ణతతో 85.71శాతం, పాలసముద్రం మండలంలో 182మందికిగాను 149మంది ఉత్తీర్ణతతో 81.87శాతం సాధించింది.

## ప్రతి లెక్క.. ఇకపై పక్కా!



పాడేరు : జానకీరామపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి రసీదులు లేకుండానే నగదు పుస్తకంలో రూ. 81 వేల ఖర్చులు రాసేశారు. నిబంధనలకు విరుద్ధంగా భవిష్యనిధి సొమ్ము రూ. 8.72 లక్షలు వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్నారు. బినామీ రుణాల పేరుతో భారీగా అక్రమాలకు పాల్పడ్డారు.

చెట్టుపల్లి సహకార సంఘం సీఈఓ రూ. 60.62 లక్షల సంఘం నిధులను దుర్వినియోగం చేసినట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. పాలకవర్గం అనుమతి లేకుండా, నాబార్డు నిబంధనలకు వ్యతిరేకంగా తమ జీతభత్యాల పేరుతో మళ్లించేసుకున్నారన్నది ప్రధాన అభియోగం. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పీఏసీఎస్) కంప్యూటరీకరణ చేశారు. బ్యాంకులు మాదిరిగానే పీఏసీఎస్‌ల్లో లావాదేవీలన్నీ ఈ నెల నుంచి ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. దీనివల్ల గతంలోలా అక్రమాలకు పాల్పడటానికి అవకాశం ఉండదు. నిన్నమొన్నటి వరకు సొసైటీల్లో వ్యవహారాలన్నీ సాధారణ పద్ధతుల్లో జరిగేవి. చేతి రాతలతో రికార్డులను తారుమారు చేసేవారు. వాయిదాలు చెల్లించకుండా సర్దుబాటు చేయడం, బినామీల పేరిట రుణాలు బుక్కేశారు. ఈ సంఘాలను నేతలు తమ సొంత అవసరాల కోసం నష్టాల్లోకి నెట్టేసేవారు. ఏళ్ల తరబడి సాగుతున్న ఈ చేతివాటానికి ఇన్నాళ్లకు చెక్ పెట్టగలిగారు. ఉమ్మడి జిల్లాలో 98 సహకార సంఘాలకు గాను ప్రస్తుతం 96 సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చారు.

**రెండేళ్లుగా కంప్యూటరీకరణ**

సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ ప్రక్రియను 2023 నుంచి మొదలుపెట్టారు. సంఘం ఏర్పడినప్పటి నుంచి గతేడాది మార్చి 31 వరకు జరిగిన లావాదేవీలన్నీ డేటా క్యాప్చర్ టూల్ (డీసీటీ) అనే సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్ చేశారు. పాత రికార్డులన్నీ అందుబాటులో లేకపోవడం, సిబ్బంది అవగాహన లేమి వల్ల కంప్యూటరీకరణ నత్తనడకన సాగుతూ వచ్చింది. కేంద్రం నుంచి ఒత్తిడి పెరగడం, అధికారులు తరచూ సమీక్షలు పెట్టి లక్ష్యాలను విధించడంతో ఎట్టకేలకు గత నెలాఖరు నాటికి పూర్తి చేయగలిగారు. అనకాపల్లి కేంద్రంగా ఉన్న గౌరీ సంఘం, మునగపాక సహకార సంఘాల్లో లావాదేవీలు ఎక్కువగా ఉండటంతో వాటిలో ఇంకా ఆన్‌లైన్ సేవలను మొదలుపెట్టలేకపోయారు. మిగతా అన్నిచోట్లా బ్యాంకింగ్ తరహా సేవలను అందిస్తున్నారు.

పారదర్శకతకు అవకాశం: సహకార సంఘాలను ఆన్‌లైన్ చేయడం వల్ల అక్కడ జరిగే లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుంది. అక్రమాలు జరగడానికి ఆస్కారం ఉండదు. ప్రతి వ్యవహారం జిల్లా కేంద్రం నుంచే పర్యవేక్షించడానికి వీలుంటుంది. రుణాలతోపాటు రికవరీ శాతం పెరిగి సంఘాలు లాభాలబాట పట్టడానికి అవకాశం ఉంది.

డీవీఎస్ వర్మ, సీఈఓ, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, విశాఖపట్నం

## ప్రకృతి వైద్యానికి పునరుజ్జీవం



నర్సీపట్నం : ప్రాచీన ప్రకృతి వైద్యం జనానికి మరింత చేరువవుతోంది. దీని పునరుజ్జీవానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆయుష్ ఆసుపత్రుల ద్వారా ఆయుర్వేద వైద్య సేవలను ఇప్పటికే జనానికి అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు ఇందులోనే భాగమైన ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయగలిగే 'పంచకర్మ' వైద్య విధానాన్ని ప్రజల ముంగిటకు తీసుకువస్తోంది. జిల్లాలో వీటి విభాగాలకు మూడింటికి కొత్తగా అనుమతి మంజూరు కావడం విశేషం.

ప్రకృతి వైద్యం పట్ల క్రమేపీ జనం మొగ్గుచూపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంప్రదాయ వైద్య విధానానికి అన్నివిధాలా ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయి. జిల్లాలోని ఒక్క కొరుప్రోలులోని స్పెషాలిటీ వెల్‌నెస్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూసీ) లో మాత్రమే పంచకర్మ వైద్య చికిత్స విభాగం కొనసాగుతోంది. తాజాగా నర్సీపట్నం, అనకాపల్లి, కన్నూరుపాలెంలోనూ వీటి ఏర్పాటుకు వీలుగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలోని ఆయుష్ ఆరోగ్య మందిరాల్లో (ఏఏఎం) అన్ని వసతులతో అనుకూలంగా ఉన్న వాటిని గుర్తించి వాటి స్థాయిని పెంచుతుంటారు. ఈ మేరకు కొత్తగా మూడు కేంద్రాలకు అవకాశం లభించింది. త్వరలోనే వీటన్నింటిలో పూర్తిస్థాయి ప్రకృతిసిద్ధమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

పంచకర్మను అయిదు కర్మలతో చేపట్టే చికిత్సగా పేర్కొంటారు. వమన, విరేచన, హస్తినస్య, రక్తమోచన అనే అయిదు రకాల చికిత్సలతో వ్యాధులను నయం చేస్తుంటారు. వీటిద్వారా దీర్ఘకాల వ్యాధులైన కీళ్లు, నడుము, తల నొప్పులు, బొల్లివ్యాధి, సొరియాసిస్, సైనసైటిస్, సయాటికా తదితర వాటికి తక్కువ సమయంలోనే ఎంతో ఉపశమనం లభిస్తుందంటున్నారు.

మౌలిక వసతులు సమకూరుతాయి- ఝాన్సీలక్ష్మీబాయ్, ఆయుష్ ఆర్‌డీడీ

కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించడంతో పంచకర్మ విభాగాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. నర్సీపట్నంలో ప్రారంభమైన ఆయుష్ ఆసుపత్రికి ఈ విభాగం సైతం మంజూరు కావడం విశేషం. జిల్లాలో ఎంపిక చేసిన ఈ మూడింటిని త్వరలోనే ఎస్‌డబ్ల్యూసీలుగా అభివృద్ధి చేసి పంచకర్మ చికిత్సను అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటికి తగిన సిబ్బంది ఇతర మౌలిక వసతులు సైతం సమకూరుతాయి.

## ఉపాధికి ఊతం.. పల్లె ప్రగతికి సమాహారం



తిరుపతి : ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో సామాజిక ఆస్తుల సృష్టి, కూలీల వేతనాల చెల్లింపునకు వైకాపా ప్రభుత్వం పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉపాధిహామీ పథకాన్ని గరిష్ఠంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఒకేసారి అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించారు. ఇందుకు తగ్గట్టుగానే పనులు గుర్తించి ఆగమేఘాలపై పూర్తి చేయించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి చిత్తూరులో భారీస్థాయిలో ఖర్చుపెట్టి పథకం ఉద్దేశాన్ని నెరవేర్చారు.

పాడి రైతులకూ మేలు చేయాలనిజగన్ ముఖ్యమంత్రి అయ్యాక పాడి రైతులకు ఎంతో మేలుచేసే గోకులం షెడ్లను అటకెక్కించారు. అంతకుముందు నిర్మించిన వాటికి బిల్లులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టారు. కూటమి కొలువుదీరిన తర్వాత గతేడాది జులై ఒకటిన గోకులం పథకాన్ని పునరుద్ధరించింది. 90 శాతం రాయితీపై చిత్తూరు జిల్లాలో తొలుత 1,500 షెడ్లు మంజూరు చేయగా డిమాండ్ నేపథ్యంలో అనంగా 827 మంజూరు చేశారు. ఈ ఒక్క పథకానికే రూ.50 కోట్లు ఖర్చు చేశారు. తిరుపతి జిల్లాలో 1,048 షెడ్లకు రూ.24 కోట్లు వెచ్చించారు. సీసీ రహదారులు, డ్రెయిన్లు, తదితర పనులకు రెండు జిల్లాల్లో రూ.140 కోట్లు వెచ్చించారు.

రూ.72 కోట్లకుపైగానే ఖర్చుచేసి: వైకాపా హయాంలో చిత్తూరు జిల్లాలో 2023- 24లో మెటీరియల్ కాంపోనెంట్, కూలీల వేతనాల చెల్లింపులకు కలిపి రూ.299.47 కోట్లు ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం 2023- 24లో రూ.371.85 కోట్లు వెచ్చించింది. తిరుపతి జిల్లాలో రూ.349.6 కోట్లు గతంలో వినియోగించుకోగా 2024-25లో ఇది ఏకంగా రూ.443.39 కోట్లకు పెరిగింది. అంటే తిరుపతిలో రూ.93.79 కోట్లు ఎక్కువగా ఖర్చు చేశారు. చిత్తూరు జిల్లాలో ఇది రూ.72.38 కోట్లుగా ఉంది. రెండు జిల్లాల్లో కలిపి రూ.72 కోట్లకుపైగానే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టారు.

అంతకుమించి చేయాలని: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తిరుపతి జిల్లాలో ఉపాధిహామీ పథకంలో రూ.500 కోట్లు, చిత్తూరు జిల్లాలో రూ.400 కోట్లు వెచ్చించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గోకులాలపాటు జలసంరక్షణకు ఈ నిధులు ఖర్చు చేయనున్నారు.

సామాజిక ఆస్తుల సృష్టే లక్ష్యం: కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం మేరకు సామాజిక ఆస్తులు సృష్టించాలనే లక్ష్యంతో నిధులు ఎక్కువగా వినియోగించుకుంటున్నాం. ఇదే సమయంలో పేదలకు ఉపాధి కల్పిస్తున్నాం. ఈ ఏడాది రూ.500 కోట్ల లక్ష్యాన్ని చేరుకురాం. వెంకటేశ్వర్, తిరుపతి కలెక్టర్

## అప్రమత్తతతో సురక్షిత ప్రయాణం

చిత్తూరు : రహదారి ప్రమాదాల నివారణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లు గుర్తించి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది. జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ మేరకు గుర్తించిన 25 బ్లాక్ స్పాట్లలో ప్రమాదాల నివారణపై దిశానిర్దేశం చేశారు. **ప్రమాదాలకు కారణాలు..**ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్ ధరించక పోవడం, సీట్ బెల్టు పెట్టుకోక పోవడం, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం.చేపట్టే చర్యలు.. వేగ నిరోధకాలు, రంబుల్ స్టిక్, సోలార్ లైటింగ్, సైన్ బోర్డుల్ని ఏర్పాటుచేయనున్నారు. హైవేల వద్ద రోడ్డు దాటేందుకు ఏర్పాటుచేసిన అక్రమ క్రాసింగ్ మూసివేయనున్నారు.

**జరుగుతోంది ఇలా..** 2024లో 458 వాహన ప్రమాదాలు జరగ్గా 510 మంది గాయపడ్డారు. 228 మంది మృతిచెందారు. వీరిలో ద్విచక్ర వాహనదారులు 128 మంది మరణించారు. ః 2025 మార్చి వరకు 116 ప్రమాదాలు జరగ్గా 51 మంది మరణించారు. 153 మంది గాయపడ్డారు.

**బ్లాక్ స్పాట్లు ఇవే..**

ఎన్‌హెచ్ 69 (చెన్నై-బెంగళూరు) : చీలాపల్లి క్రాస్, గంగాసాగరం, యాదమరి కూడలి, వరిగపల్లి జంక్షన్, కేజీసత్రం, మొగిలి ఘాట్, దొరచెరువు, జగమర్ల క్రాస్, దండపల్లి జంక్షన్, పొన్నమాకులపల్లి క్రాస్, ఆలకుప్పం. ఎన్‌హెచ్-40: కర్నూలు-చిత్తూరు రహదారిలో మురకంబట్టు కూడలి. ఎన్‌హెచ్ 140: చిత్తూరు-తిరుపతి ఆరు వరసల హైవేలో తెల్లగుండ్లపల్లి క్రాస్, పి.కొత్తకోట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద. ఎన్‌హెచ్ 716: పుత్తూరు-ఊత్తుకోట రోడ్డులో హెచ్‌పీ పెట్రోల్ బంక్, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా, కన్నంమిట్ట ప్రాంతం.నియమాల్ని పాటించి ప్రాణాల్ని కాపాడుకోవాలి.. రహదారి భద్రతా నియమాల్ని పాటించి, ప్రజలు తమ విలువైన ప్రాణాల్ని కాపాడుకోవాలి. ట్రాఫిక్ నియమాల్ని ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. సుమిత్‌కుమార్, కలెక్టర్

## ధరలో 'మాధుర్యమేదీ'?

నూజివీడు : మధుర ఫల రాజుగా పేరొందిన మామిడికి గిట్టుబాటు ధరపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని తోటల్లో ముందుగానే మామిడి కోతకొస్తోంది. రాత్రిళ్లు చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పూతను నిలబెట్టుకునేందుకు రూ.లక్షల విలువైన మందులు పిచికారీ చేస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది దిగుబడులు తగ్గాయంటున్నారు. వ్యాపారులు సిండికేట్ అయి ధరలను తగ్గించడం రైతులకు ఆందోళన కలిగిస్తోంది. క్షేత్ర స్థాయిలో ఉద్యాన అధికారులు, మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఇస్తున్న సలహాలు రైతులకు ఉపయోగపడటం లేదు.

**మార్కెటింగ్ సౌకర్యం లేనట్లే**

మామిడికి మార్కెటింగ్ సౌకర్యం కోసం నున్న మార్కెట్టును నూజివీడుకు తరలిస్తామని మంత్రి పార్థసారథి ప్రకటించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు చేసి ఉద్యానశాఖ కమిషనరేట్‌కు పంపారు.



**నాణ్యత ఉంటేనే ...**

నాణ్యత అధికంగా ఉంటేనే వ్యాపారులు ధర పెంచుతున్నారు. లేదంటే వారు చెప్పిన ధరకు కాయలు మార్కెట్‌లో వదిలి రావాల్సిందే. నూజివీడు రసాలు టన్ను రూ.10 వేల నుంచి రూ.12 వేలు, బంగినపల్లి రూ.30 వేల నుంచి 50 వేలు, తోతాపురి రూ.10 వేల నుంచి రూ.12 వేలు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. ఇది ఏమాత్రం గిట్టుబాటు కాదని నూజివీడు రైతులు పేర్కొన్నారు. తేనె మంచు పురుగు, పిండినల్లి, పండు ఈగ, రకరకాల తెగుళ్లు బారిన పడి నష్టపోతున్నామని చెప్పారు. సూచనలు కోసం రైతులు నేరుగా సంప్రదించవచ్చని ఉద్యానాధికారిణి ఆర్.హేమ తెలిపారు. కాయ రక్షణకు వినియోగిస్తున్న కవర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లా పరిధిలో 75,564 ఎకరాల్లో మామిడి సాగవుతోంది.

ఈ ఏడాది సాగర్ జలాలు కనుచూపు మేరలో కనిపించకపోవడంతో రైతుల అవస్థలు వర్ణనాతీతం. బోరు బావులు, ట్యాంకర్లలో నీటిని తీసుకుని వెళ్లి చెట్టుకు ఉన్న కొద్దిపాటి కాయలను రక్షించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు.

## అక్రమ తవ్వకం.. అవినీతి పెంపకం

నంద్యాల : చేపల చెరువులు వెల్లువలా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతుల్లేకుండానే వ్యవసాయ భూముల్లో ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారు. సమీపంలోని సాగునీటి కాల్వల నుంచి గుట్టుగా నీటిని తరలిస్తున్నారు.. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ తీసుకొని చౌర్యానికి పాల్పడుతున్నారు. కుళ్లిన మాంసం వ్యర్థాలను చేపలకు ఆహారంగా ఉపయోగించి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఈ దందా రోజురోజుకు పెరిగిపోతున్నా.. మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

**వీరికి అనుమతులు అక్కర్లేదు**

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా మండలం తంగడంచెలో 10 ఎకరాల వ్యవసాయ పొలంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఆధ్వర్యంలో అక్రమ చేపల చెరువు సాగవుతోంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలంలో ఎలాంటి అనుమతి లేకుండానే రెండు చోట్ల చేపలు పెంచుతున్నారు.మంత్రాలయం మండలం రాంపురం, కగల్లు, శాతనూరు తదితర గ్రామాల్లో 10 అక్రమ చెరువులు ఉన్నాయి. కోసిగి మండలంలో మరో 10 చోట్ల అనుమతుల్లేకుండానే చెరువులు తవ్వి చేపలు పెంచుతున్నారు. ఒక్కోటి 10 నుంచి 30 ఎకరాల విస్తీర్ణంలో తవ్విన వీటికి తుంగభద్ర నది నీటిని ఉపయోగిస్తున్నా అడిగేవారు లేరు.

**గడిగరేవుల.. ఆగడాలు చాలా**

గడివేముల మండలం గడిగరేవుల గ్రామంలో 30కి పైగా అక్రమ చేపల చెరువులు ఉన్నాయి. ఇక్కడ రైతులు గోరుకల్లు జలాశయం నిర్మాణానికి అవసరమైన మట్టి కోసం భూములను లీజు పద్ధతిలో అప్పగించారు. ఈ భూముల్లో పెద్దఎత్తున మట్టి తవ్వకాలు జరిగాయి. ఒక్కో రైతు 3 నుంచి 10 ఎకరాల వరకు మట్టి తవ్వకాల కోసం తమ భూములను ఇచ్చారు. కోస్తా ప్రాంతానికి చెందిన వ్యాపారులు ఈ భూములను లీజుకు తీసుకుని చేపల చెరువులుగా మార్చారు. ఇక్కడ కొన్ని చెరువులకు కుందూనది నుంచి నీటిని అక్రమంగా తోడుకుంటున్నారు. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లను వ్యాపార అవసరాలకు ఉపయోగిస్తూ ప్రభుత్వానికి మోసం చేస్తున్నారు.

**మట్టి దోచి.. చెరువుగా మార్చి**

నంద్యాల మండలం అయ్యలూరుమెట్టలో రెండు ప్రాంతాల్లో అనుమతి లేని చేపల చెరువులు ఉన్నాయి. ఇక్కడ గతంలో ఇటుకల బట్టీల కోసం వ్యవసాయ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టారు. దీంతో పొలాల్లో గుంతలు పడ్డాయి. వ్యవసాయానికి పనికిరాకుండా పోయిన ఆయా భూముల యజమానులతో ఒప్పందం చేసుకుని వ్యాపారులు చేపల చెరువులుగా మార్చేశారు. కొన్నేళ్లుగా చేపల పెంపకం సాగిస్తున్నారు. జిల్లా కేంద్రం చెంతనే అక్రమాలు సాగుతున్నా మత్స్యశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు.

**కోళ్ల వ్యర్థాలే దాణా**

సాధారణంగా చేపలకు నాచు, ఉడికించిన మొక్కజొన్న, తవుడు లాంటి దాణాను ఆహారంగా ఇస్తుంటారు. కానీ క్యాట్ ఫిష్, ఫంగస్, తెల్లరకం చేపలు జంతు కళేబరాలు, కోళ్ల వ్యర్థాలు తింటాయి. మంచినీటిలో పెరిగే చేప నెలకు అర కిలో నుంచి కిలో వరకు పెరిగితే చికెన్ వ్యర్థాలు తినే చేపలు రెండు నుంచి ఐదు కిలోల వరకు పెరుగుతాయి. అంతేకాకుండా చేపల దాణాతో పోల్చితే చికెన్ వ్యర్థాలు తక్కువ ధరకు లభిస్తాయి. ఆయా చెరువుల్లో పెరిగిన చేపలను హైదరాబాద్, బెంగళూరు, కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్నారు. గడిగరేవుల, అయ్యలూరుమెట్ట ప్రాంతాల్లో అక్రమంగా చేపల చెరువులు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. **ఎకరానికి రూ.వెయ్యి చొప్పున చెల్లించాలి**

ప్రస్తుతం నంద్యాలలో 700 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 300 ఎకరాల వరకు అక్రమ చేపల చెరువులు ఉన్నట్లు అంచనా. చేపల చెరువు సాగుకు అధికారికంగా అనుమతి తీసుకోవాలి. ఇందుకు ఎకరాకు రూ.వెయ్యి వరకు మత్స్యశాఖకు రుసుము చెల్లించాలి.

మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. వారి ఆమోదం తర్వాత చెరువు నిర్మాణానికి తవ్వకాలు చేపట్టాలి. విస్తీర్ణాన్ని బట్టి రెవెన్యూ, భూగర్భజలశాఖ, జలవనరుల శాఖ అధికారులు కొలతలు వేస్తారు. ఆమేరకే తవ్వాలి. ఆ తర్వాత కాలుష్య నియంత్రణ మండలి ఎన్‌వోసీ జారీ చేస్తుంది. వాణిజ్య విభాగం కింద విద్యుత్తు కనెక్షన్ తీసుకోవాలి.

# మృత్యు కుంట

అనంతపురం : ఎద్దులకు నీళ్లు తాపించేందుకు వెళ్లి కుంటలో మునిగి ఇద్దరు పదోతరగతి విద్యార్థులతోపాటు ఒక ఎద్దు మృతిచెందింది. ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు పరీక్షల్లో ఉత్తీర్ణత చెందగా.. మరొకరు ఒక సబ్జెక్టు తప్పారు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం చంద్రగిరిలో జరిగిన ఈ ఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. గ్రామస్థుల కథనం మేరకు.. పోతప్ప కుమారుడు వంశీ(15), కుళ్లాయప్ప కుమారుడు గోవిందరాజు(16) ఎద్దులను కడిగి, నీటిని తాపించేందుకు బండిని తోలుకుని గురువారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని హెచ్చెల్సీ కాలువ గట్టు పక్కన ఉన్న కుంట వద్దకు వెళ్లారు. బండి కుంటలోకి దిగగానే ఎద్దులు అదిరి ముందుకు లాక్కెళ్లాయి. గుంత లోతుగా ఉండటంతో విద్యార్థులు మునిగిపోయి గల్లంతయ్యారు. ఒక ఎద్దు తప్పించుకొని గట్టుకురాగా మరో ఎద్దు మునిగిపోయింది. సమీపంలోనే జీవాలను మేపుతున్న కొందరు గమనించి



గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుంట వద్దకు చేరుకొని గాలింపు చేపట్టారు. ఇద్దరు విద్యార్థులతోపాటు ఎద్దును బయటకు తీయగా అప్పటికే మృతిచెందారు. కుంటను ఎస్సై నబీరసూల్, పోలీసులు పరిశీలించారు. ప్రమాదం జరిగిన కుంట కర్ణాటక రాష్ట్రం ఎత్తినబూదేహాళ్ గ్రామ పొలిమేరలో ఉన్నందున బళ్లారి గ్రామీణ పోలీసులకు సమాచారం ఇచ్చామని ఎస్సై తెలిపారు.

**ఆరుగురిని మింగిన కుంట**

కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో హెచ్చెల్సీ పక్కనే ఉన్న ఈ కుంట బొమ్మనహాళ్ మండలంలోని చంద్రగిరి, కురువల్లి గ్రామాలకు చెందిన ఆరుగురిని పొట్టన పెట్టుకుంది. గతంలో హెచ్చెల్సీ కాలువ మరమ్మతుల కోసం పొక్లెయిన్‌లతో మట్టిని తవ్వడంతో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. కాలువకు నీరు వదిలినప్పుడు ఈ గుంతల్లోకి నీటిని విడుదల చేయించుకుని వేసవిలో మూగజీవాల దాహార్తి తీరుస్తున్నారు.

**పరీక్ష ఫలితాలు వెలువడిన 24 గంటల్లోనే..**

శివ పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత చెందగా, గోవిందరాజులు ఒక సబ్జెక్టు తప్పాడు. ఫలితాలు వచ్చిన 24 గంటలు కాకముందే ఇద్దరిని కుంట పొట్టన బెట్టుకుందని కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు కన్నీరు మున్నీరయ్యారు. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. పిల్లలను బాగా చదివించి ఉన్నత శిఖరాలకు చేర్చాలని కలలు కన్నామని, పదోతరగతికే ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారని తల్లిదండ్రులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

# నగర దారుల్లో విద్యుత్తు బస్సులు

విశాఖపట్నం: నగర రోడ్లపై విద్యుత్తు బస్సులు పరుగులు తీయనున్నాయి. విశాఖలో రెండు దశల్లో దాదాపు వంద బస్సులు నడిపేలా ప్రణాళిక చేస్తున్నారు. మొత్తంగా జిల్లా అంతటా 200 బస్సులు నడపాలని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో తొలుత గాజువాక, సింహాచలంలో 50 బస్సులు చొప్పున నిర్వహించేలా డిపోలను సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటికే అందుకు అనుమతులొచ్చాయి. సింహాచలం డిపో పరిధిలోని సింహపురి కాలనీ వద్ద ఆర్టీసీకి అయిదెకరాల వరకు స్థలం ఉంది. ఈ ఖాళీ స్థలాన్ని డిపో నిర్వహణ, విద్యుత్తు బస్సుల మరమ్మతులు, గ్యారేజీ నిర్వహణ, సిబ్బందికి శిక్షణ, బ్యాటరీ ఛార్జింగు పాయింట్లు ఉంటాయి.



70 కి.మీ పరిధిలో: నగరంలో 70 కిలోమీటర్ల పరిధిలో ఒక రోజులో సగటున 6.86 లక్షల మంది ప్రయాణిస్తారు. విజయవాడలో ఈ సంఖ్య 5 లక్షల లోపే. దీంతో రాష్ట్రంలో ఎక్కువ బస్సుల అవసరం విశాఖ నగరానికే ఉంది. ఇక్కడి అధికారులు 200 బస్సులకు ప్రతిపాదించగా త్వరలోనే రానున్నాయి. నగర పరిధిలోని ఆరు డిపోల పరిధిలో మూడింటిలో విద్యుత్తు బస్సుల కోసం స్థలం కేటాయించనున్నారు. గాజువాక, సింహాచలం డిపోల తరువాత మధురవాడలో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే డ్రైవర్లు, మెకానిక్‌లలో కొందర్ని ఆ బస్సుల కోసం సిద్ధం చేస్తున్నారు. నగర అవసరాలకు తగ్గట్టు ఏ బస్సులు అవసరం, ఇక్కడి రహదారులపై సరిగా నడుస్తాయా? ఎన్ని కిలోమీటర్లు తిరగాలి? ఎన్ని బస్సులు అవసరమనే అంశాలపై ఇప్పటికే పరిశీలన పూర్తయింది.

త్వరలోనే..: నగరానికి త్వరలో మొదటి విడతగా 50 రానున్నాయి. బహుళ వాహనాల వినియోగంతో కాలుష్యం పెరిగిపోతుంది. మహానగరాల్లో ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉంది. ఇటువంటి నగరాలకు విద్యుత్తు బస్సుల వినియోగం మంచి ఫలితాలు ఇస్తుంది. ఇప్పటికే దేశంలోని పలు నగరాల్లో ఈ రకమైనవి నడుస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో మంచి ఫలితాలే ఇస్తున్నాయి. కొద్ది రోజుల్లో నగర రోడ్లపై ఈ బస్సులు తిరగనున్నాయి. వీలైనన్ని ఎక్కువ బస్సులు విశాఖకు వచ్చే అవకాశం ఉంది.

అప్పలనాయుడు, జిల్లా ప్రజారవాణాధికారి

## నిర్మాణాలు సరే.. నీరు ఏదీ?

కదిరి : ఎండలు మండుతున్న తరుణంలో మూగజీవాల దాహం తీర్చడానికి ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు అడుగంటిపోతున్నాయి. పాడి పశువులను మేతకు బయటకు తీసుకెళితే నీటి సమస్య తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మూగజీవాల దాహార్తి తీర్చేలా ఉపాధి హామీ పథకం కింద తొట్టెలు నిర్మాణం చేపట్టింది. జిల్లాకు 1362 మంజూరు అయ్యాయి. ఒక్కోదానికి రూ.30 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారు. నీటి లభ్యత లేకుంటే అదనంగా 15 మీటర్లు పైపులైన్‌కు రూ.2,300 వ్యయం చేసేలా చర్యలు చేపట్టారు. పంచాయతీకి రెండు నుంచి మూడు చొప్పున మంజూరు చేశారు. ఇదిలా ఉండగా గతంలో 874 నిర్మించారు. వాటిలో కనీసం 30 శాతం కూడా వినియోగంలో లేవు. కొన్నిచోట్ల మట్టితో నిండిపోయాయి. నీటి సౌకర్యం లేకపోవడం, ప్రణాళికాబద్ధంగా నిర్మించకపోవడంతో ప్రజాధనానికి సార్థకత లేకుండాపోయింది. మరి కొన్ని చోట్ల కూర్చోనేందుకు మట్టితో నింపేశారు. పాడిపశువులు, జీవాలకు అవసరమైన నీటిని సక్రమంగా అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

నీటి లభ్యత ఉన్న ప్రాంతంలోనే నిర్మిస్తున్నాం విజయప్రసాద్, డ్వామా పీడీ

అన్ని పంచాయతీల్లో నీటి లభ్యత ఉన్న ప్రాంతంలోనే నిర్మాణాలు చేపడుతున్నాం. పైపులైన్ ఏర్పాటుకు అదనంగా నిధులు ఇస్తున్నాం. అవసరమైతే పాతవాటిని వినియోగంలోకి తీసుకొస్తాం.

# కాలిపోతే కష్టాలే!



అనంతపురం : విద్యుత్తు శాఖలో కొన్ని నిబంధనలు కాగితాలకే పరిమితమవుతుండటంతో రైతులు, వినియోగదారులు వ్యయప్రయాస తప్పడం లేదు. విద్యుత్తుశాఖ ఏర్పాటు చేసిన నియంత్రికలు మరమ్మతుకు(కాలిపోతే)గురైతే వాటిని ఆ శాఖ వాహనాల్లో తరలించాల్సి ఉంది. ఎక్కడైనా మరమ్మతుకు గురైందని సమాచారం అందిన వెంటనే అక్కడి అధికారులు డిక్లేర్ చేయాల్సి ఉంటుంది. అనంతరం పనిచేసే నియంత్రికను విద్యుత్తు శాఖ వాహనంలో(గుత్తేదారు ద్వారా) తీసుకెళ్లి మార్చాలి. దాన్ని మరమ్మతు కేంద్రానికి తరలించాలి. క్షేత్రస్థాయిలో సిబ్బంది మాత్రం ఇందుకు భిన్నంగా చేస్తున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. మార్చకుండానే మరమ్మతు కేంద్రానికి తీసుకువచ్చి.. ఇక్కడ రిపేరు చేశాక తిరిగి ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు రైతులు, వినియోగదారులే అద్దెకు వాహనాలను తీసుకుని తరలిస్తున్నారు. రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు అద్దె చెల్లిస్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

**నమోదులో మతలబు**

వినియోగదారులు ప్రైవేటు వాహనాల్లో తీసుకొస్తున్నా... వాటిని గుత్తేదారులు ఏర్పాటు చేసిన వాహనాల్లో తరలించినట్లు వివరాలు నమోదు చేస్తున్నారు. దీంతో వారికి నెలకు ఒక్కో వాహనం 2 వేల కిలోమీటర్లు తిరిగితే రూ.50 వేలు అద్దెగా చెల్లిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 విద్యుత్తు మరమ్మతు కేంద్రాలు పని చేస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో వాహనాల్లోకి ఎత్తడానికి, దించడానికి అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

**1912కు సమాచారం ఇవ్వాలిశేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్తుశాఖ**

నియంత్రిక మరమ్మతులకు గురైన వెంటనే స్థానికులు, రైతులు వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1912కి సమాచారం ఇవ్వాలి. దీంతో ఉన్నతస్థాయిలో పర్యవేక్షణ ఉంటుంది. శాఖ కేటాయించిన వాహనాల్లోనే తరలించాలి. నియంత్రికలను వాహనాల్లోకి ఎత్తి...దించడానికి డబ్బు వసూలు చేయకూడదు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం.

# పశువుల సంత జోరుగా.. వసూళ్ల దందా గుట్టుగా



అనంతపురం : అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రతి ఆదివారం పశువుల సంత జోరుగా సాగుతుంది. ప్రతివారం 1500-2000 వరకు పశువులకు సంతకు తీసుకొస్తున్నారు. కనీసం అందులో సగం పశువులు వ్యాపారులే కొని కబేళాలకు తరలిస్తారు. అందుకు బెంగళూరు, కేరళ, తమిళనాడు, హైదరాబాద్‌కు తరలించేందుకు ఎక్కువ మొగ్గు చూపుతారు. కొన్నేళ్ల నుంచి యార్డులో కొందరు పార్టీ పేర్లు చెప్పుకుంటూ వసూళ్ల దందా కొనసాగిస్తున్నారు. గతంలో వైకాపా పేరు చెప్పుకుని భారీగా వసూళ్లు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెదేపా పేరు చెప్పి వసూళ్లకు పాల్పడుతున్నారు. పార్టీ పేరు చెప్పి. వ్యాపారులను, లారీ యజమానులను బెదిరిస్తున్నారు. లారీకి రూ.5 వేలు చొప్పున వసూళ్లు చేస్తున్నారు. యార్డులో సొమ్ము ఇవ్వకపోతే లారీలను వెంబడించి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. విషయం బయటకు పొక్కకుండా అంతా గోప్యంగా దందా కొనసాగుతుంది. యార్డు బయట పరిమితికి మించి పశువులను లారీల్లో తరలిస్తున్నారు.

**ఏడాదికి రూ.72 లక్షలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో పాడి పశువులు, ఎద్దులను రైతులు కొనుగోలు చేస్తున్నారు. బక్కచిక్కిన పశువులన్నీ వ్యాపారులు కొంటుంటారు. ప్రతి వారం కనీసం 700-1000 పశువులు వ్యాపారులే కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఒక్కోవారం కనీసమంటే 50-60 చిన్న, పెద్ద లారీల్లో తరలిస్తారు. అందులో 30 పెద్ద లారీలు ఉంటాయి. ఒక్కో లారీకి రూ.5 వేల చొప్పున యార్డులోనే అక్రమ వసూలు చేస్తున్నారు. ప్రతివారం రూ.1.50 లక్షలు లెక్కవేసుకున్నా.. నెలలో ఈ సొమ్ము రూ.6 లక్షల దాకా అవుతుంది. అంటే ఏడాదికి రూ.72 లక్షలన్నమాట..

**మా దృష్టికి రాలేదు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఇన్‌ఛార్జి కార్యదర్శిగా కొనసాగుతున్నా.. 7 నెలల కిత్రమే ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకున్నా. పశువులకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నాం. అనంతపురం నగర కార్పొరేషన్ సిబ్బంది ఒక్కో వాహనానికి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. దానికి రశీదులు ఇస్తున్నాం. యార్డులో అక్రమ వసూళ్లు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. బయట వ్యక్తులెవరూ ఒక్క పైసా వసూలు చేయడానికి లేదు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. గోవిందు, ఎంపిక శ్రేణి కార్యదర్శి (ఏఎంసీ)

# కేజీహెచ్ వైద్యులకు శ్రీముఖాలు

కదిరి : కింగ్ జార్జి ఆసుపత్రి ఓపీ, క్యాజువాల్టీ విభాగాల్లో విధులకు గైర్హాజరైన 12 మంది వైద్యులు, ఓ టెక్నీషియన్, మరో స్టాఫ్‌నర్స్‌కు శ్రీముఖాలు జారీ చేశారు. రెండు రోజుల వ్యవధిలో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశించారు. వివరణ ఆధారంగా తదుపరి చర్యలు ఉండనున్నాయి. ఈనెల 18న జిల్లా ఇంఛార్జి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, 21న అదనపు డీఎంఈ వెంకటేష్ కేజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ సందర్భంగా ఓపీ విభాగాలు, వార్డులు, క్యాజువాల్టీలో విధుల్లో లేని వారికి నోటీసులు జారీ చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ, నెఫ్రాలజీ విభాగాల ఓపీల్లో మంత్రి తనిఖీలు చేయగా... రెండు చోట్లా ప్రొఫెసర్లు, సహ, సహాయ ప్రొఫెసర్లు అందుబాటులో లేరు. కేవలం పీజీలు మాత్రమే ఓపీ విధుల్లో ఉన్నారు. దీంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసి, షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను ఆదేశించారు.

మంత్రి ఆదేశాలతో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్ఆర్ఎస్.గిరినాథ్, సహ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, సహాయ ప్రొఫెసర్లు డాక్టర్ వంశీయాదవ్, డాక్టర్ మోహన్‌వంశీ, నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ జి.ప్రసాద్, సహాయ ప్రొఫెసర్లు డాక్టర్ రత్నప్రభ, డాక్టర్ వై.ఎస్. అనితకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద నోటీసులు జారీ చేశారు. ఎస్ఎన్ఐసీ నిర్వహణకు సంబంధించి పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తికి నోటీసు ఇచ్చారు.

అదనపు డీఎంఈ డాక్టర్ వెంకటేష్ చేపట్టిన తనిఖీల్లో భాగంగా ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వీఎస్ఎన్.మూర్తి, సహ ప్రొఫెసర్




డాక్టర్ కె.నర్సింగరావు, సహాయ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కిరణ్‌కుమార్, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జేఎస్‌కేవీ.చక్రవర్తి, ఎనస్తీషియా టెక్నీషియన్ సీహెచ్.అమర్‌బాబు, హెడ్ నర్సు కె.సుజాతకు నోటీసులు అందజేశారు.

**వైద్యవర్గాల్లో కలకలం :** మంత్రి, అదనపు డీఎంఈ తనిఖీల నేపథ్యంలో ఒకేసారి 14 మందికి నోటీసులు జారీ చేయడంతో ఆసుపత్రి వైద్యవర్గాల్లో కలకలం రేగింది. నిత్యం ఓపీల్లో సీనియర్ వైద్యులైన ప్రొఫెసర్లు, సహ, సహాయ ప్రొఫెసర్లు అందుబాటులో ఉండకుండా, సొంత క్లీనిక్‌లు, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మంత్రి, అదనపు డీఎంఈ తనిఖీల్లో ఇదే విషయం బహిర్గతమైంది. ఇకపై అన్ని ఓపీల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలనపై నిఘా ఉండనుంది. దీంతో వైద్యుల్లో ఆందోళన మొదలైంది.

# రెక్కల కష్టం.. అమ్మినా నష్టం

అనకాపల్లి : అనకాపల్లి ఆవఖండంలో అర ఎకరా భూమిని కౌలుకు తీసుకొని టమాటా సాగు చేపట్టా! 25 కేజీల బరువు కలిగిన క్రేట్ టమాటా ధర పంట భూమి వద్దకు వచ్చి కొనుగోలు చేస్తే రూ. 100 ఇస్తున్నారు. ఆడ కూలీ రోజుకు 4 క్రేట్ల సరకు కోస్తున్నారు. కూలగా రూ. 400 ఇస్తున్నాం. వ్యాపారి ఇచ్చిన డబ్బు కోత కూలికి సరిపోతుంది. మార్కెట్‌కు తీసుకువెళ్లి అమ్మితే క్రేట్‌కు రూ. 150 ఇస్తున్నారు. దీనిలో ఆటోకు రూ. 40 పోతుంది. పది క్రేట్లలో తీసుకువెళ్తే ఆటో, కోత కూలి పోనూ రూ.100 మిగులుంది. అందుకే పంటను కోయకుండా భూమిలోనే విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నా.

..అనకాపల్లికి చెందిన రైతు పొలిమేర నాగేశ్వరరావు ఆవేదన ఇదీ. జిల్లాలో ప్రస్తుతం టమాటా సాగుదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లాలో ఏటా 1,200 ఎకరాల్లో ఈ పంట సాగు చేస్తున్నారు. ఒక్క అనకాపల్లి ఆవఖండంలోనే 250 ఎకరాల్లో వేస్తున్నారు. ప్రస్తుతం పంట చివరి దశకు వచ్చింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కాయలపై మచ్చలు వచ్చాయి. ప్రస్తుతం మదనపల్లి నుంచి సరకు వస్తోంది. అక్కడ నుంచి వచ్చే కాయలు చూడటానికి బాగుంటాయి. దీంతో వ్యాపారులు జిల్లాలో పండిన సరకుకు తక్కువ ధరకు అడుగుతున్నారని రైతులు రాంబాబు, బచ్చిరాము ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమాటా పంట వేసిన రైతులు ఈ ఏడాది ఆది నుంచి



నష్టాలు చవిచూస్తున్నారు. వరి కోతల అనంతరం దీనిని సాగు చేస్తుంటారు. గత నెలలో ఒకేసారి పంట కోతకు రావడం ధరలు పడిపోయాయి. అప్పుడు కూడా ఇదే పరిస్థితి. వాస్తవానికి కొత్త అమావాస్య తర్వాత ధరలు బాగుంటాయని, ఈసారి కేవలం కొద్ది రోజులే ధరలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. క్రేట్ టమాటా ధర రూ. 250 నుంచి 300 వరకు అమ్మకాలు చేశామన్నారు. వర్షాల కారణంగా ప్రస్తుతం పంట దెబ్బతిందని వాపోతున్నారు. ఎకరాకు రూ. 30 వేలు పెట్టుబడులు పెట్టి, మొత్తం నష్టపోయామన్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

## కొల్లేరు కమ్మేస్తూ.. మత్స్యకారులను కుంగదీస్తూ..

మండవల్లి : కొల్లేరులో ఎంతో గడ్డు పరిస్థితులను సైతం తమకు అనుగుణంగా మార్చుకుని మనుగడను సాధించే ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్, రాక్షస జాతి(సైల్ఫిన్ క్యాట్‌ఫిష్) చేపలు నానాటికి పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం కొల్లేరులో ఎక్కువగా లభ్యమయ్యే చేపల్లో మొదటి స్థానం రాక్షస జాతి, రెండో స్థానం క్యాట్‌ఫిష్‌ది. అతి తక్కువ నీరు, ఎక్కువ వ్యాధి నిరోధక శక్తి, భయంకరమైన మాంసాహారులుగా పేరొందిన ఈ రెండు జాతులు ఇతర చేపల్ని వేటాడి తినడం వల్ల కొల్లేరులో ఇతర జాతులకు మనుగడకు ముప్పు వాటిల్లుతుంది.

క్యాట్‌ఫిష్ సాగు వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పుతోపాటు మనుషుల్లో అనేక వ్యాధులు వస్తున్నాయని 1995 పర్యావరణ వేత్తలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. 1997లో వీటి సాగుపై కేంద్రప్రభుత్వం నిషేధాన్ని విధించింది. అప్పటి నుంచి సాగు లేకపోయినా కొల్లేరులోని ఇతర మత్స్య జాతులను వేటాడుతూ తన ఉనికిని చాటుకుంటోంది. రాక్షస జాతి చేపలు ఆక్వేరియంలో నాచుని తగ్గించుకోవడానికి వృద్ధి చేశారు. పదేళ్లుగా వీటి సంతతి పంట కాలువలు, చేపల చెరువుల్లో,



ప్రస్తుతం పెద్దఎత్తున కొల్లేరులో దర్శనమిస్తున్నాయి.


**తీవ్రంగా నష్టపోతున్న మత్స్యకారులు..**

2006 కొల్లేరు ఆపరేషన్ తర్వాత ఎక్కువ మంది మత్స్యకారులు కొల్లేరులో వేటను సాగిస్తూ జీవనాన్ని గడుపుతున్నారు. కానీ గత నాలుగేళ్లుగా క్యాట్‌ఫిష్ జాతి పెరిగి పోవడంతో ఇతర జాతులు లభ్యత క్రమంగా తగ్గుముఖం పట్టింది. అరుదైన జాతులు కనుమరుగవటం క్యాట్‌ఫిష్ స్థాయి పెరిగిపోవడంతో మత్స్యకారులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అంతరించిపోయే దశలో నల్లజాతి చేపలు.. కొల్లేరులో 126 రకాల చేపలు పెరుగుతుంటాయి. కొన్నేళ్లుగా వేసవిలో కొల్లేరు తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితులు ఎదుర్కొంటోంది. దీంతో కొల్లేరులో ఏటా నల్లజాతి మత్స్య సంపద తరిగిపోతూ వస్తోంది. కానీ తీవ్ర నీటి ఎద్దడిని తట్టుకుని, బురదలో బతికే స్వభావం ఉన్న ఈ రెండు జాతులు మాత్రం పిల్లలను పెడుతూ దాన్ని వృద్ధి చెందుతున్నాయి.

**చాలా ప్రమాదకరం..** క్యాట్‌ఫిష్ జాతులు చాలా ప్రమాదకరమైనవిగా గుర్తించి ప్రభుత్వం దీన్ని నిషేధించింది. కొల్లేరులో పెరుగుతున్న సైల్ఫిన్ క్యాట్‌ఫిష్, క్యాట్‌ఫిష్‌ను అడ్డుకోవడం సాధ్యమయ్యే పనికాదు. రసాయనాలను వినియోగిస్తే ఇతర జాతులకు ముప్పు. క్యాట్‌ఫిష్ జాతులు దొరికినప్పుడు వాటిని నాశనం చేసేలా మత్స్యకారులే చర్యలు తీసుకోవాలి. – రాజ్‌కుమార్ ఇన్‌చార్జి ఏడీ, మత్స్యశాఖ

# తమన్నా ఏమి చేసింది నేరం.. ఆమెపై ఎందుకు కన్నడ కోపం?

మైసూర్ శాండల్ సోప్ ఎంతో ప్రసిద్ధి చెందిన సంగతి తెలిసిందే. అలాంటి సోప్ బ్రాండ్ అంబాసిడర్ గా నటి తమన్నా ఎంపికయ్యారు. ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. రెండేళ్ల కాలానికి రూ. 6.2 కోట్లు చెల్లించేలా "కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ సంస్థ" (కే.ఎస్.డీ.ఎల్) ఆమెతోఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఈ విషయం కన్నడ నాట కొత్త రచ్చకు తెరలేపింది. అవును... మైసూర్ శాండిల్ సోప్ కు బ్రాండ్ అంబాసిడర్ గా తమన్నాతో కే.ఎస్.డీ.ఎల్. ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సోప్ తో పాటు ఆ సంస్థకు చెందిన ఇతర ఉత్పత్తులకు కూడా ఆమె ప్రకటనలు చేయనున్నారు. దీంతో.. కన్నడనాట వివాదానికి తెరలేచింది. కర్ణాటకలో ఎంతో మంది టాలెంటెడ్ వ్యక్తులు ఉన్నప్పటికీ.. ఇతర రాష్ట్రానికి చెందిన తమన్నానే ఎందుకు ఎంచుకున్నారంటూ విమర్శలు మొదలయ్యాయి. ఈ సమయంలో సోషల్ మీడియా వేదికగా కొంతమంది ఆమెను అభినందిస్తుంటే.. మరికొంతమంది మాత్రం కర్ణాటక ప్రభుత్వంతో పాటు ఆమెపైనా విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం.. కన్నడ ప్రజల మనోభావాలను



దెబ్బతీసిందంటూ విమర్శిస్తున్నారు. కర్ణాటకలో ఉన్న ఎంతో మంది టాలెంటెడ్ వ్యక్తులు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. దీంతో... కర్ణాటక వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ స్పందించారు. ఈ సబ్బులపై రాష్ట్రంలో ఇప్పటికే మంచి డిమాండ్ ఉందని.. ఈ నేపథ్యంలో ఈ ప్రొడక్ట్ ని దేశ వ్యాప్తంగా విస్తరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరణ ఇచ్చారు. పలువురు వాణిజ్య నిపుణుల సలహాతోనే తమన్నాను ఎంపిక చేసినట్లు మంత్రి క్లారిటీ ఇచ్చారు. అయితే.. ఈ వివాదంపై తమన్నా ఇంకా స్పందించలేదు! కాగా... 1990 సంవత్సరంలో మైసూర్ రాజు కృష్ణరాజ్ వడియార్-4.. మైసూర్ శాండిల్ సోప్ సంస్థను బెంగళూరులో స్థాపించారు. ఈ క్రమంలో 1916లో సబ్బుల తయారీలో వేగవంతమైన ఈ సంస్థ... కర్ణాటకతో పాటు దక్షిణ భారతదేశంలో ఎంతో పేరు తెచ్చుకుంది. అలాంటి చరిత్ర కలిగిన సంస్థకు తమన్నాను బ్రాండ్ అంబాసిడర్ గా ఎంపిక చేయడం.. అమె కెరీర్ లో మైలురాయి అని అంటున్నారు. అయితే... ఈ ఎంపికను కొంతమంది కన్నడిగులు మాత్రం జీర్ణించుకోలేక పోతున్నారు! కర్ణాటకలో ఎంతో మంది టాలెంటెడ్ వ్యక్తులు ఉన్నప్పటికీ.. ఇతర రాష్ట్రానికి చెందిన తమన్నానే ఎంచుకోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

# ఇన్నర్‌లో సిద్ధిక రెబల్ యాటిట్యూడ్

సిద్ధికా శర్మ పరిచయం అవసరం లేదు. నేచురల్ స్టార్ నాని సరసన పైసా వసూల్ చిత్రంలో నటించింది. కానీ టాలీవుడ్ లో ఈ భామకు కలిసి రాలేదు. అటు హిందీ పరిశ్రమలో ప్రయత్నించినా కానీ, ఆశించినంతగా పాపులర్ కాదు. అడపాదడపా పంజాబీ మ్యూజిక్ ఆల్బమ్ లతో అభిమానులకు మాత్రం టచ్ లో ఉంది. తాజాగా సిద్ధిఖి శర్మ మరో పంజాబీ సింగిల్ తో అభిమానుల ముందుకు వచ్చింది. అయితే సిద్ధిక శర్మ సోషల్ మీడియాల్లో తన అభిమానులకు కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటిస్తోంది. తాజాగా ఈ బ్యూటీ ఇన్నర్ సొగసును ఎలివేట్ చేస్తూ, కుర్రకారు హృదయాలను స్పర్శించింది. బ్లాక్ కలర్ ఇన్నర్, కాంబినేషన్ బ్లాక్ ట్రాక్ ని ధరించిన సిద్ధిక రెబలియన్ స్టైల్లో ఫోజులిచ్చింది. బ్లాక్ ఇన్నర్ పై కవరింగ్ కోట్ ని కూడా ధరించింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే సిద్ధిక సినిమాలు,



సిరీస్ లతో బిజీగా ఉంది. మరోవైపు సింగిల్స్ లోను నర్తిస్తోంది. ఇటీవలే విడుదలైన ఓయే మఖ్నా నుండి రొమాంటిక్ ట్రాక్ ఎన్హా అంఖియాన్ చ్ పావా కివే కజ్రా%-%లో కొత్త జంట సిద్ధికా శర్మ - అమ్మీ విర్క్ పై గీతం. ఇప్పుడు టి సిరీస్ భూషణ్ కుమార్ నిర్మించిన తాజా ఆల్బమ్ లో సిద్ధిక మరోసారి మెరిసింది. అద్భుతమైన ఎమోషన్స్ పలికిస్తూ మంచి సాహిత్యంతో పాటల్ని స్వరపరిచే గాయకుడు-స్వరకర్త మనన్ భరద్వాజ్ రొమాంటిక్ గీతం మై తేరే సంగ్ లో సిద్ధికకు అవకాశం కల్పించారు. ఇది ఒక అందమైన రొమాంటిక్ సాంగ్. ఒక చిన్న టౌన్ లో అందంగా మలిచారు. మానవ్ తో సిద్ధిక రొమాన్స్ గొప్పగా పండింది. ఈ పాటకు సాహిల్ బఘ్రూ దర్శకత్వం వహించారు. ఇప్పుడు అన్ని స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉంది. బాలీవుడ్ - పంజాబీ మ్యూజిక్ సర్క్యూట్‌లో ఇప్పటికే సుపరిచితమైన పేరు మనన్ భరద్వాజ్, యానిమల్ నుండి అర్జన్ వైల్లీ, యారియన్ 2 నుండి ఊంచి ఊంచి దీవారేన్ లతో పాపులరయ్యాడు. అతడి నుంచి లేటెస్ట్ సాంగ్ మై తేరే... ప్రేక్షకులను ఆకట్టుకుంది.




# గిచ్చామకు.. అంటూ భైరవం నుంచి మరో మాస్ బీట్



తెలుగు సినీ ప్రేక్షకులను ఊరిస్తోన్న మాస్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ 'భైరవం' ప్రమోషన్స్‌కు కొత్త ఊపొస్తోంది. బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ వంటి మూడు పాపులర్ హీరోలు ఒకే ఫ్రేములో కనిపించనున్న ఈ భారీ మాస్ ఎంటర్టైనర్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ట్రైలర్ సూపర్ రెస్పాన్స్ తెచ్చుకోగా, తాజా గా రిలీజ్ చేసిన మాస్ ఫోక్ సాంగ్ 'గిచ్చమాకు' సినిమాపై మరింత క్రేజ్ పెంచుతోంది. శ్రీచరణ్ పాకల స్వరపరిచిన ఈ పాట మాస్ ఆడియెన్స్ ను కుదిపేస్తోంది.

ధనుంజయ్ సీపాన, సౌజన్య భాగవతుల గాత్రంలో ఈ పాటకు ప్రత్యేకమైన జోష్, ఎనర్జీ అందింది. మాస్ బీట్‌లకు ఆకట్టుకునే లిరిక్స్ తో పాటు మెలోడీ టచ్ ఉన్న నేపథ్యం ప్రేక్షకుల్ని థియేటర్లలో డాన్స్ చేయించడమే కాకుండా టిక్‌టాక్, రీల్స్‌తో ట్రెండ్ అయ్యేలా తయారైంది. ఈ పాట విజువల్స్ కూడా అలరిస్తున్నాయి. బెల్లంకొండ శ్రీనివాస్, అదితి శంకర్ జంటగా చేసిన ఎనర్జిటిక్ డ్యాన్స్ స్టెప్పులు సినిమాకే హైలైట్ అవుతాయని అర్థమవుతుంది. ఈ పాటలోని పల్లవి నుంచి చరణం వరకు క్యాచీ మూమెంట్స్ అన్ని కూడా థియేటర్స్ లో విజిల్స్ వేయించేలా ఉన్నాయి. సినిమా మాస్ ఆడియెన్స్‌కి పండగగా మారేలా చేస్తుందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. అలాగే ఈ పాటే సినిమాలోని మాస్ మూమెంట్స్‌కు ఓ టర్నింగ్ పాయింట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. విజయ్ కనకమేడల డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ రూరల్ యాక్షన్ డ్రామా భారీ స్థాయిలో నిర్మితమవుతోంది. KK రాధామోహన్ నిర్మాణంలో రూపొందిన ఈ చిత్రం మే 30న గ్రాండ్ గా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్లు, పోస్టర్లు సినిమాపై బజ్ ని పెంచగా, లేటెస్ట్ గా ఈ పాటతో మాస్ జనాల హైప్ రెగ్యులర్‌గానే ట్రాక్‌లోకి వచ్చింది.

ఈ పాట విడుదల తర్వాత, మిగతా ప్రమోషన్లను మరింత వేగవంతం చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. సినిమా స్టోరీలైన్, మల్టీ స్టార్ కాంబినేషన్, మ్యూజిక్ మాస్ ఎలిమెంట్స్‌తో భైరవం సినిమా వేసవి థియేటర్లలో మాస్‌కి ఫెస్టివల్‌గా మారనుందని అనిపిస్తోంది. 'గిచ్చమాకు' పాటకు వచ్చిన రెస్పాన్స్ చూస్తే, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా హవా చూపడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది. మరి సినిమాకు బాక్సాఫీస్ వద్ద ఓపెనింగ్స్ ఎలా ఉంటాయో చూడాలి.

# డెకాయిటే ముందొస్తాడా?




టాలీవుడ్ లోని టాలెంటెడ్ నటుల్లో అడివి శేష్ కూడా ఒకడు. అతన్నుంచి సినిమా వస్తుందంటే అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. శేష్ ఒక సినిమా చేశాడంటే ఆ సినిమాలో మంచి కంటెంట్ ఉంటుందనే పేరుని అతను సంపాదించుకున్నాడు. అలాంటి శేష్ హీరోగా సినిమా వచ్చి చాలా రోజులవుతుంది. ప్రస్తుతం శేష్ రెండు సినిమాలు చేస్తున్నాడు. అందులో ఒకటి గూఢచారి2 (జీ2) కాగా మరొకటి డెకాయిట్. ఈ రెండు సినిమాలూ ప్రస్తుతం ప్రొడక్షన్ లోనే ఉన్నాయి. అయితే గూఢచారి2 మరియు డెకాయిట్ సినిమాల్లో ముందుగా జీ2 సినిమానే రిలీజవుతుందని అందరూ అనుకున్నారు. కానీ ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తూ జీ2 కంటే ముందు డెకాయిట్ సినిమానే రిలీజవుతున్నట్టు తెలుస్తోంది. డెకాయిట్ సినిమాకు షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నాడు. షానియల్ డియో అంటే మరెవరో కాదు, శేష్ నటించి సూపర్ హిట్లు అందుకున్న క్షణం, గూఢచారి సినిమాలకు అతను సినిమాటోగ్రఫర్ గా పని చేశాడు. డెకాయిట్ రిలీజ్ డేట్ గురించి ట్రేడ్ వర్గాల్లో ఓ వార్త వినిపిస్తోంది. ఈ సినిమా 2025 డిసెంబర్ లో రిలీజ్ కానుందని వార్తలు వినిపిస్తున్నాయి. డెకాయిట్ రిలీజ్ డేట్ కు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ను మేకర్స్ సోమవారం రోజున ఇచ్చే అవకాశముందని తెలుస్తోంది. ఈ సినిమాలో ముందుగా శృతి హాసన్ ను హీరోయిన్ గా తీసుకుని కొంత భాగం షూటింగ్ కూడా చేశారు. ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల శృతి డెకాయిట్ నుంచి తప్పుకోగా ఆ స్థానంలోకి మృణాల్ ఠాకూర్ వచ్చింది. డెకాయిట్ సినిమాతో ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ టాలీవుడ్ లోకి నటుడిగా అడుగుపెడుతున్నారు. సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా కు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, డెకాయిట్ తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతోంది.

# రెండేళ్ల దాకా భాగ్యశ్రీ బిజీ బిజీ..!

ఏ ముహుర్తాన తెలుగు తెరకు పరిచయం అవ్వాలని అనుకుందో కానీ ఇప్పుడు ఆమె నెక్స్ట్ స్టార్ హీరోయిన్ గా అవతరించబోతుంది. వరుస స్టార్ ఛాన్స్ లు ఆమెకు వస్తున్నాయి. ఇంతకీ ఎవరా లక్కీ హీరోయిన్ అని అనుకుంటున్నారు కదా ఇంకెవరు ఆమె మన భాగ్యం అదే అండి భాగ్య శ్రీ బోర్స్. బాలీవుడ్ లో ఒక సినిమా చేసిన ఆమె మన డైరెక్టర్ హరీష్ శంకర్ దృష్టిలో పడింది. ఆయన సినిమాల్లో హీరోయిన్స్ కి మంచి క్రేజ్ ఉంటుంది. అంతేకాదు హరీష్ శంకర్ హిట్ ఇచ్చిన హీరోయిన్స్ కెరీర్ టాప్ రేంజ్ కి వెళుంది. శృతి హాసన్, పూజా హెగ్డే లాంటి హీరోయిన్స్ కి మొదటి బ్రేక్ ఇచ్చిన డైరెక్టర్ ఆయనే. భాగ్య శ్రీ ని కూడా మిస్టర్ బచ్చన్ సినిమాతో పరిచయం చేసిన హరీష్ శంకర్ ఆమె లోని గ్లామర్ యాంగిల్ తో ఆడియన్స్ ని ఫిదా చేశాడు. ఐతే మిస్టర్ బచ్చన్ సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ కాలేదు. అయినా సరే భాగ్య శ్రీకి వరుస అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం అమ్మడు మూడు క్రేజీ సినిమాలతో బిజీగా ఉ






ంది. అందులో ఒకటి విజయ్ దేవరకొండ కింగ్డమ్ కాగా మరోటి ఎనర్జిటిక్ స్టార్ రామ్ తో చేస్తున్న ఆంధ్రా కింగ్ తాలూకా ఉంది. ఈ రెండిటితో పాటు దుల్కర్ సల్మాన్ రానా నటిస్తున్న కాంత సినిమా కూడా తెలుగు, తమిళ భాషల్లో బైలింగ్వల్ మూవీగా వస్తుంది. ఈ 3 సినిమాలతో భాగ్య శ్రీ ఆడియన్స్ కు మరింత దగ్గర కానుంది. ఐతే ఈమధ్య ఒక సినిమా కోసం భాగ్య శ్రీని దర్శక నిర్మాతలు కలిస్తే మరో ఆరు నెలల దాకా ఏమి చెప్పలేనని అన్నదట. ఆల్రెడీ అమ్మడికి మరో రెండు సినిమాలు లైన్ లో ఉన్నాయి. సో హిట్ లేకపోయినా సక్సెస్ ఖాతా తెరవకపోయినా కూడా భాగ్య శ్రీ డిమాండ్ అలా ఉంది. భాగ్య శ్రీ మూమెంట్ చూస్తుంటే తప్పకుండా టాలీవుడ్ లో టాప్ హీరోయిన్ గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టార్ మెటీరియల్ అయిన ఈ అమ్మడిని మన మేకర్స్ ఏమేరకు ఆమె టాలెంట్ వాడుకుంటారన్నది చూడాలి. రాబోతున్న మూడు సినిమాల్లో ఒక్కటి హిట్టు పడినా కూడా భాగ్య శ్రీని ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పొచ్చు.

# అందాల రాక్షసిలా అనసూయ హొయలు

గ్లామర్‌కు మరో పేరు అనసూయ అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. టెలివిజన్ షోలకు యాంకర్‌గా ఎంట్రీ ఇచ్చిన ఆమె, ఇప్పుడు సినిమాల్లో హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, సూపర్ గ్లామరస్ ఇమేజ్‌తో వెలుగొందుతోంది. లేటెస్ట్ గా అనసూయ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన తాజా ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పుష్ప చిత్రంలోని దాక్షాయణి పాత్రతో మంచి గుర్తింపు పొందిన అనసూయ, ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచాన్ని మరో మెట్టు ఎక్కిస్తూ దర్శనమిచ్చింది. ఈ సారి అనసూయ ఫుల్ బ్లాక్ థీమ్‌లో ఉండే బ్లౌజ్, పుష్పగుచ్ఛాల డిజైన్‌తో ఉన్న ఫ్లోరల్ చీరతో మెరిసింది. నైట్ లైట్స్‌లో ఆమె కరెంట్ కట్‌లా మెరిసిపోయింది.



ప్రత్యేకంగా ఆమె పెట్టుకున్న గ్రీన్ నోస్ రింగ్, డిఫరెంట్ హెయిర్ స్టైల్‌తో అందరూ సూపర్ గ్లామర్ అని కామెంట్లు చేస్తున్నారు. ఫోటోషూట్‌లో అనసూయ చేసిన పోజులు బోల్డ్‌గా, సెన్సేషన్‌గా ఉండటంతో నెటిజన్స్ ఆకర్షితులయ్యారు. ఆమె స్టైల్, కాన్ఫిడెన్స్‌కి మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నారు. అనసూయ కెరీర్ విషయానికొస్తే, 'క్షణం' సినిమా ద్వారా తన నటనకు మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ టాలెంటెడ్ యాక్ట్రెస్, 'రంగస్థలం' సినిమాలో రంగమ్మత్త పాత్రతో మరో లెవెల్ కు వెళ్ళింది. ఆ తర్వాత 'పుష్ప'లో దాక్షాయణిగా రఫ్ అండ్ టఫ్ రోల్ చేసి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. టీవీ యాంకరింగ్‌లో వచ్చిన అనుభవాన్ని సినిమాల్లో ఉపయోగిస్తూ, బోల్డ్ గా ఉండే పాత్రలను ఎంచుకుంటూ ముందుకెళ్తోంది. ఇప్పుడు సోషల్ మీడియాలోనూ అనసూయ అంతే యాక్టివ్. ఎప్పటికప్పుడు ఫ్యాషన్‌కి సంబంధించిన ఫోటోషూట్లు, రీల్స్ షేర్ చేస్తూ ట్రెండింగ్‌లో నిలుస్తోంది. ముఖ్యంగా ఈ కొత్త ఫోటోషూట్‌లో అనసూయ చూపించిన బోల్డ్ లుక్ చూసిన అభిమానులు 'అందాల రాక్షసిలా ఉంది' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇప్పటికే తన నటనతో సినిమాల్లో విలక్షణ గుర్తింపు తెచ్చుకున్న అనసూయ.. ఇప్పుడు ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇస్తూ మరోసారి ఫ్యాన్స్‌ని ఊపేస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536